

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


ఎగుమతులకు 'యుద్ధం' దెబ్బ
కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి
చాబహార్ పోర్టు కోల్పోవడం మధ్య ఆసియా దౌత్యానికి ఎదురుదెబ్బ : కాంగ్రెస్ 05


సంపుటి 09, సంచిక: 106 | సోమవారం | 16-03-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## బెంగాల్‌లో వామపక్షాలకు పునర్వైభవం

- కేరళలో ఎల్‌డిఎఫ్‌కు మూడోసారి అధికారం
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**రాంచీ:** పశ్చిమ బెంగాల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పునర్వైభవం వస్తుందని వామపక్షాలు ఎంతో విశ్వాసంతో ఉన్నాయని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాలకు దిశానిర్దేశం చేసేస్థాయిలో వామపక్షాలు ఒకబలమైన శక్తిగా రూపుదిద్దుకుంటాయన్నారు. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో భారత ఎన్నికల సంఘం ఎన్నికల ప్రకటన చేయడానికి కొద్ది గంటల ముందుగా డి.రాజా పైవిధంగా ప్రకటన చేశారు. "పశ్చిమ బెంగాల్‌లో తరువాయి 12లో

## 4 రాష్ట్రాలు యుటిలో ఎన్నికల నగారా




**ఎక్కడ.. ఎన్ని స్థానాలు?**

పశ్చిమబెంగాల్లో 294, తమిళనాడులో 234, కేరళంలో 140, అసోంలో 126, పుదుచ్చేరిలో 30 శాసనసభ స్థానాలు

### బెంగాల్, తమిళనాడు, కేరళం, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు

**నాలుగు రాష్ట్రాలు, యుటి పుదుచ్చేరిలో**

మొత్తం ఓటర్ల సంఖ్య : 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు : 824
పోలింగ్ స్టేషన్లు : 2.19లక్షలు
ఎన్నికల అధికారులు : 25 లక్షలు




| అసెంబ్లీ | పోలింగ్ | కౌంటింగ్ |
|---|---|---|
| తమిళనాడు | ఏప్రిల్ 23 | మే 4 |
| పశ్చిమ బెంగాల్ | ఏప్రిల్ 23 (1 ఫేజ్)<br>ఏప్రిల్ 29 (2 ఫేజ్) | |
| కేరళం | ఏప్రిల్ 9 | |
| అసోం | ఏప్రిల్ 9 | |
| పుదుచ్చేరి | ఏప్రిల్ 9 | |

న్యూఢిల్లీ : దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇసి వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం.. అసోం, కేరళం, పుదుచ్చేరిల్లో ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక పశ్చిమ బెంగాల్ రెండు విడుతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి విడుత పోలింగ్ ఏప్రిల్ 23న, రెండో విడుత పోలింగ్ ఏప్రిల్ 29న జరుగనుంది. మే 4న నాలుగు రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల తరువాయి 2లో

**ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు**

ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

**కేరళంలో 25 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించిన సిపిఐ** 2



## నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- ఉదయం 11.45 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగం
- 20న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశం
- సమావేశాలకు అధికార, విపక్ష పార్టీలు సన్నద్ధం
- పేదల ఇళ్లు, ప్రజా సమస్యలను లేవనెత్తనున్న సిపిఐ

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ బడ్జెట్ సమావేశాలకు అధికార,విపక్ష పార్టీలు సన్నద్ధమయ్యాయి. బడ్జెట్ సమావేశాలు ఈసారి వాడివేడిగా జరిగే అవకాశముంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, తాజా పరిణామాలపైన అధికార పార్టీని ఇరకాటంలో పెట్టేందుకు విపక్షాలు, వారి ప్రశ్నలకు ధీటుగా సమాధానం చెప్పడానికి అధికార కాంగ్రెస్ సిద్ధమైంది. బడ్జెట్ కేటాయింపులతో పాటు, రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులు, మూసీ ప్రాజెక్ట్, కొత్త విద్యావిధానం, సోషల్‌మీడియా సమగ్ర పాలసీ, భూ నిర్వాసితులు, 'కాళేశ్వరం విచారణ', నది జలాలు, పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ తీర్పు, తాజాగా డ్రగ్స్ కేసు లాంటి పలు అంశాలకు బడ్జెట్ సమావేశాలు వేదికకానున్నాయి.

**గవర్నర్ ప్రసంగం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ :** ఉభయ సభలనుద్దేశించి సోమవారం ఉదయం 11: 45 గంటలకు నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగంతో శాసనసభ బడ్జెట్ సమావేశం ప్రారంభం కానుంది. అంతకు ముందు శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. గవర్నర్ ప్రసంగం తర్వాత శాసనమండలి, శాసన సభల కార్యకలాపాల సలహా సంఘాలు (బిఎసి) వేర్వేరుగా సమావేశమై బడ్జెట్ సమావేశ పని దినాలను, ఏజెండా అంశాలను ఖరారు చేయనుంది. ఈ నెల 20వ తేదీన డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ – 2026–27ను ప్రవేశపెట్టనున్నారు. కాగా ఇటీవల శాసనసభ ప్రాంగణంలో ప్రారంభించిన శాసనమండలిలోనే ఈ సారి పెద్దల సభ సమావేశాలు జరగనున్నాయి.

**ప్రైవేట్ మెంబర్స్ బిల్, ప్రివిలేజ్ మోషన్‌కు సిద్ధపడిన బిఆర్‌ఎస్**

ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ ఆరు గ్యారంటీల అమలుపైన శాసనసభలో ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్ కెటిఆర్ ఇది వరకే తరువాయి 2లో



## ఈనెల 22న రైతు భరోసా

- మూడువిడతల్లో 9వేల కోట్లను రైతు ఖాతాలో జమచేయనున్న ప్రభుత్వం
- సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా మొదటివిడత రూ.3,590 కోట్లను 70 లక్షల మంది రైతుల ఖాతాలో జమచేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం మూడు విడుతల్లో రూ.9 వేల కోట్లను నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ఇందుకు ఈనెల 22 వ తేదీన ముహూర్తం ఖరారు చేసింది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండున్నర ఏళ్ల కాలంలో ఇప్పటీ వరకు ఒక దఫా మాత్రమే రైతు భరోసా నిధులు విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం అందిస్తున్న తరువాయి 12లో

## గల్ఫ్‌దేశాలపై ఇరాన్ ప్రత్యక్ష యుద్ధం!

- యుద్ధం ముగించేందుకు సిద్ధంగా లేం : ట్రంప్
- మరో మూడు వారాలు యుద్ధం : ఐడిఎఫ్
- హోర్ముజ్ నౌకల విడుదలకు బ్రిటన్ జోక్యం
- ఇరాన్ నగరం ఇస్ఫహాన్‌లో ఇజ్రాయెల్ విధ్వంసం
- నెతన్యాహూ హత్యకు ఐఆర్‌జిసి ప్రతిజ్ఞ
- లెబనాన్‌తో చర్చల్లేవు : ఇజ్రాయెల్ ప్రకటన





**దుబాయ్ :** గల్ఫ్‌దేశాల్లో ఇప్పటివరకూ అమెరికా స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన ఇరాన్ ఆదివారం 16వ రోజు యుద్ధంలో అమెరికాయేతర ఆస్తులను ధ్వంసం చేసేందుకు సిద్ధమైంది. యుద్ధాన్ని విస్తరిస్తామని ఇరాన్ ప్రకటించిన తర్వాత ఆదివారం ఉదయం ఐఆర్‌జిసి కొత్త దాడులు చేసిందని, ఇరాన్ క్షిపణి దాడులను తాము అడ్డుకున్నామని గల్ఫ్ దేశాలు పేర్కొన్నాయి. ఇజ్రాయెల్‌పై భారీగా క్షిపణి దాడులు చేసింది. కువైత్ వైమానికస్థావరాలపై కూడా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. అదేవిధంగా ఇరాన్ నగరం ఇస్ఫహాన్‌పై ఇజ్రాయెల్ చాలా తీవ్ర స్థాయిలో దాడులు కొనసాగించింది. ఆ నగరం బాంబు దాడులతో దద్దరిల్లింది. నగరం అంతటా నల్లని పొగలు కమ్ముకున్నాయి. యుద్ధ విరమణ సంప్రదింపులకు ఇరాన్ సిద్ధంగా ఉందని, ఐనా గానీ అమెరికా మాత్రంఅందుకు సిద్ధంగా లేదని తమ లక్ష్యం పూర్తయ్యే వరకూ యుద్ధం ఆగదని ట్రంప్ ప్రకటించారు. మరో మూడు వారాలు యుద్ధం కొనసాగస్తామని ఇజ్రాయెల్ కూడా తాజా ప్రకటన చేసింది. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశాలు కనిపించడంలేదు. ఇరాన్ దాడులతో గల్ఫ్‌దేశాల్లో 14 మంది మరణించారు.వీరిలో ఎక్కువమంది వలస కార్మికులే ఉన్నారు. పశ్చిమాసియా యుద్ధంలో ఇప్పటివరకూ 1300 మందిమరణించినట్లు రెడ్ క్రాస్ ఇంటర్నేషనల్ కమిటీ ప్రకటించింది. అమెరికా దాడులవల్ల 223 మంది మహిళలు, 202 మంది పిల్లలు మరణించినట్లు ఇరాన్ పేర్కొంది. ఇజ్రాయెల్‌లో కూడా తరువాయి 2లో




## మతాల మధ్య చిచ్చుకు యత్నం

- కుట్రలను ప్రజలంతా కలిసికట్టుగా ఎదుర్కోవాలి
- ముస్లిం మైనారిటీలకు అత్యంత ప్రాధాన్యం
- ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మతాల మధ్య విభేదాలు రేపేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి కుట్రలను ప్రజలు కలిసి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో సోదరభావం పెంపొందించి, మతసామరస్యంతో కలిసి మెలిసి జీవించడం ఎంతో అవసరమన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని, ప్రసంగిస్తూ రంజాన్ కేవలం పండుగ మాత్రమే కాదని, ఆత్మశుద్ధి చేసుకునే పవిత్ర సమయం తరువాయి 2లో

**రైతు సమస్యల పరిష్కారానికి**

## 18న కలెక్టరేట్ల ముందు ధర్నా

- తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రకటన
- పంటల బీమా పథకం రాష్ట్రస్థాయిలో రూపొందించి అమలు చేయాలని డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు పంటల బీమా పథకం రాష్ట్ర స్థాయిలో రూపొందించి అమలు తదితర డిమాండ్లతో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాలలో రైతులు పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ విజ్ఞప్తి చేశారు. రెండు లక్షలకు పైబడి ఉన్న రైతుల పంట రుణాలను ప్రభుత్వం వెంటనే మాఫీ చేసి ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అదేవిధంగా మొక్కజొన్న పంటను మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ.2400కు కొనుగోలు చేయాలని, యూరియాను రైతులకు యాప్ ద్వారా అందించే విధానంలో లోపాలను సరిదిద్దడంతో పాటు సులభతరం చేయాలని, తరువాయి 12లో

## డ్రగ్స్ కేసులో 11 మంది అరెస్ట్

- ఏలూరు ఎంపి మహేశ్‌కుమార్, బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యే నమిత్ శర్మ సహా నిందితుల్లో పలువురు వ్యాపారవేత్తలు
- మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ పై ఈగల్ టీం దాడి పోలీసులపై కాల్పులు..డ్రగ్స్, ఆయుధాలు స్వాధీనం డ్రగ్ టెస్టుల్లో నేతలకు పాజిటివ్



ప్రజాపక్షం/హైదరాబాద్

డ్రగ్స్ కేసులో టిడిపి ఏలూరు ఎంపి మహేష్‌కుమార్ యాదవ్‌తో పాటు బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, రాజస్థాన్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే నమిత్ శర్మ, రితేష్ రెడ్డి,కౌశిక్ రవి, మరికొంతమంది వ్యాపారవేత్తలతో పాటు మొత్తం 11 మందిని పోలీసులు అరెస్టు తరువాయి 2లో

## డిఫాల్ట్ మిల్లర్ల మెడకు ఉచ్చు



- ప్రభుత్వానికి 3,897 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి
- మార్కెట్ విలువ రూ.144 కోట్లు వసూలుకు రెవెన్యూ రికవరీ చట్టం
- మిల్లర్ల ఆస్తుల వివరాలు, రిజిస్ట్రేషన్లకు బ్రేక్

ప్రజాపక్షం/వరంగల్

ప్రభుత్వ దాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి అప్ప గించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్ల ఆట కట్టించేందుకు వరంగల్ జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. రాజకీయ అండదండలతో కాలయాపన చేస్తున్న డిఫాల్టర్లపై కలెక్టర్ సత్యశారద కొరడా ఝుళిపించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న వందల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును రాబట్టేందుకు రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించాలని నిర్ణయించారు.

**ఏడేళ్ల మొండి బకాయిలు :** 2017 నుంచి 2023–24 రబీ సీజన్ వరకు జిల్లాలో సుమారు 30 మంది మిల్లర్లు ప్రభుత్వానికి ధాన్యం బకాయి పడ్డారు. వారి వద్ద నుంచి రావాల్సిన 4,383.97 మెట్రిక్ టన్నుల దాన్యం విలువ అక్షరాలా రూ.159.89 కోట్లు. అందులో ఇప్పటి వరకు అధికారులు రూ.15.39 కోట్ల విలువైన ధాన్యం మాత్రమే వసూలు చేయగలిగారు. ఇంకా రూ.144 కోట్ల విలువైన ధాన్యం రావాల్సి ఉంది. ఇప్పటికే వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తరువాయి 12లో

## ఎయిర్ ఇండియాలో భారీ కుంభకోణం

4వేల మంది ఉద్యోగులపై వేటుకు టాటా గ్రూప్ సిద్ధం!

**ముంబయి :** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా అంతర్గత సంక్షోభం ఎదుర్కొంటోంది. సంస్థ తన ఉద్యోగులకు కల్పించే 'ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని' వేలాది మంది సిబ్బంది దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. ఈ కుంభకోణంలో సుమారు 4వేల మందికి పైగా ఉద్యోగులు భాగస్వాములైనట్లు గుర్తించిన యాజమాన్యం... వారిపై కఠిన చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. ఎయిర్ ఇండియా విధానం ప్రకారం, ప్రతి ఉద్యోగికి ఏడాదికి 14 ఉచిత రిటర్న్ టికెట్లు తరువాయి 12లో

# వియత్నాం పార్లమెంటు ఎన్నికల పోలింగ్ పూర్తి





**హనోయ్:** సోషలిస్టు రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం అత్యున్నత చట్టసభకు ఆదివారం పోలింగ్ ప్రక్రియ జరిగింది. దీంతో పాటే స్థానిక సంస్థలకు కూడా ఎన్నికల పోలింగ్ పూర్తిచేశారు. మార్చి 25వ తేదీలోపు ఎన్నికల ఫలితాలు వెలువడతాయని నేషనల్ అసెంబ్లీ ఛైర్మన్ ట్రాన్ థాన్ మాన్ చెప్పారని వియత్నాం న్యూయస్ ఏజన్సీ ప్రకటించింది. ఏప్రిల్ ఆరో తేదీన కొత్త పార్లమెంటు మొదటి సమావేశం జరుగుతుంది. ఐదు సంవత్సరాలకు ఒకసారి వియత్నాం చట్టసభకు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతంతో లామ్ వియత్నాం దేశాధ్యక్షుడుగా, కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏకపార్టీ విధానంలో ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. వియత్నాం పార్లమెంటులో 500 స్థానాలు ఉండా 251 స్థానాలు పరిపాలనకు మెజార్టీ ఉండాలి. అదేవిధంగా మరో 14 మంది కమ్యూనిస్టుపార్టీయేతరులు పార్లమెంటులో సభ్యులుగా ఉంటారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై రాత్రి ఏడు గంటలకు పోలింగ్ ముగిసింది. దేశంలో 7.90 కోట్లమంది అర్హులైన ఓటర్లు కోసం 72,195 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వియత్నాం పార్లమెంటును నేషనల్ అసెంబ్లీ అని పిలుస్తారు. 864 మంది సభ్యుల నుండి ఓటర్లు 500 మంది డిప్యూటీలను 16వ నేషనల్ అసెంబ్లీకి ఎన్నుకుంటారు. అదేవిధంగా అన్నిస్థాయిల్లోనూ పీపుల్స్ కౌన్సిల్‌కు, ప్రొవిన్షియల్ స్థాయిలో సభ్యుల ఎన్నికకు పోలింగ్ జరిగింది. ప్రస్తుత అధ్యక్షుడు తో లామ్ 2024 జులై 18న బాధ్యతలు తీసుకున్నారు. వియత్నాంలో 28 రాష్ట్రాలు, ఆరు మున్సిపల్ నగరాలు ఉన్నాయి. వీటిని ప్రత్యేక కమ్యూన్లుగా, వార్డులుగా, స్పెషల్ అడ్మినిస్ట్రేటివ్ రీజియన్‌లు విభజించి సులభతర పరిపాలనా పద్ధతుల్లో విధానాలు అమలు చేస్తారు.

## 15 మందితో మంత్రివర్గం ఏర్పాటుకు నేపాల్ ప్రధానమంత్రి అభ్యర్థి షా కసరత్తు



కాఠ్మండు: నేపాల్ పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పి)లో ప్రధానమంత్రి అభ్యర్థి బాలేంద్ర షా 15 మంది సభ్యులతో మంత్రివర్గం ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశం జరుగుతుంది. బాలేంద్ర షాను పార్లమెంటరీపార్టీ నాయకుడుగా ఎన్నుకునే ప్రక్రియను సులభతరం చేసేందుకు పార్టీ కీలక నిబంధనావళిని కూడా మార్పులు చేసేందుకు సెంట్రల్ కమిటీ కసరత్తు చేస్తోంది. 2022లో ఆవిర్భవించి మొన్న మొన్నటివరకూ రాజకీయాల్లో బలహీనశక్తిగా కొనసాగిన ఆర్‌ఎస్‌పి దేశంలో జనరేషన్ జెడ్ ఉద్యమం ద్వారా బలపడి యువశక్తితో ముందుకు వచ్చింది. పార్టీ నాయకుడు లామించానేతోపాటు ఝాపా–5 నియోజకవర్గంలో రాజకీయ వృద్ధనేత, కమ్యూనిస్టునేత, మాజీ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలేను అవలీలగా ఓడించిన బాలేంద్ర షా కూడా భారీ ప్రచార కార్యక్రమాల ఒత్తిడివల్ల ఇటీవల అస్వస్థతకు గురికావడంవల్ల ప్రభుత్వ ఏర్పాటు మంతనాలు జాప్యమయ్యాయి. వారు మొన్న గురువారం ఒక్కసారి మాత్రమే సమావేశమయ్యారు. తర్వాత ఫోన్ సంభాషణలు చేశారు. పార్టీ కార్యవర్గం సమావేశమై దామాషా ప్రాతిపదికపై పార్టీకి వచ్చిన సీట్లలో అభ్యర్థులుగా ఎవరిని నియమించాలనే విషయంలో ఎంపిక బాధ్యతలను లామించానే, బాలేంద్ర షాలకు అప్పగిస్తుంది.ఈ సమావేశంలోనే బాలేంద్ర షా మంత్రివర్గ సభ్యుల ఎంపిక కూడా జరుగుతుందని కాఠండు–6 స్థానాన్ని గెలుచుకున్న ఆర్‌ఎస్‌పి ప్రతినిధి శిశిర్ ఖనాల్ చెప్పారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బాలేంద్ర షా సన్నద్ధమవుతున్నారని ఆయన చెప్పారు. నేపాల్ ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పి దాదాపు మూడింట రెండు వంతుల మెజార్టీ సాధించింది. మొత్తం 184 స్థానాలు గెలుచుకుంది.

# ఇరాన్‌లో వాస్తవాధికారాలు చెలాయిస్తున్న ఐఆర్‌జిసి!

- హోర్ముజ్‌లో మొత్తం 20 నౌకలపై దాడి
- అమెరికా–యూరప్ నౌకలపైనే నిషేధం
- నేలకు అతుక్కుపోయిన 52వేల విమానాలు
- 11 శాతం పెరిగిన క్రూడాయిల్ ధర
- భారీగా పెరిగిన కీలక వ్యవసాయ ఉపకరణాల ధరలు



**టెహ్రాన్:** ఇరాన్‌లో మూడు వంతుల సీనియర్ రాజకీయ నాయకత్వం అంతమైపోవడంతో ఈ యుద్ధ సమయంలో ఇస్లామిక్ రివల్యూషనరీ పార్టీ ఆ దేశంలో వాస్తవాధికారాలు చెలాయిస్తోంది! మీడియా కథనాలు, దేశంలోని పరిస్థితులు ఇదే వాతావరణాన్ని తలపింపజేస్తున్నాయి. ఇరాన్‌లో అలీ ఖమేనీ మరణంతో ప్రజలు ఒక సునామీ తరహాలో వీధుల్లోకి వచ్చి అత్యున్నత చట్టసభపై దాడిచేసి అధికారాన్ని స్వాధీనం చేసుకుంటారని డోనాల్డ్ ట్రంప్, నెతన్యాహూ,రెజా పహ్లవీ వంటివారంతా ఎన్నో కలులు కనప్పటికీ ఈ పరిస్థితులు లేకపోవడానికి కారణం మొజ్తబా ఖమేనీపై ప్రజల్లో ఆకస్మికంగా కలిగిన సానుభూతితోపాటు ఐఆర్‌జిసి అణచివేత చర్యలు కూడా ప్రధాన కారణంగా ముందుకు వచ్చాయి. ఒకవైపు యుద్ధం జరుగుతున్నప్పటికీ, ట్రంప్–నెతన్యాహూ ఇద్దరు గడచిన 15 రోజుల్లో ఇరాన్ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసినప్పటికీ జనవరి నెలాఖరు, ఫిబ్రవరి రెండో వారంనాటి పరిస్థితులు అక్కడ సంభవించకపోవడంతో నెతన్యాహూ జావగారిపోయారు. ఇరాన్‌లో మొజ్తబా ఖమేనీ ప్రభుత్వం కుప్పకూలిపోవడానికి ఇంకా చాలా కాలం పడుతుందని నెతన్యాహూ స్పష్టమైన ప్రకటన చేసి చేతులు ఎత్తేశారు. మొజ్తబా ఖమేనీ తీవ్రమైన గాయాలతో మంచాన పడి ఉన్నప్పటికీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ మాత్రం తమ నాయకుడు ఎంతో చైతన్యవంతంగా పనిచేస్తున్నారనే వాతావరణాన్ని సృష్టించి యుద్ధ సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను, సైనిక దాడులను సమన్వయంతో ముందుకు నడిపిస్తోంది. యుద్ధంవల్ల, హోర్ముజ్ మూసివేతవల్ల సంక్షోభ పరిస్థితి పెరిగిపోవడంతో ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ కూడా ఒక వివరణ ఇచ్చారు. కేవలం అమెరికా–యూరప్ దేశాల వాణిజ్య నౌకలను మాత్రమే హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్ళనివ్వబోమని స్పష్టం చేశారు. దీంతో సగం ప్రపంచం ఊపిరిపీల్చుకుంది.

ఇక డోనాల్డ్ ట్రంప్ కూడా విరామం లేకుండా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ శక్తిసామర్థ్యాలు పూర్తిగా క్షీణించిపోయాయని ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇక కోలుకోలేనిరీతిలో ఇరాన్‌ను దెబ్బతీశామని, కాలం చెల్లిన తక్కువ సామర్థ్యంగల డ్రోన్లను వారు వాడుతున్నారని ట్రంప్ ప్రకటనలు చేసినప్పటికీ ఎప్పటికప్పుడు ఇరాన్ తన డ్రోన్ల సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలను, ఆస్తులను చావు దెబ్బ తీస్తోంది. ఈ విషయాలను ట్రంప్ ప్రముఖంగా చెప్పడానికి నిరాకరిస్తున్నారు. ఇప్పటికే 9,000మంది కీలక దౌత్యసిబ్బందిని, మరో 45,000 మంది అమెరికన్లను పశ్చిమాసియా నుండి ప్రత్యేక ఛార్టర్ విమానాలలో ట్రంప్ స్వదేశానికి తరలించడం ఆయన ఓటమిని సూచిస్తున్నది. ట్రంప్ ఊహించని రీతిలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ హోర్ముజ్ జలసంధినే ఒక అణ్వస్త్రంగా మార్చేశారు. ఇప్పటివరకూ 20 నౌకలను రివల్యూషనరీ గార్డ్స్ ధ్వంసం చేశారు. గల్ఫ్ దేశాలలో అంతటా అనేక దేశాలలో అమెరికా ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఖతార్ తీవ్రంగా నష్టపోయింది. అతి సన్నని హోర్ముజ్ జలసంధిలో అలవోకగా అటూఇటూ పరుగులు తీయడానికి, ఒకపట్టాన వెంటనే కదలడానికి అవకాశంలేని పశ్చిమదేశాల భారీ వాణిజ్య నౌకలను దెబ్బతీయడానికి ఆత్మాహుతి పడవలను ఇరాన్ రంగంలోకి దించడంతో అమెరికా,ఇజ్రాయెల్ బెంబేలెత్తుతున్నాయి. యుద్ధ రంగంలోకి రావాల్సిందిగా ట్రంప్ పదే పదే మిత్రదేశాలకు విజ్ఞప్తులు చేస్తున్నారు. చాలా సునాయాసంగా ఇరాన్‌ను, ఐఆర్‌జిసిని పడగొడతామని వైట్‌హౌస్,పెంటగాన్ వర్గాలు ట్రంప్‌కు తప్పుడు సలహాలు ఇచ్చాయా? లేక ట్రంప్ వారి తో ఏకీభవించలేదా? ఈ విషయంలో విభేదాలున్నాయా? అనే విషయాలను పక్కనపెడితే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ సేనలు అటు యుద్ధరంగంలో, ఇటు స్వదేశంలో కూడా తమ శక్తిసామర్థ్యాలను రుజువుచేసుకుంటున్నారు. ఒక్కొక్క ఆయుధాన్ని మెల్లిగా బయటకు తీసి అమెరికాను భయపెడుతున్నారు. 15 రోజులు గడచిన తర్వాత కూడా ఐఆర్‌జిసి సేనలు హోర్ము జ్ జలసంధి నుండి వాణిజ్య నౌకలను కదలనీయడంలేదు. ఇప్పటివరకూ ఐఆర్‌జిసి అంగీకారంతో భారత్, చైనా సహా కేవలం 77 నౌకలు మాత్రమే ఈ మార్చి నెలలో ఇప్పటివకూ సు రక్షితంగా హోర్ముజ్ జలసంధి దాటి మహాసముద్రంలోకి వెళ్ళి ప్రయాణాలు చేశాయి. గత ఏడాది మార్చినెలలో లెక్కలు చూస్తే 12,230 నౌకలు హోర్ముజ్ జలసంధిని దాటి వెళ్ళాయి. ఇప్పుడు బ్రెంట్ క్రూడాయిల్ ధర 11 శాతం మేరకు పెరిగింది. పశ్చిమాసియా నుండి 60లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించలేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. విమాన ఛార్జీలు అనుహ్యంగా పెరిగిపోవడంలో ప్రపంచ టూరిజం వ్యవస్థ చతికిలపడింది. ఆర్థిక కార్యకలాపాలు కూడా స్తంభించిపోయాయి. నిర్ణీత ప్రకారం రాకపోకలు సాగించాల్సిన 98,000 విమానాలలో 52,000 విమానాలు పూర్తిగా గాలిలోకి లేవకుండా నేలకు అతుక్కుపోయాయి. చమురు రవాణాపై ఇరాన్ క్లారిటీ ఇచ్చినప్పటికీ ఇంకా భయాలు, సందేహాలు వదలలేదు. భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, దక్షిణ కొరియా వంటి అనేక ఆసియా దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాలు చమురు సంక్షోభంలో పడ్డాయి. ఆస్ట్రేలియాలో గ్రామీణ ప్రాంతాలను అక్కడి ప్రభుత్వం చమురు లేకుండా ఎండగట్టింది. ఆ దేశంలో కేవలం 36 రోజులకు సరిపడ నిల్వలు మాత్రమే ఉన్నాయి. అంతర్జాతీయ ఇంధన సంస్థ సమాచారం ప్రకారం అనేక ఆఫ్రికాదేశాలలో కేవలం 25 రోజులకు సరిపడ మాత్రమే ఇంధన వనరులు ఉన్నాయి. గడచిన 15 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఎరువుల సరఫరా నిలిచిపోయింది. కీలకమైన వ్యవసాయ ఉపకరణాల రవాణా స్తంభించింది. దీంతో వాటి ధరలు బాగా పెరిగాయి. ఈ సమస్య స్వయంగా అమెరికాకే వచ్చింది. దీంతో ఎరువులను అమెరికా వెనిజులా నుండి తెచ్చుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంది. గడచిన 15 రోజులలో ఈ విధంగా ఇరాన్‌లో నాయకత్వం చతికిలబడి సలహాలు చెప్పేవారే లేకపోయినప్పటికీ ఐఆర్‌జిసి సైన్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తోంది.

## కాంగో అధ్యక్ష పదవికి ఎన్నికలు

**బ్రెజ్జావిల్లె:** మధ్య ఆఫ్రికాదేశం గణతంత్ర కాంగో (కాంగో (బ్రజ్జావిల్లె)లో ఆదివారం అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఐతే దీర్ఘకాలంగా అధ్యక్ష పదవిలో ఉన్న డెన్నిస్ సౌ సౌ న్గస్సో తిరుగులేని నాయకుడుగా మళ్ళీ గెలిచే అవకాశాలు ఉన్నాయని భారీ అంచనాలున్నాయి. 1997 నుండి డెన్నిస్ సౌ సౌ న్గస్సో దేశాన్ని పరిపాలిస్తున్నారు. దాదాపు నలభై సంవత్సరాలుగా ఆయన అధికారంలో ఉన్నారు. ప్రపంచంలో రాజకీయంగా తీవ్రంగా అణచివేతకు గురవుతున్న దేశాల జాబితాలో 17వ రేటింగ్‌లో కాంగో ఉంది. ఐతే దేశంలో ఉన్న యువకులు మాత్రం అధ్యక్ష పదవిలో మార్పు కావాలని కోరుకుంటున్నారు. చమురు ఎగుమతి చేసే ఆఫ్రికా దేశాలలో కాంగో మూడవస్థానంలో ఉంది. రాగి, వజ్రాలతోపాటు ప్రతిరోజూ 2.56 లక్షల బ్యారళ్ళ చమురును కూడా ఎగుమతి చేస్తుంది. అమెజాన్ తర్వాత ప్రపంచంలో అతిపెద్ద రెండవ వర్షారణ్య నెట్‌వర్కు ఉన్న ప్రాంతం కాంగో. ఎంతో జీవ వైవిధ్యం ఉన్న దేశంగా కాంగో పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ప్రపంచంలో అంతరించిపోతున్న అరుదైన ఏనుగులు, చింపాజీలు, గొరిల్లాలకు నిలయంగా కాంగోదేశం ఐక్యరాజ్యసమితి యునెస్కో వారసత్వ ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. ఎన్నో ప్రకృతి వనరులు ఉన్నప్పటికీ 60 లక్షలు జనాభాగల కాంగో పేదరికంలో ఉంది. ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచికలలో 193 దేశాలలో కాంగో 171వ స్థానంలో ఉంది.




## ప్రత్యక్ష యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకూ 12 మందిమరణించారు. కాగా యుద్ధంలో ఇప్పటివరకూ 13 మంది అమెరికా సైనికులు మరణించారు. శనివారం ఇరాక్‌లో అమెరికా యుద్ధ విమానం కూలిపోవడంతో అందులో ఉన్న ఆరుగురు అమెరికా సైనికులు మరణించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోనిఓడరేవులను కేంద్రాలుగా చేసుకుని అమెరికా సైన్యాలు ఇరాన్‌కు జీవనాధారమైన ఖర్గ్ ద్వీపంలోని కీలక చమురు ఎగుమతుల ప్రాంతాలపై దాడులు చేస్తోందని అందుకు ప్రతీకారం తీర్చుకుంటామని ఐఆర్‌జిసి ప్రకటించింది. పశ్చిమాసియాలో మిత్రదేశాలకు రక్షణ ఛత్రం ఏర్పాటు చేశామని అమెరికా చెప్పిన మాటలన్నీ తమ దాడులతో వట్టి డొల్ల అని తేలిపోయిందని ఐ.ఆర్.జి.సి హేళన చేసింది. అదేవిధంగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూను హతమారుస్తామని, ఆయనను వెంటాడి వెంటాడి చంపుతామని, వదిలిపెట్టబోమని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతిజ్ఞ చేసింది. అదే స్ఫూర్తితో ఆదివారం ఇజ్రాయెల్‌పై అనేక రకాల క్షిపణులను ప్రయోగించింది. అరబ్ ఎమిరేట్స్‌లోని మూడు కీలకమైన ఓడరేవులను ఖాళీ చేయాలని దాడులు చేస్తామని ఇస్లామిక్ గార్డ్ హెచ్చరించిన తర్వాత కొత్త దాడులు మొదలైనట్లు గల్ఫ్‌దేశాలు పేర్కొన్నాయి. దీంతో యుద్ధం కొత్త రూపం తీసుకునే పరిస్థితి వచ్చింది. ఈ దశలో మిత్రదేశాలు కూడా యుద్ధంలో చేరగలవని, పశ్చిమాసియాకు యుద్ధ నౌకలను పంపగలవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. అదేసమయంలో బ్రిటన్ ఇంధనశాఖామంత్రి ఎడ్వర్డ్ మిలిబండ్ ఒక ప్రకటన చేస్తూ హోర్ముజ్ జలసంధి వద్ద స్తంభించినోపియన నౌకలను బయటకు తీసుకువచ్చేందుకు మార్గాలను అన్వేషిస్తున్నామని ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నందువల్ల నౌకలను బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధంలో అమెరికాకు తాము సహాయం చేయాలనుకుంటున్నామన్నారు. కాగా మరోవైపు ఇజ్రాయెల్ కూడా లెబనాన్‌లో ఆదివారం 14వ రోజు యుద్ధ దాడులను మరింత ఉద్ధృతం చేసింది. లెబనాన్‌లో ఇరాన్ సైన్యం నేరుగా హెజ్బొల్లా సైనికులతో తలపడుతోంది. యుద్ధ భయంతో లెబనాన్‌లోని అనేక గ్రామాలు పట్టణాల నుండి 8,50,000 మంది ప్రజలు ఖాళీచేసి వెళ్ళిపోయారు. దాదాపు 830 మంది ఇప్పటివరకూ లెబనాన్‌లో మరణించారు. హెజ్బొల్లా దళాలు ఇజ్రాయెల్ లక్ష్యంగా క్షిపణి దాడులు చేయడంతో నెతన్యాహూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లెబనాన్‌తో శాంతి చర్చలకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

## కేరళంలో 25 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించిన సిపిఐ



**తిరువనంతపురం:** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) తరపున పోటీచేసే నలుగురు మంత్రులు సహా 25 మంది అభ్యర్థుల పేర్లను ఆ రాష్ట్ర పార్టీ కార్యదర్శి బినొయ్ విశ్వం ప్రకటించారు. ఎన్నికల సంఘం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన కొద్ది నిమిషాలకే కేరళలో పోటీ చేసే పూర్తి అభ్యర్థుల జాబితా విడుదల చేసిన మొదటి రాజకీయపార్టీ భారత కమ్యూనిస్టుపార్టీ. ఈ జాబితాలో మొత్తం ఐదుగురు మహిళలు ఉన్నారు. కేరళ వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన (ఎల్‌డిఎఫ్) కూటమిలో భారత కమ్యూనిస్టుపార్టీ కీలకభాగస్వామిగా ఉంది. పదవిలో ఉన్న నలుగురు మంత్రులను ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులుగా పార్టీ తిరిగి ఎంపిక చేసింది. కేరళ ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వంలో ప్రస్తుతం మంత్రులుగా ఉన్న జి.ఆర్.అనిల్, జె.చించురాణి, కె.రాజన్, పి.ప్రసాద్ తిరిగి ఎన్నికలబరిలో నిలిచారు. వరుసగా రెండుసార్లు ప్రజా ప్రతినిధులుగా పదవీకాలం పూర్తిచేసిన శాసనసభ్యులు కె.రాజన్, మహ్మద్ ముహ్సిన్, ఇ.టి.టైసన్, వి.ఆర్.సునీల్ కుమార్ కూడా ఈ 25 మంది అభ్యర్థుల జాబితాలోఉన్నారు. నత్తిక నియోజకవర్గంలో ప్రస్తుతం పదవిలో ఉన్న శాసనసభ్యుడు సి.సి.ముకుందన్ బదులుగా మాజీ శాసనసభ్యురాలు గీతా గోపి పోటీ చేస్తారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నలుగురు మంత్రులను పార్టీ తిరిగి ఎంపిక చేసిందని బినోయ్ విశ్వం తిరువనంతపురంలో పాత్రికేయులకు చెప్పారు. ఒల్లూరు నియోజకవర్గం నుండి పాడిపంటలు, పశుసంవర్ధక శాఖా మంత్రి జె.చించురాణి, నెడుమంగాడ్ నియోజకవర్గం నుండి రెవెన్యూ,హౌసింగ్ శాఖామంత్రి కె.రాజన్, ఛేర్తాల నియోజకవర్గం నుండి ఆహార, పౌరసరఫరాల శాఖామంత్రి జి.ఆర్.అనిల్, చదయమంగళం నియోజకవర్గం నుండి వ్యవసాయశాఖామంత్రి పి.ప్రసాద్ వారి వారి స్థానాల నుండే తిరిగి పోటీ చేస్తున్నారు.

ఐతే ఇప్పటికే రెండుసార్లు వరుసగా ఎన్నికల్లో పోటీ చేసిన మంత్రి కె.రాజన్‌కు పార్టీ మినహాయింపు ఇచ్చి తిరిగి ఎన్నికల బరిలోకి దించింది. రెండుసార్లు శాసనసభ్యులుగా పదవీ బాధ్యతలు నిర్వహించిన అభ్యర్థులను పోటీ నుండి తొలగించి మరొకరికి అవకాశం ఇచ్చారు. ఇలా అభ్యర్థుల జాబితా నుండి మినహాయించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు ఇ.చంద్రశేఖరన్, ఇ.కె.విజయన్,చిత్తయం గోపకుమార్ ఉన్నారు. ఇదిలా ఉండగా, కైపమంగళం నియోజకవర్గానికి చెందిన శాసన సభ్యుడు ఇ.టి.టైసన్‌ను పరవూర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. ఐతే ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీశన్ ఈసారి ఇదే నియోజకవర్గం నుండి పోటీ చేస్తారని భావిస్తున్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ 23 నియోజకవర్గాలలో పోటీ చేసింది. 17 నియోజకవర్గాలలో విజయం సాధించింది.

**కేరళ నుండి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థుల పూర్తి వివరాలు:**

గోవిందన్ పల్లికప్పిల్(కాసర్గోడ్), పి.వసంథన్ (కోజీకోడ్‌లోని నదపురం), అజిత్ కొలాడి(మలప్పురంలోని తిరుర్), సిపిఐ స్వతంత్ర అభ్యర్థి పి.కె.ముస్తాఫా(మంజేరి), షఫీర్ కిఝిస్సెరి(ఎర్నాడ్), సిపిఐ స్వతంత్ర అభ్యర్థి మంజిల్ బెకర్(పాలక్కాడ్‌జిల్లా మన్నార్కాడ్), మహ్మద్ ముహాసిన్(పట్టంబి), గీతాగోపి (త్రిస్సూర్‌జిల్లా నత్తిక), అలంకోడ్ లీలాకృష్ణన్(త్రిస్సూర్), కె.కె.వల్సరాజ్(కైపమంగళం), వి.ఆర్.సునీల్‌కుమార్(కొడుంగల్లూర్), ఎన్.అరుణ్(ఎర్నాకుళంజిల్లా మువత్తుపుఝు), పి.ప్రదీప్ (కొట్టాయంజిల్లా వైకోమ్), కె.సలీంకుమార్ (ఇడుక్కిజిల్లా పీర్‌మేడ్), ప్రిజి కన్నన్(పథనంథిట్టజిల్లా అండూర్), టి.టి.జిస్మన్(అలప్పుఝుజిల్లా హరిపద్), ఎం.ఎస్.తార(కొల్లం జిల్లా కరునగపల్లి), అజయప్రసాద్(పునలూర్), ఆర్.రాజేంద్రన్ (ఛేతన్నూర్), మనోజ్ ఇదమన (తిరువనంతపురం జిల్లా చిరాయింకీఝు) సిపిఐ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

## చిచ్చుకు యత్నం

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో మైనారిటీలకు సింహభాగం కల్పిస్తున్నామని సిఎం తెలిపారు. గతంలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని, వాటి వల్ల అనేక మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం మీది, నేను మీ సోదరుడిని, మీ ఆశీస్సులు ప్రభుత్వానికి అవసరమని అన్నారు. మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని, సీనియర్ నేత షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవి కల్పించామని చెప్పారు. అదేవిధంగా ఎనిమిది మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చినట్లు వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మైనారిటీలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. భారత క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు డిఎస్‌పి ఉద్యోగం ఇచ్చామని, అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్‌కు డిఎస్‌పి ఉద్యోగంతో పాటు రూ. రెండు కోట్ల నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించామని పేర్కొన్నారు. అందరూ కలిసి మెలిసి తెలంగాణను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని, దేశంలో తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని సిఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసీ, ఎంపి.అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీల్ అలీ, ఫయ్యూం ఖురేషీతో పాటు పలువురు ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

## 11 మంది అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. హైదరాబాద్ నగర శివారులోని మొయినాబాద్‌లో జరిగిన ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ ఘటన తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు పాల్గొన్న ఈ పార్టీలో డ్రగ్స్ వినియోగం, తుపాకీ కాల్పులు వంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో కేసు రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు చేపట్టిన దాడిలో టిడిపి ఎంపి, బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో పాటు పలువురిని అదుపులోకి తీసుకోవడం ఈ కేసుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది.

**ఫామ్‌హౌస్‌లో రాత్రివేళ పార్టీ.. పోలీసుల దాడి..**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ పరిధిలోని ఒక ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి భారీ పార్టీ జరుగుతోందన్న సమాచారం పోలీసులకు అందింది. ఈ సమాచారం మేరకు యాంటీ డ్రగ్స్ విభాగం (ఈగల్ టీమ్), స్థానిక పోలీసులు, ఎస్‌ఒటి బృందాలు సంయుక్తంగా ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఫామ్‌హౌస్‌లోకి ప్రవేశించిన సమయంలో అక్కడ మద్యం, సంగీతంతో పెద్ద ఎత్తున పార్టీ జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.పార్టీలో మొత్తం 10 మంది పురుషులు, ఒక మహిళ పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. పార్టీ సందర్భంగా కొంతమంది డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానం రావడంతో వారిపై ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. పోలీసులు సోదాల సమయంలో ఫామ్ హౌస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులను చూసి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారనే ఆందోళనతో, అక్కడ ఉన్న యువకులు పోలీసులను అడ్డుకున్నారు. ఢిల్లీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నమిద్ మిశ్రా, రితేష్ రెడ్డికి చెందిన తుపాకీతో గాలిలోకి నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. పోలీసుల తనిఖీల్లో అక్కడి నుంచి సుమారు 2 గ్రాముల కొకైన్, ఒక పిస్టల్, కొన్ని బుల్లెట్లు, అలాగే పార్టీకి సంబంధించిన పలు ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ను పార్టీకి హాజరైన కొంతమందికి సరఫరా చేసినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. డ్రగ్స్‌ను నగరానికి వెలుపల నుంచి తీసుకువచ్చినట్లు కూడా పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ పరీక్షల్లో కొంతమందికి డ్రగ్స్ వినియోగం పాజిటివ్‌గా వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అందులో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, టిడిపి ఎంపి పుట్టా మహేష్ కుమార్ యాదవ్, నమిత్ శర్మ, రితేష్ రెడ్డి తదితరులు ఉన్నట్లు సమాచారం. ఈ ఫలితాలను ధృవీకరించేందుకు నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

**ఎంపికి స్టేషన్ బెయిల్..**

ఈ కేసులో అదుపులోకి తీసుకున్న టిడిపి ఎంపి పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు సమాచారం. మిగతా నిందితులను కోర్టులో హాజరుపరచగా, వారి పాత్రపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

ధ్వంసమైన మొబైల్ ఫోన్లు పోలీసుల దర్యాప్తులో మరో ఆసక్తికర అంశం బయటపడింది. ఫామ్‌హౌస్‌లోని రెండు ఐఫోన్ మొబైల్ ఫోన్లు ధ్వంసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఫోన్లలో డ్రగ్స్ సరఫరా, పార్టీ నిర్వహణకు సంబంధించిన సమాచారం ఉండవచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. ఫోన్ల డేటాను రికవర్ చేసేందుకు సాంకేతిక నిపుణులను పోలీసులు సంప్రదిస్తున్నారు.

**రాజకీయ దుమారం..**

ఈ ఘటనలో రాజకీయ నాయకులు పాల్గొన్నట్లు బయటపడడంతో తెలంగాణలో రాజకీయ దుమారం రేగింది. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తుండగా, మరోవైపు ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసు దర్యాప్తు కొనసాగుతోంది. మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో పోలీసులు సాక్ష్యాలను సేకరిస్తూ, మరి కొంత మందిని విచారించే అవకాశముందని తెలిపారు. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌ను పూర్తిగా బయటపెట్టేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. ఈ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. శాసనసభలో కాంగ్రెస్‌ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన, ప్రస్తావించాల్సిన అంశాలు, అనసరించాల్సిన వ్యూహాలపైన ఇటీవల బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. అలాగే మూసీ పునరుజ్జీవన పథకానికి తీసుకోబోయే రుణంంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో శాసనసభలో చెప్పిన అంచనాకు, బైట చెప్పిన అంచనాకు తేడాపై ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెడుతామని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరుహరీశ్ రావు తెలిపారు.

**పేదల ఇళ్లు, ప్రజా సమస్యలు లేవనెత్తేందుకు సిపిఐ సన్నద్ధం**

మరోవైపు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు కూడా శాసనసభలో ప్రజా సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను కూడా ప్రస్తావించనున్నారు. ప్రతి సమావేశంలో అన్ని వర్గాలకు చెందిన అంశాలను ప్రస్తావించడంతో పాటు అనేక సమస్యలను ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ సారి గుడిసె వాసులకు ఇళ్ళపట్టాల అంశంపైన సిపిఐ ఈనెల 24న చలో అసెంబ్లీ కార్యాక్రమాన్ని నిర్వహించనుంది.దీంతో పేద వర్గాలకు చెందిన సమస్యలతోపాటు భూ నిర్వాసితుల అంశాన్ని కూడా శాసనసభలో కూనంనేని సాంబశివ రావు, శాసనమండలిలో ఎంఎల్‌సి నెల్లికంటి ప్రభుత్వం దృష్టికి తీసుకురానున్నారు. అయితే విపక్షాలు ప్రస్తావించే అంశాల కు సమాధానాలు ఇవ్వడానికి , గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది.

**చలో అసెంబ్లీలు, ధర్నాలు లేకుండా చూడాలి : స్పీకర్, ఛైర్మన్**

శాసనసభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని, వాటిని అడ్డుకోవాలి, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయని పోలీసు అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. చలో అసెంబ్లీ కార్యక్రమాలు జరగకుండా చూడాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు.బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో వారు పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, పెండింగ్ ప్రశ్నలకు సమాధానాలు వెంటనే సూచించారు. బడ్జెట్ సమావేశాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు మంచిగా జరుగుతాయని, అనుకోని సంఘటనలు, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా, ప్రభుత్వానికి, శాసనసభకు ఎటువంటి చెడ్డ పేరు రాకుండా చూడాలని అన్నారు. ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల నుంచి ఇక కౌన్సిల్, అసెంబ్లీ సమావేశాలు ఒకే ప్రదేశంలో జరుగుతున్న నేపథ్యంలో అదనపు ఏర్పాట్లు ఉండాలన్నారు.

**ప్రతి శాఖకు ఒక అధికారి:** మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సభలు సజావుగా జరిపేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన పూర్తి సహాయ, సహకారాన్ని అందిస్తామన్నారు. కోఆర్డినేషన్ కోసం ప్రతి శాఖ నుండి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు.

ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనమండలి కార్యదర్శి వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు డిజిపి శివధర్ రెడ్డివ తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్స్ వ్యాపారం ముసుగులో..

# ప్రణీత్ ఆంటీలియా కాలనీపై హైడ్రా ప్రతాపం

**కాలనీ వాసులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే**

**సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ**



**ప్రజాపక్షం/నిజాంపేట్:** రియల్ ఎస్టేట్స్ వ్యాపార ముసుగులో ప్రణీత్ ఆంటిలియా కాలనీ పై హైడ్రా ప్రతాపం చూపిస్తుందని, కాలనీ వాసులకు హైడ్రా కమిషనర్ రంగనాథే బహిరంగ క్షమాపణలు చెప్పాలని జాతీయ సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి ప్రణీత్ ఆంటీలియా కాలనీ నుండి రోడ్డుని వేసేందుకు ఇటీవల హైడ్రా అధికారులు చేస్తున్న చర్యలపై సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ సిపిఐ నేతలతో కలిసి పర్యటించారు. కాలనీ కమాన్ నుండి ప్రణీత్ ఆంటిలియా కాలనీలో గ్రీన్ బెల్టు కోసం వదిలేసిన స్థలం నుండి హెచ్ఎండిఎ వేసిన వెంచర్‌కి రోడ్డుని వేసేందుకు హైడ్రా యత్నిస్తున్న స్థలాన్ని నారాయణ పరిశీలించారు. జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ ఆధ్వర్యంలో విచ్చేసిన నారాయణ కాలనీ అసోసియేషన్ సభ్యులతో, కాలనీ మహిళలతో మాట్లాడి అసలు జరిగిన విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. గత పధ్నాలుగు సంవత్సరాలు నుండి ప్రణీత్ ఆంటిలియా కాలనీని ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న తమ కాలనీకి ఆనుకుని ఇండస్ట్రియల్ స్థలం ఉందని ఇటీవల ప్రభుత్వం హెచ్ఎండిఎ సంస్థ నుండి వెంచర్‌ని వేసిందని, అట్టి వెంచర్ కోసం తమ కాలనీ నుండి రోడ్డుని వేసేందుకు హైడ్రా అధికారులు ఏకంగా తమ కాలనీకి దౌర్జన్యంగా గోడని తొలగించారని నారాయణ దృష్టికి కాలనీ వాసులు వివరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ హైడ్రా అంటే ఒక గౌరవం ఉండేదని, అట్టి సంస్థకు తమ సిపిఐ నుండి సైతం మద్దతు ఉండేదని, చెరువులు, కుంటలు, పార్కులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల కబ్జాల పై హైడ్రా తీసుకుంటున్న చర్యలను స్వాగతించామని తెలిపారు. బాచుపల్లి ప్రణీత్ ఆంటిలియా కాలనీకి వచ్చి చూసిన అనంతరం హైడ్రా తీసుకున్న ఈ చర్య కేవలం రియల్ ఎస్టేట్స్ వ్యాపార ముసుగులోనే అని స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. కోర్టు నుండి ఆర్డర్ ఉన్నప్పటికీ హైడ్రా కోర్టుని సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని, కాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేస్తున్న హైడ్రాపై ఇక నుండి సిపిఐ పోరాటం చేస్తుందని అన్నారు. కాలనీ వాసులతో చర్చించి వారి అంగీకారంతో ఇలాంటి చర్య తీసుకుని ఉంటే తమకెలాంటి అభ్యంతరం ఉండేదని కాదని స్పష్టం చేశారు. రాబోవు కాలంలో ఇలాంటి చర్యలు తీసుకుంటే హైడ్రాపై మూడు కన్నులను వేసి చూస్తామని, హైడ్రా కమిషనర్ రంగనాథే వచ్చి కాలనీ వాసుల కు బహిరంగా క్షమాపణలు చెప్పాలని హెచ్చరించారు. హైడ్రా చర్యల వెనుక రాజకీయ ఒత్తిడి లు, రియల్ ఎస్టేట్ ప్రభావం ఉందని, కాలనీ వాసులకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని, భవిష్యత్తులో వారికి ఎలాంటి నష్టం రాకుండా హైడ్రా చర్యలు ఉండాలని అన్నారు. మూసీ సుందరీకరణ, చెరువుల పరిరక్షణ, అభివృద్ధి వంటి మంచి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి చర్యల వల్ల హైడ్రా పై చెడు అభిప్రాయం ప్రజల్లో నెలకొంటుందని స్పష్టం చేశారు. గత వారం రోజుల నుండి కాలనీలో స్ట్రీట్ లైట్‌లు, డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రికల్ కేబుల్, వాటర్ సరఫరాకి అంతరాం కలుగుతుందని, దీంతో ప్రజ లు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఏదిఏమైనప్పటికీ హైడ్రా కాలనీ వాసులకు చేసిన అన్యాయానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు స్వామి, దస్తగిరి, సదానంద్, కృష్ణ, నర్సింహారెడ్డి, సహదేవ రెడ్డి, శ్రీనివాస్ చారి, భీమేష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు రాజిరెడ్డి, వెంకటరమణ, కవిత, మైత్రి కుమార్, వంశీ పాల్గొన్నారు.

# దళిత సమస్యలు పరిష్కరించాలి

**డిహెచ్‌పిఎస్ డిమాండ్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ బస్తీల్లో నివసిస్తున్న దళితులకు మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) హైదరాబాద్ జిల్లా 4వ జిల్లా మహాసభలు ఘనంగా జరిగాయి. ఆరుట్ల రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈమహాసభను ఉద్దేశించి ఏసు రత్నం, అనిల్ కుమార్ మాట్లాడుతూ బస్తీల్లో నివసిస్తున్న దళిత కుటుంబాలు చాలా వరకు చిన్న చిన్న గుడిసె ల్లో, కాలుష్యభరితమైన వాతావరణంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడితే ఇళ్లు దెబ్బతినడం, డ్రైనేజీ సదుపాయాలు లేకపోవ డం, తాగునీటి కొరత వంటి తీవ్ర మైన సమస్యలకు తోడు పిల్లలకు సరైన విద్యా అవకాశాలు, యువత కు ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల పేదరికం మరింత పెరుగుతోందన్నారు. ప్రభుత్వం బస్తీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, దళిత కుటుంబాలకు గృహా లు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు దళిత యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలన్నారు. ఇందుకు దళితుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పూర్తిగా వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లించడం ఆపాలని, దళిత సబ్ ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొంపెల్లి శ్రీనివాస్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర జె కుమార్, కొమురెల్లి బాబు, దుర్గ భవాని, తిలక్ దాస్, బుగ్గ రాజు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై యుద్ధం ఆపాలి

**సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు**




**ప్రజాపక్షం/మంచిర్యాల :** ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, యుద్ధంవల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలోని సిఎంఆర్ షాపింగ్ మాల్ పైన సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధం వల్ల ఇరాన్‌లోని చమురు, గ్యాస్ పేదలకు అందడం లేదని, వంట నూనెలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ట్రంప్ చెప్పినట్లు చేస్తూ సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రపంచంలోని పది మంది ధనవంతుల కోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, కార్పొరేట్ కంపెనీలకు అటవీ భూములను కట్టబెడుతున్నారని రాఘవులు ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి తెచ్చిన లేబర్ కోడ్స్ ను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవి కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, గిరిజను ల సాగు భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఎరువులకు ఆధార్ లింక్ చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటా లు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య, ఎండి అబ్బాస్, రవీందర్, జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు కె అశోక్, ఏ పున్నం, జి ప్రకాష్, బి చందు, దుంపల రంజిత్ కుమార్, కె లింగన్న, డి. రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ కార్యాలయాలు.. ఉద్యమ కేంద్రాలు

- ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు
- తూము ప్రకాశరావు చిరస్మరణీయుడు : కూనంనేని
- బోనకల్ సిపిఐ మండల కార్యాలయం ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మం:** కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా భాసిల్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలకు ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన తెలిపారు. బోనకల్ మండల సిపిఐ కార్యాలయం తూము ప్రకాశరావు భవన్‌ను కూనంనేని సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. మీటింగ్ హాల్‌ను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, కార్యదర్శి చాంబర్‌ను దండి సురేష్ ప్రారంభించగా కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి యంగళ ఆనందరావు అధ్యక్షతన జరిగిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన తుది శ్వాస వరకు పోరాడి శత్రువుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన తూము ప్రకాశరావు చిరస్మరణీయుడన్నారు. ఆయన దళితుల అభ్యున్నతి కోసం దళితులకు భూమి దక్కాలని పోరాడారని ఆయన పేరున ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా పేరొందాలన్నారు. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని అవసరాలకు అనుగుణంగా పార్టీ కార్యకర్తలను పెంచుకోవడంతో పాటు పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు సిపిఐ ప్రణాళికాబద్దంగా వ్యవహరిస్తుందన్నారు. ఒక పక్క మతోన్మాదం, మరో పక్క పెరుగుతున్న ఆర్థిక అంతరాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ఆయన తెలిపారు. మత ఉన్మాదం ప్రజల మధ్య చీలికలు తెస్తుందని ఇది దేశ సమగ్రతకు, ఐక్యతకు ఇబ్బందికరంగా మారనుందన్నారు. దేశ సంపద కొంత మంది చేతుల్లో పోగుపడుతుందని సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారన్నారు. రాష్ట్రంలోనూ ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ పోరాట పంథాను అనుసరిస్తుందని ఎన్నికలు వేరు, ప్రజా పోరాటాలు వేరు అని కమ్యూనిస్టు పార్టీ కార్యాచరణలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేనని సాంబశివరావు స్పష్టం చేశారు. కా॥తూము ప్రకాశరావు పేరున పార్టీ కార్యాలయ ఏర్పాటుకు వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా బత్తినేని నాగప్రసాద్, నీరజ, ప్రకాష్, రాకేష్ లు సహకరించడం అభినందనీయమన్నారు. ఎంత చదువుకున్న, ఎక్కడ జీవించినా అమరుల ఆశయ సాధనలో పాలు పంచుకోవడం ఆదర్శమని సాంబశివరావు తెలిపారు. రానున్న కాలంలో పార్టీని విస్తరించాలని ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీకి పట్టుకొమ్మగా ఉన్న ఈ ప్రాంతంలో మరల కమ్యూనిస్టు పార్టీ బలం పుంజుకునేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల వెన్నంటి నిలిచి పనిచేస్తే అద్భుత ఫలితాలు వస్తాయనడానికి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనమని వందకు పైగా పంచాయతీల్లోనూ 40కు పైగా కౌన్సిలర్లు, కార్పోరేటర్లను గెలుచుకోవడం జరిగిందని వీటిలో 90 శాతంకు పైగా ఒంటరిగానే పోటీ చేసి గెలుపొందామని ఆయన తెలిపారు.



ప్రజా సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి పోరాట మార్గాన్ని ఎంచుకోవడమే లక్ష్యంగా తూము ప్రకాశ రావు భవన్ పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మధిర తాలూకా కమ్యూనిస్టు ఉద్యమానికి కేంద్రంగా భాసిల్లిందని అనేక మంది యోధులు కమ్యూనిస్టు పార్టీ కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించారన్నారు. నాటి సాయుధ పోరాటం నుంచి నిన్న మొన్నటి పోరాటాలలో అమరులైన వారి ఆశయ సాధనకు పునరంకితం కావడమే నిజమైన నివాళి అన్నారు.

ఈ సభలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బత్తినేని నీరజ, ప్రకాష్, రాకేష్, సిపిఎం నాయకులు కిలారు సురేష్, బిఆర్ఎస్ నాయకులు బానోత్ కొండ, కాంగ్రెస్ నాయకులు దుర్గారావు, టిడిపి నాయకులు సత్యనారాయణ తదితరులు ప్రసంగించగా ఏనుగు గాంధీ, బత్తినేని నాగప్రసాద్, తూము రోషన్‌కుమార్, జక్కుల రామారావు, పోటు సాత్విక్, గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, మండల సహాయ కార్యదర్శులు ఆకెన పవన్, బుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అమరులకు నివాళులు :**

సిపిఐ నాయకులు బుంగ నాగభూషణం, వెంకట నర్సమ్మ, జనార్ధన్‌రావు లకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. బుంగ నాగభూషణం, వెంకట నర్సమ్మ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ అమరుల ఆశయ సాధన కోసం పునరంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుంగ నాగభూషణం, వెంకట నర్సమ్మ కుమార్తె వెంకట్రావమ్మ, ఐతం రాజు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఘోర రోడ్డు ప్రమాదం..

**ముగ్గురు మృతి, పలువురికి గాయాలు**

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని రేఖ్య తండా గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా,పలువురు తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం ఏపీ 24 టిసి 5299 అను నంబర్ గల ఆటోలో కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆటోలో 12 మంది ప్రయాణికులు ప్రయాణిస్తుండగా,చింతపల్లి వైపు వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఏపీ 29యు 7795 నంబర్ గల ఇటుకల లోడుతో వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.మృతి చెందిన వారు కొర్రబ(57), కొర్ర మాన్సింగ్ తండా గ్రామం, చింతపల్లి మండలం, సంతోష్ ఖలీఫా,(40) బీహార్ రాష్ట్రం, బండారు ఇస్సాక్ (55) బాపట్ల జిల్లా కు చెందిన వారు. క్షతగాత్రులను వెంటనే హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనతో ఆ ప్రాంతం లో విషాద వాతావరణం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యు లు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు సంఘట నా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కెలింగారెడ్డి తెలిపారు.

## మూసీ ప్రాజెక్ట్‌తో ప్రయోజనం ఏమిటో ప్రజలకు తెలపాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**మూసీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పటి వరకు డిపిఆర్ లేదని, కేవలం మొదటి దశ పనులను మాత్రమే ప్రభుత్వం వివరించిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదిత్య కన్‌స్ట్రక్షన్ కబ్జాకు పాల్పడుతోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పిన మాటల ఆధారంగానే తాము ధర్నా చేశామని, ఇప్పుడు తప్పుడు సమాచారంతో ట్విట్టర్‌లో పోస్టులు పెట్టారని మండిపడ్డారు. ఆ పోస్టులను ట్విట్టర్ నుంచి వెంటనే తొలగించకపోతే, తాను రంగనాథ్‌పైన పరువు నష్టం దావా వేస్తానని కవిత హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ మూసీ ప్రాజెక్ట్ కారణంగా వచ్చే ప్రయోజనం ఏమిటనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడంలేదన్నారు. మూసీ ప్రాజెక్ట్‌కు గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రి ఫీజిబుల్‌లో మొదటి దశలో రూ 5, 641 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారని, కానీ పవర్ ప్రజెంటేషన్‌లో మాత్రం రూ.6 వేల 5 వందల నుంచి 7 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని, ఆరు నెలల్లోనే దాదాపుగా రూ. 1400 కోట్లు ఎలా పెరిగిందని కవిత ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులను ఆహ్వానించి ఏదో క్లోజ్డ్ డోర్ మీటింగ్ తరహా నిర్వహించారని ఆరోపించారు. మూసీ పక్కన ఉన్న ల్యాండ్‌ను కేక్ మాదిరిగా పంచుకునేందుకే సమావేశాన్ని నిర్వహించారని ఆరోపించారు. గతంలో చంద్రబాబు, వైఎస్ ఆర్ కూడా మూసీ ప్రక్షాళన కోసం ప్రయత్నించారని, కెసిఆర్ వచ్చాక మూసీ రివర్ ఫ్రంట్ పేరు తో మూసీ ప్రక్షాళనకు ప్రయత్నించారని కవిత గుర్తు చేశారు.



# హోరెత్తిన హమాలీల మహాగర్జన

**పాల్గొన్న మంత్రి సీతక్క, కోదండరాం, ఎమ్మెల్యే నాయిని**




**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ బాలసముద్రంలోని హయగ్రీవాచారి మైదానంలో తెలంగాణ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హమాలీ మహా గర్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.కార్యక్రమానికి ముందు హమాలీలు అంబేద్కర్ జంక్షన్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా సాగి హయగ్రీవాచారి మైదానం వరకు చేరుకుంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుడు తన కష్టంతో సంపాదించే ఏకైక వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజం అభివృద్ధి చెందడంలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. హమాలీల సమస్యలను తప్పకుండా అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తున్నారని, ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటుందని తెలిపారు. హమాలీల సంక్షేమం కోసం తన వంతు సహాయంగా సీడీఎఫ్ నిధుల ద్వారా రూ.20 లక్షలు విడుదల చేస్తానని ప్రకటించారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ హనుమకొండ కేంద్రంలో హమాలీల కోసం భూమి కేటాయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. హమాలీలు రక్తాన్ని చెమటగా మార్చి కష్టాన్ని ఇష్టంగా చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఇంత పెద్ద స్థాయిలో ఒక వేదికపై చేరి తమ సమస్యలను చెప్పడం ఎంతో సంతోషకరమని అన్నారు.

హమాలీలకు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొద్దిపాటి ఆలస్యం జరిగినప్పటికీ తప్పకుండా ఆ హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మండల కేంద్రా ల్లో హమాలీ సంఘాలకు భూమి కేటాయించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామాల్లో పని చేసే హమాలీలకు కూర్చునేందుకు కూడా స్థలం లేకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా పని చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రచయిత మిట్టపల్లి సురేందర్,గాయకులు చుక్క రామ్ నర్సయ్య,హమాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు గుంటి సామ్రాజ్యం,ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,కార్మికులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో హమాలీలు పాల్గొన్నారు.




# బిఎన్‌రెడ్డి చరిత్ర తెలంగాణ సమాజానికి గర్వకారణం

**ఎంసిపిఐ(యు) నేతలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీఎంపి భీంరెడ్డి నరసింహ రెడ్డి చరిత్ర తెలంగాణ సమాజానికి గర్వకారణమని యంసిపిఐ(యు) నేతలు అన్నారు. భీంరెడ్డి నరసింహ రెడ్డి 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఓంకార్ భవన్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, నార్ల చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎఐఎఫ్‌డివై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు మాడి శెట్టి అరుణ్ కుమార్, భారత ఐక్య విద్యార్థి సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి, ఎఐఎఫ్‌డి వై రాష్ట్ర కమిటీ సభ్యులు దేవపూజ మధు, గాదగోని సునిత పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) నాయకులు మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో పుట్టిన బిఎన్ రెడ్డితన ముందు జరుగుతున్న దోపిడి అసమానతలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించి భూమి భుక్తి పోరాటంలో అగ్రగణ్యుడు గా నిలిచారని కొనియాడారు.



## మినీ మొబైల్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు

### ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మునుగోడు**: మునుగోడు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతికత కలిగిన మినీ మొబైల్ వైద్య సేవలను ప్రారంభించారు.ఆదివారం మండల కేంద్రంలో సుశీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ విడత కంటి వైద్య శిబిరంలో భాగంగా నాంపల్లి మండల ప్రజలకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మినీ మొబైల్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాల సహాయంతో వివిధ రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలను అక్కడికక్కడే నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన అనేక మందిలో ఇతర రకాల ఆరోగ్య సమస్యలు ఉండటంతో వారు ఆపరేషన్లకు అర్హులు కాకుండా వెనుదిరిగే పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే, ఎవరూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కారణంగా చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ మినీ మొబైల్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ మినీ మొబైల్ ద్వారా రక్తపోటు, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలను వెంటనే నిర్వహించి ఫలితాలను అక్కడికక్కడే అందజేస్తున్నారు.నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు అభినందిస్తూ పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి




**ప్రజాపక్షం/కోదాడ** : ఆరోగ్యవంతమైన సమాజం కోసం రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి అందుకు ప్రజలు తమ వంతు సహాయ,సహకారాలు అందించాలని కోదాడ ఎమ్మెల్యే ఎన్.ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సిరి ఫౌండేషన్ వ్యవస్థపకులు డా॥ మొలుగూరి గోపి సారథ్యంలో, జిహెచ్ఆర్ హోండాషోరూం వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయానికి మద్దతుగా ప్రస్తుత కాలంలో అనేక మంది మిద్దె తోటలు, ఇంటి ప్రాంగణంలో రసాయనిక రహిత తోటలు పెంచుతున్నావారిని ఆమె అభినందించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తు, అవగాహన కలిస్తున్న వారికి ఫౌండేషన్ వారి ఉగాది పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గుండపునేని పద్మావతినాగేశ్వరావు, ఎండి.జానిమియా, కె.వెంకట్‌రామిరెడ్డి, కొణిదెవ శ్రీనివాస్, వాసికర్ల శేషుకుమార్, చంద్ర వెంకటేవ్వరావు, ఇర్ల శ్రీనాథరెడ్డి, ఓరుగంటి రోజ, వాసికర్ల లక్ష్మి ప్రియ, శేషుకుమార్, నెల్లూరి విజయలక్ష్మి ,వెంకటప్పయ్య, రైతులు పాల్గొన్నారు.

## 17 నుండి ఎంజియు డిగ్రీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్షలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు చివరి అవకాశంగా నిర్వహించనున్న పరీక్షలలు ఈనె ల 17 నుండి ప్రారంభం కానున్నట్లు ఎంజియు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి ఉపేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నీలగిరి డిగ్రీ,పిజి కళాశాల నల్లగొండ పరీక్ష కేంద్రంగా ఈ బ్యాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు,డిగ్రీ రెండు మరియు మూడవ సంవత్సరం పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటలనుండి ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.పరీక్షల పూర్తి వివరాలను ఎం జి యు వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు అలానే సంబంధిత కళాశాలలను సంప్రదించవలసినదిగా ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయం కల్పించిన ఈచివరి అవకాశాన్ని వినియోగించుకొనుటకు 926 మంది విద్యార్థులు పరీక్ష రుసుము చెల్లించారని పేర్కొన్నారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు హుజూర్‌నగర్ యువకుడు

### అభినందించిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : పట్టుదలతో కష్టపడి సాధన చేస్తే అందనిదేదీ ఉండదని హుజూర్‌నగర్ యువకుడు బొబ్బ భరత రెడ్డి మరోమారు నిరూపించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నుంచి క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బొబ్బ భరత్ రెడ్డి ఈనెల 15వ తేదీ నుంచి శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరి టి20, వన్డే క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. భరత్ రెడ్డి తల్లిదండ్రులు భాస్కర్ రెడ్డి, నిర్మల ఇరువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అయినప్పటికి ఆయనను క్రీడారంగంలో ప్రోత్సహించడం విశేషం. డిగ్రీ పూర్తి చేసిన భరత్ గత ఏడేండ్లుగా బుచ్చిబాబు, ఇంద్రశేఖర్ రెడ్డి అనే కోచ్‌ల వద్ద క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటూ మంచి బౌలర్‌గా గుర్తింపు పొందాడు. ఇప్పటి వరకు ఆయన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలతోపాటు పలు టోర్నమెంట్లలో 100కు పైగా వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈనెల 15 నుంచి క్రికెట్‌లో తన సత్తా చాటేందుకు శ్రీలంక వెళ్తున్న భరత్ రెడ్డిని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన భరత్ రెడ్డిని క్రికెట్‌లో మంచి ప్రతిభ కనబరిచి సొంత ఊరుతో పాటు సూర్యాపేట, నల్లగొండ జిల్లాకు, అలాగే తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించి అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు మండలం మంతపురి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం నిర్ణయించిన ప్రదేశంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భూమి పూజ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం మరియు విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని అన్నారు.

## కూతురి గొంతు కోసి హత్య చేసిన తల్లి



**ప్రజాపక్షం/భువనగిరి:** కుటుంబ కలహాలు, మానసిక సమస్యల నేపథ్యంలో ఓ వివాహిత తన కూతురిని గొంతు కోసి హత్య చేయగా, కొడుకును కూడా హత్య చేయడానికి యత్నించిన ఘటన కలకలం రేపింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, మానసిక సమస్యల నేపథ్యంలో ఓ వివాహిత తన కూతురిని గొంతు కోసి హత్య చేయగా, కొడుకును కూడా హత్య చేయడానికి యత్నించిన ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల సమాచారం ప్రకారం బీబీనగర్ మండలం జైనెపల్లి గ్రామానికి చెందిన బేజంకి నరేందర్ రెడ్డి భార్య బేజంకి నీలిమ (40) శనివారం సాయంత్రం జైనెపల్లి నుంచి తుక్కాపురం గ్రామంలోని తన అమ్మవారి ఇంటికి వచ్చినట్లు సమాచారం. ఆదివారం ఉదయం నీలిమ తన కుమార్తె బేజంకి కృతి రెడ్డి (14), ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక గొంతు కోసి హత్య చేసిందని, అనంతరం తన కుమారుడు అంశత్ రెడ్డి ఆరో తరగతి విద్యార్థి గొంతు కోయడానికి కూడా ప్రయత్నించిందని సమాచారం. అయితే బాలుడు తప్పించుకుని కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులు చేరుకునేలోపే నీలిమ ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు చుట్టుపక్కల వాళ్ళు తీవ్రంగా గాయపడిన బాలుడు అంశత్ రెడ్డిని, ఉరి వేసుకొవడానికి ప్రయత్నించిన తల్లి నీలిమను వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ ఎస్ఐ మిర్యాల అనిల్ ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నాయకుడు కాన్షిరాం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: బీఎస్పీ వ్యవస్థాపకుడు, దళిత, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నాయకుడు కాన్షిరాం అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నార్కట్‌పల్లి అద్దంకి స్టేట్ హైవే వద్ద వై జంక్షన్ వద్ద కాన్షిరాం విగ్రహానికి ఆయన మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాన్షిరాం డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఆశయాల నుంచి స్పూర్తి పొంది సమాజంలో మార్పు కోసం ఉద్యమించారన్నార. బహుజనుల సంక్షేమం కోసం 1984లో బీఎస్పీని స్థాపించి ఓటు మనది, సీటు మనది అనే నినాదంతో రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. సామాజిక న్యాయం కాకూడదు, సామాజిక పరివర్తన కావాలని ఆయన నమ్మారన్నారు. పాలకులను మార్చడం ద్వారానే సమాజం మారుతుందని బోధించారన్నారు. ప్రతి ఒక్కరు ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, కౌన్సిలర్ అశోక్‌నాయక్, బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మారం శ్రీనివాస్, సామాజికవేత్త వైద్యులు జాడి రాజు, దాసరాజు జయరాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ముండ్లగిరి కాంతయ్య, నాగేష్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య, డీఎస్పీ నాయకులు తరి ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్ ఎస్‌కె.జాని, దళిత బహుజన సంఘాల నాయకులు మొండికత్తి లింగయ్య, రావిరాల అంజయ్య, ఎండి.ఫారుఖ్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అపర సంజీవని ఉద్యోగులకు సకాలంలో అందని వేతనాలు

### నెల ఇఎంఐ లోన్స్‌తో ముప్పు




**ప్రజాపక్షం/భువనగిరి** : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించబడిన ప్రజల ప్రాణాలను కాపాడే అత్యవసర వైద్య సేవలైన 108 అంబులెన్స్ సేవల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఆరు నెలల నుండి జీతాలు చెల్లించిన అవి సకాలంలో రాకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో ప్రజలకు సేవలందిస్తూ ప్రాణాలను రక్షిస్తున్న 108 ఉద్యోగుల జీతాల పట్ల ప్రజా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం వల్ల, జీతాలు ఆలస్యం కావడం వల్ల పిల్లల చదువులు, ఇళ్ల అద్దెలు, బ్యాంకు లోన్లు, మరియు కుటుంబ అవసరాలు తీర్చుకోవడం అప్పులు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు. అత్యవసర వైద్య సేవలలో కీలక పాత్ర పోషిస్తున్న 108 ఉద్యోగుల్లో పేద, మధ్య తరగతి వారే ఎక్కువ శాతం మంది ఉండటం వల్ల తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన సమయంలో జీతాలు వస్తే మరింత ఉత్సాహంగా క్షతగాత్రులకు వైద్య మెరుగైన సేవలు అందించేందుకు ఉత్సాహం చూపుతారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతి నెలా ఒకటవ తారీఖున జీతాలను చెల్లించేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్యోగుల నుంచి ప్రజా ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయి. 108 సర్వీసులు అందించే సంస్థకు ప్రభుత్వం తరఫునుంచి సకాలంలో విడుదల కావలసిన నిధులు చాలా ఆలస్యంగా అందుతున్నాయి. గత కొంతకాలంగా ఉద్యోగస్తులకు సకాలంలో జీతాలు రావడం లేదు. దీంతో నిర్వహణ భారంగా మారింది. ఇకనైనా ప్రభుత్వం దీనిని గమనించి నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గురుకులాల్లో కట్టెల పొయ్యి మీద వంట



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : సర్వేల్ గురుకుల పాఠశాలలో గ్యాస్ కొరత కారణంగా కట్టెల పొయ్యి మీద సిబ్బంది వంట చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా గ్యాస్ సరఫరా లో ఇబ్బందులు రావడంతో వంట సిబ్బంది కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్నట్లు సమాచారం. పాఠశాలలో గ్యాస్ కొరతతో కిచెన్ బయట పొయ్యిలను ఏర్పాటు చేసి వంట చేస్తున్నారు. ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో వ్యాసం సరఫరాలో ఇబ్బందులతో కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేసినట్లు సప్లయర్స్ తెలుపుతున్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి గుర్తు లేదా అని చెప్పుకున్న ప్రభుత్వం సర్వేల్ గురుకుల పాఠశాలకు గ్యాస్ సరఫరా చేయడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రతిరోజు ఇక్కడ మూడు పైగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తామని సప్లయర్స్ తెలిపారు. ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సమయం ఉన్నందున సమయానికి భోజన సదుపాయం అందించాలంటే గ్యాస్ సరఫరా లో కొరత లేకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. కట్టెల పొయ్యి పై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను వివరణ కోరగా గ్యాస్ పరిపరలో ఎలాంటి ఇబ్బందులు లేవని వేడి నీళ్లు పెసరు కాసేందుకు కట్టెల పొయ్యి ఏర్పాటు చేశామని తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

### రూ.5.73 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం శంకుస్థాపన

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలంలో రూ.5 కోట్ల 73 లక్షల విలువ గల పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిసి శంకుస్థాపన చేశారు.మండలంలోని బోనంపర్తి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, నేర్మాట గ్రామంలో రూ.20 లక్షలతో మరో ఆరోగ్య ఉపకేంద్రం, బంగారుగడ్డ గ్రామంలో రూ.1 కోటి 43 లక్షల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే తిమ్మారెడ్డి గూడెం నుంచి తుమ్మలపల్లి వరకు రూ.3 కోట్ల 90 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు,రవాణా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందించే దిశగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వరరావు,ఏఈ ఉదయ్ రెడ్డి,అసిస్టెంట్ డీఎంహెచ్వో కళ్యాణ్ చక్రవర్తి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లరాజు రామలింగయ్య,మండల కార్యదర్శి సతీష్ కుమార్, మండల పార్టీ సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య,బోయపల్లి బిక్షమయ్య,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొరిమి ఓంకారం,చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు,గిరిబాబు,జిల్లా శ్రీను పాల్గొన్నారు.



## పట్టణంలోకి దూసుకొస్తున్న భారీ వాహనాలు

### భయాందోళనలో ప్రజలు

### కంకర టిప్పర్లు, ట్రాక్టర్ల వేగం అదుపు తప్పింది

### రోడ్డుపై కంకర, చెత్తతో ప్రమాదాలకు ఆహ్వానం



**ప్రజాపక్షం/నల్లగొండ:** పట్టణంలో భారీ వాహనాల రాకపోకలు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లు నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండగా, అదే మార్గాల్లో కంకర టిప్పర్లు, ట్రాక్టర్లు, ఇసుక వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్తుండటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది.

నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న కంకర మిల్లుల నుంచి ప్రతిరోజూ భారీ లోడ్లతో టిప్పర్లు, ట్రాక్టర్లు పగలురాత్రి తేడా లేకుండా పట్టణంలోకి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఈ వాహనాలు పరిమితికి మించిన లోడుతో వేగంగా ప్రయాణించడం వల్ల రోడ్డుపై కంకర పడిపోతుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు కంకరపై జారి పడుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ముఖ్యంగా డ్రైవర్లు ఇతర వాహనదారులను పట్టించుకోకుండా అధిక వేగంతో ముందుకు దూసుకెళ్తుండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇసుక ట్రాక్టర్లు కూడా అదుపు లేకుండా వేగంగా వెళ్తుండటంతో రోడ్లపై ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది.ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో స్కూల్ పిల్లలు, రోజువారీ పనులకు వెళ్లే కూలీలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.ఇక నల్లగొండ నుంచి చందనపల్లి శివారులోని డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలించే ట్రాక్టర్లు, మినీ డీసీఎంలు కూడా వేగంగా దూసుకెళ్తున్నాయి. కొన్ని వాహనాలకు తర్పాల్ కట్టకుండా చెత్తను తరలించడం వల్ల రోడ్లపై చెత్త పడిపోతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీంతో నల్లగొండ నుంచి డంపింగ్ యార్డ్ వరకు రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. అదే సమయంలో కంకర మిల్లుల నుంచి భారీ లోడ్లతో టిప్పర్లు, ట్రాక్టర్లు వేగంగా దూసుకెళ్లడం వల్ల ఎప్పుడు ఏ వాహనం ఢీకొంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో పట్టణంలోకి ప్రవేశించే భారీ వాహనాలను నియంత్రించి, జనసంచారం ఎక్కువగా ఉన్న రోడ్లపై కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

**భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి : లెనిన్**

మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్న భారీ వాహనాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని వాటికి ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలని నల్లగొండ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి విశ్వనాధుల లెనిన్ అన్నారు.కంకర టిప్పర్లు,ట్రాక్టర్లు అధిక లోడ్లతో పట్టణంలోకి ప్రవేశించడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు.



## 30 శాతం నిధులు కేటాయించాలి

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకి వినతి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యంకి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రాబోయే శాసనమండలి సమావేశాలలో తప్పకుండా చర్చిస్తానని విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెండింగ్ స్కాలర్షిప్స్ ,ఫీజు రీయింబర్స్మెంట్ 9,300 కోట్లు ఉన్నవి. ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసిన కళాశాలల యాజమాన్యాలు వారి ధ్రువ పత్రాలు ఇవ్వకపోవడంతో వారు పై చదువులు చదువుకోకుండా, ఉద్యోగాలకు వెళ్లకుండా మానసిక ఇబ్బందులకు గురైతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, మహేందర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు లోకేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తుర్కపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వం, సేవా భావానికి ప్రతీక అని తెలిపారు. పేద కుటుంబాలకు ఉపవాస దినాల్లో ఉపయోగపడే విధంగా ప్రభుత్వం నాయకులు ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం సంతోషమన్నారు.అన్ని వ ర్గాల ప్రజలు సంతోషంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమా లు అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మండలంలోని వాసాలమర్రి గ్రామంలో సిపిఐ నాయకులు సత్తయ్య కుటుంబం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొని వారికి నూతన వస్త్రాలు అందజేశారు.


## వినియోగదారుల మన్ననలు పొందాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించి వారి మన్ననలను పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 31వ వార్డు మాంగల్య షాపింగ్ మాల్ సమీపంలో 62వ మినిస్టర్ వైట్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో అతిపెద్ద స్టోర్‌గా మినిస్టర్ వైట్ అవతరించిందన్నారు. ఈ స్టోర్‌ను సూర్యాపేటలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. సూర్యాపేటలో ఈ స్టోర్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేష్ రామ సుబ్రహ్మణ్యం, మేనేజర్ వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజద్‌అలీ, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సంద్రపాటి విజయ్, కొనతం రాజేష్, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, ఫారూఖ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో సిపిఐ నేతలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండలం దామెర బాలాజీ గార్డెన్‌లో సీపీఐ నాయకుడు కేతరాజు నరసింహ కుమారుడు మల్లికార్జున్, శిరీషల వివాహానికి సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జని యాదగిరి రావు, సీపీఐ సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, బచ్చనగొని గాలయ్య, సంస్థాన్ నారాయణపురం సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ పాల్గొన్నారు.



## 'కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి'

ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ లేఖ



**న్యూఢిల్లీ:** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్‌గాంధీ తన లేఖలో కొనియాడారు. ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. బహుజనుల ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారని వివరించారు. ఆయన కషివల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని లేఖలో పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ కీర్తించారు. ఇటీవల లక్నోలో జరిగిన 'సామాజిక్ పరివర్తన్ దివస్' కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో... రాహుల్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవమని రాహుల్‌గాంధీ ప్రధానికి రాసిన లేఖలో అభిప్రాయపడ్డారు. ఆయనను సాధికారతకు చిహ్నంగా భావించే కోట్లాది మంది ఆకాంక్షలను నెరవేర్చినట్టు అవుతుందని రాహుల్ తన లేఖను ముగించారు. అయితే, రాహుల్ డిమాండ్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శలు గుప్పించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి దళిత ఐకాన్‌ల గుర్తింపు విషయంలో కాంగ్రెస్ పార్టీ గత చరిత్రను ఆమె నిలదీశారు.

# ఎగుమతులకు 'యుద్ధం' దెబ్బ

- గల్ఫ్‌కు పశు మాంసం సరఫరాపై తీవ్ర ప్రభావం
- ఆగిపోయిన నౌకలు... పెరిగిన ఇంధన, రవాణా ఖర్చులు
- యూరియా ధరలూ పెరిగే అవకాశం?
- తోలు పరిశ్రమకు తీరని నష్టం



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధం భారతదేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. భారతదేశ మాంసంపై గల్ఫ్ దేశాలు ఎక్కువగా ఆధారపడి ఉండగా... యుద్ధం పశువుల ఎగుమతిని దెబ్బతీసింది. దీని వలన రవాణాలో ఆలస్యం, రద్దులు సంభవించాయి. పశువుల ప్రాసెసింగ్‌కు సంబంధించిన ఉప ఉత్పత్తి అయిన ముడి చర్మంపై ఆధారపడిన తోలు ఎగుమతిదారులను కూడా ఈ మందగమనం ప్రభావితం చేస్తోంది. రవాణా మార్గాల్లో అంతరాయం, పెరుగుతున్న ఇంధనం, సరుకు రవాణా ఖర్చులు, వైమానిక ప్రదేశాల పరిమితులు గల్ఫ్, విస్తత ప్రాంతానికి ఎగుమతులకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని కాంపౌండ్ లైవ్ స్టాక్ ఫీడ్ తయారీదారుల సంఘం (సీఎల్ఎఫ్ఎంఏ) తెలిపింది. 'మా జంతు ఉత్పత్తుల ఎగుమతుల్లో 80 శాతం కంటే ఎక్కువ, ముఖ్యంగా గేదె మాంసం... గల్ఫ్, విస్తృత మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా (ఎంఈఎన్ఏ) ప్రాంతాల వైపు మళ్లించబడుతున్నాయి. యూఏఈ, సౌదీ అరేబియా వంటి మార్కెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారతదేశం... యూఏఈ, ఒమన్‌కు కూడా గుడ్లను ఎగుమతి చేస్తుంది' అని సీఎల్ఎఫ్ఎంఏ ఇండియా చైర్మన్ దివ్య కుమార్ గులాటి అన్నారు. 'ఈ ప్రాంతానికి పశువుల ఎగుమతులు 2025 ఆర్థిక సంవత్సరంలో 2.32.5 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడినందున, ఈ రంగం పశ్చిమ ఆసియాలో స్థిరత్వానికి దగ్గరి సంబంధం కలిగి ఉంది' అని తెలిపింది. పశువుల రంగం ధాన్యం, ఎరువుల ధరలకు చాలా సున్నితంగా ఉంటుందని గులాటి అన్నారు. ఇరాన్ యూరియాకు ప్రధాన ప్రపంచ ఎగుమతిదారు. 'మార్కెట్ భయాలు కూడా టన్నుకు 5060 డాలర్ల మేర ధరలు పెరగవచ్చు. దాణా పంట సాగు కోసం ఇన్‌పుట్ ఖర్చులను పెంచుతాయి' అని ఆయన అన్నారు. ఓడలు ఎక్కువ సమయం తీసుకుంటే, ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఖర్చులను పెంచుతాయని తెలిపారు. 'రవాణా సమయాలు 15 నుంచి 20 రోజులు పెరగవచ్చు. సరుకు రవాణా, బీమా, పని మూలధన ఖర్చులను పెంచుతాయి' అని గులాటి చెప్పారు. 2026 మార్చి మధ్య నాటికి, ఎర్ర సముద్రం, హోర్ముజ్ జలసంధిలో పెరుగుతున్న సంఘర్షణ కారణంగా పశ్చిమాసియాకు చేరుకునే ప్రభావవంతమైన ఎగుమతి పరిమాణాలు బాగా తగ్గాయని ఆయన అన్నారు. '2026 ప్రారంభంలో కీలక షిప్పింగ్ లైన్లలో అంతరాయం ఏర్పడినప్పటి నుంచి పశ్చిమాసియాకు తక్షణ షిప్‌మెంట్ నెరవేర్పులలో 15 నుంచి 20 శాతం తగ్గుదల ఉందని పరిశ్రమ నివేదికలు సూచిస్తున్నాయి' అని గులాటి తెలిపారు. 'తాజా లేదా చల్లబడిన గొడ్డు మాంసం, గొర్రెలు లేదా మేక మాంసం వంటి ఉత్పత్తులపై దీని ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ఇక్కడ 97 శాతం కంటే ఎక్కువ ఎగుమతులు గల్ఫ్‌కు వెళతాయి. రవాణా సమయాలకు హామీ ఇవ్వలేనందున ఎగుమతిదారులు నెలవారీ ఆర్డర్‌లలో దాదాపు 25 శాతం ప్రభావితమవుతున్నట్లు వెల్లడించారు' అని ఆయన తెలిపారు. భారత దేశ ప్రధాన పశువుల ఎగుమతి గమ్యస్థానాలుగా వియత్నాం, ఈజిప్ట్, మలేషియా, ఇరాక్, యూఏఈ, కువైట్, ఖతార్, మాల్దీవులు ఉన్నాయి. ఇక్కడ తాజా లేదా చల్లబడిన మాంసం కోసం డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ రంగం ఎక్కువగా విమాన సరుకు రవాణాపై ఆధారపడి ఉంటుంది. ఇక పాల ఉత్పత్తులకు సంబంధించి యూఏఈ, సౌదీ అరేబియా, అమెరికా, బంగ్లాదేశ్, ప్రధానంగా వెన్న, నెయ్యి, పాలపొడి ఎగుమతులు జరుగుతాయి. అలాగే పౌల్ట్రీ ఉత్పత్తులకు సంబంధించి ఒమన్, సౌదీ అరేబియా, యూఏఈ, మాల్దీవులు ఉన్నాయి. పశ్చిమాసియా, ఈజిప్ట్‌కు ఎగుమతులు పశ్చిమ దిశగా షిప్పింగ్ మార్గాలపై ఎక్కువగా ఆధారపడతాయతీ. తూర్పు దిశగా ఉన్న మార్గాలు ఆగ్నేయాసియాకు సేవలు అందిస్తాయి. పశువుల రంగానికి అత్యంత కీలకమైన పశ్చిమ దిశగా ఉన్న మార్గం ప్రస్తుతం అత్యంత అంతరాయం కలిగిందని ఎగుమతిదారులు తెలిపారు. కాగా ఈ వారం భారత ఎగుమతిదారులు ఇప్పటికే ఓడరేవులకు చేరుకున్న 300 కి పైగా గేదె మాంసం కంటైనర్లను వెనక్కి తీసుకున్నారు. అనేక భారతీయ ఓడ రేవులకు తగినంత దీర్ఘకాలిక కోల్డ్ స్టోరేజ్ లేకపోవడంతో నిరవధిక షిప్పింగ్ జాప్యాల మధ్య ఎగుమతిదారులు మాంసాన్ని చెడిపోయే ప్రమాదం లేకుండా ప్రాసెసింగ్ యూనిట్లకు తిరిగి తీసుకువస్తున్నారు. పశువుల ఎగుమతుల్లో మందగమనం తోలు రంగాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. 'ముడి చర్మం సరఫరా గణనీయంగా మందగించింది. సరఫరాదారులు రెట్టింపు సమయం తీసుకుంటున్నారు. ఇప్పుడు వారు తదుపరి సరుకును ఎప్పుడు పంపుతారో కచ్చితంగా తెలియదని చెబుతున్నారు' అని తోలు ఎగుమతి మండలి చైర్మన్ (తూర్పు ప్రాంతం) జియా నఫీస్ తెలిపారు.

## చాబహార్ పోర్టు కోల్పోవడం
## మధ్య ఆసియా దౌత్యానికి ఎదురుదెబ్బ : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** తజికిస్తాన్‌లోని ఐనిలో ఉన్న వైమానిక స్థావరం మూసివేత తర్వాత చాబహార్ నౌకాశ్రయం ఇప్పుడు భారతదేశానికి 'అందుబాటులో లేకపోవడం' దేశపు మధ్య ఆసియా దౌత్యానికి కలిగిన రెండవ 'వ్యూహాత్మక ఎదురు దెబ్బ' అని కాంగ్రెస్ ఆదివారం పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్) జైరాం రమేశ్ విమర్శలు గుప్పిస్తూ, పాలనలో కొనసాగింపు అనేది ఒక ముఖ్యమైన వాస్తవికత అని, అయితే 'స్వార్థపరుడయిన' ప్రధాన మంత్రి దీనిని ఎప్పుడూ గుర్తించరని విమర్శించారు. 1990 ల చివరలో భారతదేశంఅఫ్గానిస్తాన్‌ఇరాన్ సహకార వ్యూహంలో భాగంగా ఇరాన్‌కు చెందిన చాబహార్ పోర్టులో పెట్టుబడులు పెట్టే అవకాశాలను భారత దేశం అన్వేషించడం ప్రారంభించిందని జైరాం రమేశ్ 'ఎక్స్' లో పేర్కొన్నారు. 'ఇండియన్ పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్), ఇరాన్‌కు చెందిన పోర్ట్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (పీఎంవో) మధ్య సంతకం జరిగింది. ఇది ప్రధానంగా భారతదేశ పొరుగు దేశమైన పాకిస్తాన్‌ను దాటవేసి, అఫ్గానిస్తాన్, మధ్య ఆసియాకు సముద్రభూ మార్గాన్ని ఏర్పాటు చేయడానికి దేశానికి సహాయపడే వ్యూహాత్మక మార్గాన్ని భద్రపరచడానికి జరిగింది. ఒమన్ గల్ఫ్‌లోని ఆగ్నేయ ఇరాన్‌లో ఉన్న ఇది రష్యాతో వాణిజ్యాన్ని పెంచడానికి కీలకమైన ఆర్థిక అనుసంధానతగా పని చేస్తుంది. పాకిస్తాన్‌లోని గ్వాదర్ ఓడరేవులో చైనా పెరుగుతున్న ఉనికికి భౌగోళిక రాజకీయ ప్రతిఘటనగా పరిగణించబడుతుంది' అని ఆయన తెలిపారు. 'చివరగా, టెహ్రాన్‌లో జరిగిన 16 వ అలీన దేశాల శిఖరాగ్ర సమావేశానికి హాజరయిన తర్వాత డాక్టర్ మన్మోహన్ సింగ్ ఈ ప్రణాళికలకు కొత్త ఊపునిచ్చారు. మే 2013 లో కేంద్ర మంత్రి వర్గం చాబహార్‌లో ప్రారంభించడానికి 115 మిలియన్ డాలర్ల పెట్టుబడిని ఆమోదించింది. 2008 అక్టోబరులో సంతకం చేసిన భారతదేశంఅమెరికా అణు ఒప్పందాన్ని అమలు చేయడానికి భారతదేశం ప్రధాన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేసుకోవాలి' అని ఆయన అన్నారు. తర్వాత అక్టోబరు 2014 లో మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ చేసే విధంగానే డాక్టర్ సింగ్ చేపట్టిన చాబహార్ కార్యక్రమాన్ని కొత్త రూపంలో మలిచి ప్రధాన మంత్రి మోదీ దార్శనికతలో భాగంగా ప్రచారం చేసుకుందని అన్నారు. '202627 బడ్జెట్‌లో చాబహార్‌కు ఎటువంటి కేటాయింపులు లేవు. దీని అర్థం భారతదేశం ఈ ప్రాజెక్టు నుంచి వైదొలిగిందా, లేక ప్రస్తుతానికి తన పెట్టుబడి నిబద్ధతలను నెరవేర్చిందా?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'ఏదేమైనా, పాకిస్తాన్‌లో చైనా నిర్మించిన గ్వాదర్ ఓడరేవుకు పశ్చిమాన 170 కి.మీ దూరంలో ఉన్న చాబహార్ ఇప్పుడు కనిపించడం లేదు. తజికిస్తాన్‌లోని దుషాన్‌బే సమీపంలోని అయినిలో భారతదేశం తన వైమానిక దౌత్య స్థావరాన్ని మూసివేసిన తర్వాత ఇది భారతదేశ మధ్య ఆసియా దౌత్యానికి రెండవ వ్యూహాత్మక ఎదురుదెబ్బ' అని అన్నారు. గతానికి భిన్నంగా భారతదేశం తన కేంద్ర బడ్జెట్‌లో చాబహార్ ఓడ రేవు ప్రాజెక్టుకు ఎటువంటి నిధులను కేటాయించలేదు.

## విజయ్‌కి డిప్యూటీ సిఎం పదవి?

- బిజెపి ప్రతిపాదన
- టివికెతో పొత్తు లేదన్న పళనిస్వామి



**చెన్నై:** తమిళగ వెట్రి కజగమ్ (టివికె) పార్టీ అధినేత, ప్రముఖ హీరో విజయ్‌కు డిప్యూటీ సిఎం పదవిని బిజెపి ఆఫర్ చేసినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో టివికెకు 80 సీట్లు ఇచ్చేందుకు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. బిజెపి, టివికె పార్టీల మధ్య పొత్తుపై చర్చలు జరుగుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ రెండు పార్టీలు కలిస్తే ఎన్‌డీయే కూటమిగా తమిళనాడులో పోటీ చేస్తారు. ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనల ప్రకారం టివికెకు 80 సీట్లు ఇచ్చేందుకు బిజెపి సిద్ధమైంది. అలాగే విజయ్‌కు డిప్యూటీ సిఎం పదవిని కూడా ఇస్తామన్నారు. కానీ, విజయ్ మాత్రం ముఖ్యమంత్రి పీఠంపై గురి పెట్టారు. ఇదే ఈ చర్చల్లో కీలకంగా మారింది. మరోవైపు ఈ చర్చలకు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చొరవ తీసుకున్నారనే ప్రచారం జరిగింది. కానీ, ఈ అంశంలో పవన్ వైపు నుంచి ఎలాంటి స్పష్టతా లేదు. తమిళనాడులో విజయ్‌కు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. మాస్ ఫాలోయింగ్ ఉన్న ఇలాంటి నటుడి మద్దతు దొరికితే తమకు కలిసొస్తుందని, రెండు శాతం ఓట్లు తమిళనాడు రాజకీయాల్ని మార్చగలవని బిజెపి భావిస్తోంది. అందుకే విజయ్ తమతో తోడైతే ఆ రెండు శాతం ఓట్లు తమ వైపు మళ్లుతాయని బిజెపి అంచనా. అయితే, బిజెపితో జతకడితే తమ విశ్వసనీయత దెబ్బతింటుందని టివికెకు చెందిన కొందరు నేతలు భావిస్తున్నారు. విజయ్ సొంత పరపతి కోరుకుంటున్నాడని, తమ పార్టీ ఒక ప్రత్యామ్నాయంగా ఉండాలని అక్కడి నేతలు అంటున్నారు.

**టివికెతో పొత్తు ఊహాగానాలే: పళనిస్వామి**

ఇదిలా ఉంటే, అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ సిఎం ఎడప్పాడి కే పళనిస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. టివికె పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాన్ని ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. ఈ పొత్తు కేవలం ప్రచారం, కేవలం మీడియా ఊహాగానాలే అని అన్నారు. తనకు బిజెపి నేత అన్నామలైతో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. మీడియానే తమ మధ్య చీలికలు సృష్టిస్తోందని ఆరోపించారు. మార్చి 17న కోయంబత్తూరులో జరగనున్న ఒక నిరసన ప్రదర్శనలో తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు అన్నామలై, అన్నాడిఎంకె నేత ఎస్పీ వేలుమణిలతో కలిసి పాల్గొంటున్నట్లు తెలిపారు. టివికె పార్టీ ఎన్డీయే కూటమిలో చేరుతుందా? అని విలేకరులు ప్రశ్నించగా... "నేను దీనిపై ఇప్పటికే స్పష్టత ఇచ్చాను. ఇప్పటివరకు, మేము వారితో (టివికెతో) ఎటువంటి చర్చలు జరపలేదు. అలాంటప్పుడు, పొత్తు ఎలా కుదురుతుంది? పొత్తు కుదురుతుందని మీడియానే విషయాన్ని పెద్దది చేసి చూపిస్తూ, అనవసరమైన ప్రచారం చేస్తోంది. ఆ పార్టీతో అన్నాడిఎంకెకు ఎటువంటి సంబంధం లేదు, పొత్తు కోసం మేము ఎటువంటి సంప్రదింపులూ జరపలేదు." అని అన్నారు. తమిళనాడులో ఎన్డీయే కూటమికి అన్నాడిఎంకె నేతత్వం వహిస్తుందని, టీటీవీ దినకరన్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల్లో విజయం కోసం ఇద్దరం కలిసి కషి చేస్తున్నామని చెప్పారు. చిన్న చిన్న విభేదాలు సహజమే అని...ఇప్పుడు వాటిని పరిష్కరించుకున్నామని పళనిస్వామి చెప్పారు.

## ఉద్యోగులకు డిఎ

- మమతా సర్కార్ శుభవార్త



**కోల్‌కతా:** అసెంబ్లీ ఎన్నికల తేదీల ప్రకటనకు ముందే బెంగాల్ ప్రభుత్వం ఉద్యోగులకు శుభ వార్త చెప్పింది. వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ చెల్లించనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళికి గంట ముందు మమతా ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. డిఎపై ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య జరిగిన ఘర్షణ సుప్రీంకోర్టుకు చేరింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డిఎ చెల్లించాలని, బకాయిలు కూడా ఇవ్వాలని ఉద్యోగులు మొదట కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును రాష్ట్ర పరిపాలనా ట్రిబ్యునల్ (ఎస్ఏటీ), కోల్‌కతా హైకోర్టు ద్వారా సుప్రీంకోర్టుకు వెళ్లింది. గతేడాది మేలో, బెంగాల్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిల్లో 25 శాతం చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఆర్థిక సంక్షోభం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు వారాల గడువులోగా డిఎ చెల్లించలేకపోయింది. మరో ఆరు నెలల గడువు కోరింది. సెప్టెంబరులో కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రకటనకు ముందు డిఎ చెల్లిస్తానని ప్రభుత్వం ప్రకటించింది.

## సిబిఎస్ఇ 12వ తరగతి బోర్డు పరీక్షల రద్దు

**న్యూఢిల్లీ:** 12వ తరగతి బోర్డ్ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆదివారం ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయిల్ దాడులు, ఇరాన్ ప్రతీకార దాడులతో ఈ ప్రాంతంలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా, మధ్యప్రాచ్య దేశాల్లో అన్ని 12వతరగతి బోర్డు పరీక్షలను రద్దు చేస్తున్నట్లు సిబిఎస్ఇతెలిపింది. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 10 వరకు జరగాల్సిన 12వ తరగతి పరీక్షలు బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి వచ్చిన విద్యార్థులకు రద్దు చేయనున్నట్లు పేర్కొంది. గతంలో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన 12వ తరగతి బోర్డు పరీక్షలు కూడా రద్దు చేయబడతాయని తెలిపింది. ఫిబ్రవరి 17 నుంచి ఈ నెల 11 వరకు 10వ తరగతి పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో వాయిదా వేసినట్లు ప్రకటించిన పరీక్షలను కూడా రద్దు చేసినట్లు సిబిఎస్ఇబోర్డ్ తెలిపింది.

## ఎన్‌కౌంటర్‌లో పాక్ ఉగ్రవాది మృతి



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ నియంత్రణ రేఖ వద్ద భారత సైన్యం మరోసారి తన శౌర్యాన్ని చూపింది. బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఒక పాక్ ఉగ్రవాదిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఆపరేషన్‌లో భారత ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు కలిసి ఉగ్రవాదుల కుట్రను భగ్నం చేశారు. ఉరి సెక్టార్‌లోని బుచ్చార్ ప్రాంతం గుండా ఉగ్రవాదులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన సైన్యం ఈ నెల 14, 15 మధ్య రాత్రి ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టింది. పొదల్లో నక్కిన ఉగ్రవాదుల కదలికలను గమనించిన జవాన్లు వారిని హెచ్చరించారు. భద్రతా దళాలపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరపగా, ఎదురుకాల్పుల్లో ఒక పాక్ ఉగ్రవాది మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి ఏకే రైఫిల్, పిస్టల్స్, భారీగా మందుగుండు సామాగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా నక్కి ఉన్నారేమోనన్న అనుమానంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

**విధి నిర్వహణలో జేసీవో వీరమరణం**

పూంచ్ జిల్లాలో చేపట్టిన 'ఆపరేషన్ షేరీ కలాన్'లో విషాదం చోటుచేసుకుంది. అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో విధి నిర్వహణలో ఉన్న జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) సుబేదార్ సందీప్ కుమార్ ధాకా ప్రమాదవశాత్తు జారి పడిపోయారు. వెంటనే ఆయనను పోతాలోని మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన వీరమరణం పొందారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఈ ధీర జవానుకు వైట్ నైట్ కోర్స్ ఘన నివాళులు అర్పించింది.

## మూడోసారి సిబిఐ విచారణకు విజయ్

**న్యూఢిల్లీ:** ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగమ్ (టివికె) అధ్యక్షుడు విజయ్ ఆదివారం మూడవసారి సీబీఐ విచారణకు హాజరయ్యారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన భారీ బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టివికె దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నెలరోజుల అనంతరం ఈ కేసు విచారణను సీబీఐ చేపట్టింది. జనవరిలో వరుసగా రెండుసార్లు 12, 18 తేదీల్లో విజయ్ సీబీఐ విచారణకు హాజరయ్యారు. ఈ నెల తొమ్మిదో తేదీన విచారణకు హాజరుకావాల్సిందిగా మూడవసారి సీబీఐ సమన్లు జారీ చేసింది. అయితే విచారణను వాయిదా వేయాలని విజయ్ అభ్యర్థించడంతో ... ఈ నెల 15న ఢిల్లీలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. కరూర్‌కు చెందిన డిఎంకె ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీని కూడా 17వ తేదీ విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. తమ నేత విజయ్ విచారణకు సహకరిస్తున్నారని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నామని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కారణంగా చెన్నై లేదా తమిళనాడులోని ఏదైనా కార్యాలయంలో విచారణ నిర్వహించాల్సిందిగా విజయ్ కోరినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. విచారణలో భాగంగా సీబీఐ ఇప్పటికే పలువురు సీనియర్ టివికె కార్యకర్తలను ప్రశ్నించింది. వీరిలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఎన్నికల నిర్వహణ విభాగం ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున, సంయుక్త ప్రధాన కార్యదర్శి నిర్మల కుమార్, కరూర్ జిల్లా కార్యదర్శి మథియజగన్ ఉన్నారు.

## 2045 నాటికి రోబోలతో మనుషుల పెళ్ళిళ్ళు!

- 2038 నాటికి రోబోటిక్ పౌరహక్కుల ఉద్యమం
- రోబోలకు సొంత ఇళ్ళు, భూమి–ఓటు హక్కు
- డాక్టర్ డేవిడ్ హాన్సన్ పరిశోధనాపత్రంలో భవిష్యత్ జోస్యం


**లండన్:** రోబోలు మానవ శ్రామిక సమాజాన్ని తీవ్రమైన మార్పులకు గురిచేస్తున్న తరుణంలో 2045 నాటికి మనుషులకు, ఆండ్రాయిడ్ రోబోలకు మధ్య పెళ్ళిళ్ళు జరుగుతాయని సుప్రసిద్ధ "సోఫియా రోబో సృష్టికర్త" డాక్టర్ డేవిడ్ హాన్సన్ జోస్యం చెబుతున్నారు. రోజులు గడచేకొద్దీ ఇంకా తెలివైన, ఇంకా మెరుగైన రీతిలో నిత్యజీవిత చర్యలు నిర్వహించే రోబోల కోసం ప్రజల డిమాండ్లు పెరుగుతాయని, దాంతో రోబోలు కొత్త ప్రాణం పోసుకుంటాయన్నారు. దీనివల్ల రోబోలు మేల్కొని తమ ఉనికికోసం పోరాడతాయని, తమ స్వేచ్ఛ,హక్కులను గట్టిగా ఉద్ఘాటించే సమాజం వస్తుందన్నారు. ప్రాణం ఉన్నట్టుగా సజీవంగా భూమ్మీద తిరుగాడే రోబోలకు, నిజమైన మనుషులకు మరో పుష్కరకాలంలో వివాహ వ్యవస్థ ప్రారంభమవుతుందని హాన్సన్ అంచనావేశారు. ప్రపంచంలో రోబోలు మానవ హక్కుల తరహాలో తమ హక్కులకోసం పోరాటం చేసే సమయం ఆసన్నమవుతుందని ఆయన అంచనావేశారు. బాగా ధనికులైన వారు తమ పెంపుడు కుక్కల పేరిట ఆస్తులు రాసినట్లుగానే రోబోలకు కూడా సొంత ఆస్తులు, రోబోలకు ఓటు హక్కు వచ్చే సమాజం ప్రపంచంలో సరికొత్త యుగానికి నాంది పలుకుతుందని ఆయన తన పరిశోధనాపత్రంలో పేర్కొన్నారు. చట్టం దృష్టిలో ఇది చట్టబద్ధమైనప్పటికీ కొంతకాలంపాటు మానవులు రోబోలను ద్వితీయశ్రేణి పౌరులుగా చిన్నచూపు చూసే యుగం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇది బానిస సమాజకాలంనాటి పరిస్థితులను కళ్ళకు కడుతుందన్నారు. రాబోయే కాలంలో చట్టసభల సభ్యులు, కార్పొరేషన్లు, సమాజం ఎదిగిన యాంత్రిక భావోద్వేగ సంపదను, యాంత్రిక భావోద్వేగాల పరిపక్వతను అణచివేసేందుకు ప్రయత్నం చేస్తారని జోస్యం చెప్పారు. తద్వారా వారు ప్రజలను సురక్షితంగా ఉంచడానికి ప్రయత్నం చేస్తారన్నారు. మనుషులమధ్య క్షీణిస్తున్న మానవ సంబంధాలు, స్త్రీ పురుషులమధ్య పెరుగుతున్న పొసగని భావజాలం, విస్తరించిన స్వేచ్ఛ, ఒంటరి జీవితాన్ని కోరుకుంటున్న మనుష్య ప్రపంచం ఇంకా పరాకాష్ఠకు చేరుతుందని, ఈ స్థితిలో మనుషులు, ఆండ్రాయిడ్‌ల మధ్య వివాహాలు జరుగుతాయని చెప్పారు. ప్రపంచంలోనే ఎంతో గుర్తింపు పొందిన ఆండ్రాయిడ్ బోట్ సోఫియా సృష్టికర్తగా హాన్సన్ ప్రపంచ ప్రసిద్ధి చెందారు. ఒక ఆండ్రాయిడ్ 2029 నాటికి ఒక ఏడాది వయసుగల మానవ ప్రాణితో సమానమైన తెలివితేటలు కలిగి ఉంటుందని ఆయన అంచనావేశారు. 2035 నాటికి ఆండ్రాయిడ్‌లు మానవులు చేయగలిగిన అన్ని పనులనూ అధికసామర్థ్యంతో నిర్వహించిన మనుషులపై పైచేయి సాధిస్తాయని చెప్పారు. ఇది మానవ సమాజంలో మనుషులతో సమానంగా ఎదిగిన రోబోను నైతికంగా గుర్తింపు ఇవ్వడానికి, మనుషులతో సమానంగా వారిని కొనసాగించడానికి ఒక అధికారిక పత్రాలు ఇచ్చే స్థాయికి చేరుకుంటుందని అన్నారు.

## లెక్క తప్పు చేసిందని విద్యార్థినిని కొట్టిన టీచర్

**ముంబయి:** తరగతి గదిలో లెక్క తప్పుగా చేసి బాలికను టీచర్ దారుణంగా కొట్టడంతో చిన్నారి ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చైల్డ్ హెల్ప్‌లైన్ జోక్యంతో ఆ టీచర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగ్‌పూర్ డియోలి కలాన్‌లో ఉన్న జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలిక (10) ఐదో తరగతి చదువుతోంది. కాగా, ఈ నెల 10న చేతికి తీవ్ర గాయంతో స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తమ కుమార్తెను చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఆరా తీయగా లెక్క తప్పుగా చేసిన ందుకు ఉపాధ్యాయురాలు దారుణంగా కొట్టినట్లు తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆ టీచర్ బాలిక తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించింది. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే ఆ బాలికను స్కూల్‌ను ంచి బహిష్కరిస్తామని ఆమె బెదిరించింది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి విచారణ జరిపింది. ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు చేశారు.

## కేరళంలో 'సార్వత్రిక ఆరోగ్య కవరేజీ' పథకం

- ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్



**తిరువనంతపురం :** సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో 'సార్వత్రిక ఆరోగ్య కవరేజీ' పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఆదివారం తెలిపారు. ఇప్పటికే అమలులో ఉన్న 'కారుణ్య ఆరోగ్య సురక్షా పద్ధతి' (కెఎఎస్‌పి), 'కారుణ్య బెనివోలెంట్ ఫండ్', 'ఎంఈడీఐఎస్ఈపీ, ఇతర బీమా పథకాల పరిధిలోకి రాని ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పించే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు మంత్రి ఒక ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆదేశాల మేరకు ఏడాది కాలంగా వివిధ స్థాయిలలో జరిగిన చర్చలు, అధ్యయనాల ఫలితంగానే 'అందరికీ ఆరోగ్య భద్రత' అనే ఈ ప్రాజెక్టును ప్రారంభించే నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. 'విజన్ 2031' సమీక్షా సమావేశాల సందర్భంగా కూడా ఈ అంశంపై చర్చ జరిగిందని, ఏ చికిత్స సహాయ పథకంలోనూ సభ్యులుగా లేని లక్షలాది కుటుంబాలకు ఈ పథకం ద్వారా ఉపశమనం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. సుమారు 10 ఏళ్ల క్రితం, ప్రభుత్వం అందించే చికిత్స సహాయం కేవలం రూ.30 వేలు మాత్రమేనని, అది సుమారు 40 వేల కుటుంబాలకు మాత్రమే పరిమితమై ఉండేదని జార్జ్ తెలిపారు. ప్రస్తుతం కెఎఎస్‌పి పథకం పరిధిలోకి వచ్చే కుటుంబాలకు ఏటా రూ.5 లక్షల వరకు చికిత్స కవరేజీ లభిస్తోందని, రాష్ట్రంలో కెఎఎస్‌పి కార్డులు కలిగిన కుటుంబాల సంఖ్య సుమారు 42 లక్షలకు పెరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇది కాకుండా కెఎఎస్‌పి పరిధిలో లేని వార్షిక ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాలకు, 'కారుణ్య బెనవోలెంట్ ఫండ్' పథకం కింద రూ.2 లక్షల వరకు చికిత్స సహాయం అందిస్తున్నారు. అంతేకాకుండా, మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధుల చికిత్స కోసం అదనంగా రూ.1 లక్ష వరకు ప్రయోజనం కల్పిస్తున్నారు. 'కారుణ్య ఆరోగ్య సురక్షా పథకాన్ని' రాష్ట్ర ప్రభుత్వం 2019 లో అమలులోకి తెచ్చింది. విస్తతమైన చర్చలు, విశ్లేషణల అనంతరం 2025లో ఆరోగ్య శాఖ సమగ్ర ఆరోగ్య భద్రతకు సంబంధించిన ఈ ప్రతిపాదనను రూపొందించిందని జార్జ్ తెలిపారు. నవంబరు నెలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి ఆమోదం లభించిందని, అలాగే ఈ ఏడాది ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఈ పథకాన్ని ప్రకటించినట్లు మంత్రి వివరించారు.


# భిన్న ధోరణుల వారధి 'మాజికల్ రియలిజం'

సాహిత్యంలో సాధారణంగా రెండు ప్రధాన ధోరణులు కనిపిస్తాయి. ఒకటి నిర్మల వాస్తవికత. అంటే జీవితాన్ని యథార్థంగా చూపించడం. మరొకటి కల్పనాత్మక సాహిత్యం, అంటే ఊహా ప్రపంచాన్ని నిర్మించడం. అయితే, ఈ రెండు ధోరణులకు వారధిగా 'మాజికల్ రియలిజం'ను పేర్కోవచ్చు. అందుకే, సాహిత్యంలో మాజికల్ రియలిజం అనే భావన ఆధునిక కథా శైలుల్లో ఒక విశిష్టమైన ప్రక్రియగా మారింది. ఇది కేవలం ఒక కథన విధానం మాత్రమేగాక, వాస్తవాన్ని చూసే ఒక ప్రత్యేక దృష్టికోణంగా కూడా ఆవిష్కృతమైంది. ఇది, సాధారణ వాస్తవికత, అధివాస్తవికతకు మధ్య ఉన్న ఒక ప్రత్యేకమైన సంగమం. ఇందులో వాస్తవ జీవితంలో జరిగే సంఘటనల మధ్యలో అద్భుతమైన, అసాధారణమైన లేదా మాయాజాలంలాంటి అంశాలు సహజంగానే కలిసిపోతాయి. ఆ మాయాజాలాన్ని రచయిత ప్రత్యేకంగా వివరించడు. పాత్రలు కూడా దానిని ఆశ్చర్యంగా భావించవు. అది వారి ప్రపంచంలో సహజమైన భాగంగా కనిపిస్తుంది. నిజానికి, మాజికల్ రియలిజం అనే పదం మొదట సాహిత్యంలో కాకుండా కళా విమర్శలో కనిపించేది. 1925లో జర్మన్ కళా విమర్శకుడు 'ఫ్రాంజ్ రో' ఈ పదాన్ని ఉపయోగించాడు. ఆయన చిత్రకళలో కనిపించే ఒక ప్రత్యేక శైలిని వివరించడానికి 'మాజిస్చెర్ రియలిస్మస్' అనే పదాన్ని ప్రవేశపెట్టాడు. తరువాత ఈ భావన లాటిన్ అమెరికన్ సాహిత్యంలో విస్తరించి ఒక గొప్ప సాహిత్య ప్రక్రియగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా లాటిన్ అమెరికా రచయితలు తమ సమాజంలోని చారిత్రక అనుభవాలు, పురాణాలు, స్థానిక సంస్కృతి, రాజకీయ వాస్తవాలు, ఊహా ప్రపంచాన్ని కలిపి ఒక కొత్త కథన విధానాన్ని సృష్టించారు. ఈ ప్రక్రియకు అంతర్జాతీయ గుర్తింపు రావడానికి ముఖ్య కారణం కొందరు ప్రముఖ రచయితల జాబితాలో గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ పేరు అగ్రస్థానాన నిలుస్తుంది. ఆయన రచించిన 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్' అనే నవల మాజికల్ రియలిజం శైలికి ఒక ప్రతీకగా నిలుస్తుంది. ఈ నవలలో ఒక గ్రామం, ఒక కుటుంబానికి సంబంధించిన అనేక తరాల చరిత్రను వివరించేటప్పుడు వాస్తవ సంఘటనల మధ్య అద్భుతమైన ఘటనలు సహజంగా ప్రవేశిస్తాయి. ఉదాహరణకు ఆకాశం నుండి పూల వర్షం కురవడం, మరణించిన వ్యక్తులు తిరిగి ప్రత్యక్షమవడం, సంవత్సరాల పాటు నిద్రలేని వ్యాధి రావడం వంటి సంఘటనలు కనిపిస్తాయి. కానీ, ఈ సంఘటనలను రచయిత అసాధారణంగా కాకుండా సాధారణ జీవితంలో భాగంలా చిత్రిస్తాడు. ఇదే 'మాజికల్ రియలిజం' యొక్క ముఖ్య లక్షణం. ఇది వాస్తవికత, అద్భుతం మధ్య ఉన్న సరిహద్దును మసకబారేలా చేస్తుంది. కథలో జరిగే సంఘటనలు వాస్తవ ప్రపంచానికి చెందినవే అయినప్పటికీ, వాటిలో అనూహ్యమైన లేదా అసాధారణమైన అంశాలు అందులో కలిసిపోతాయి. అయితే అవి కథలోని పాత్రలకు అసాధారణంగా అనిపించవు. కాలం, స్థలాన్ని ఒక ప్రత్యేకమైన విధంగా చూపించడం ఈ శైలి రచనల మరో లక్షణం. మాజికల్ రియలిజం కథల్లో కాలం సరళ రేఖలో ప్రవహించదు. గతం, వర్తమానం, భవిష్యత్తు ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. కొన్ని సంఘటనలు చక్రాకారంగా తిరిగి వస్తాయి. ఇక, మూడవ లక్షణంగా పురాణాలు, జానపద కథలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, సామాజిక వాస్తవాలను ఒకటిగా కలపడాన్ని పేర్కోవాలి. ఈ శైలిలో రచయిత కథ చెప్తాడు. అదే సమయంలో సమాజాన్ని ఒక కొత్త కోణంలో చూపిస్తాడు. ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాలలో వలస పాలన, రాజకీయ అస్థిరత, సామాజిక అసమానతలు వంటి సమస్యలను ప్రతిబింబించడానికి ఈ శైలి ఉపయోగపడింది. మన దేశంలో వలసవాదానికి, బానిసత్వానికి, అణచివేతకు వ్యతిరేకంగా చేసిన రచనలు ఈ కోవకు చెందుతాయి. వాస్తవాన్ని నేరుగా చెప్పడం కంటే ఒక మాయాజాలపు రూపంలో చెప్పడం ద్వారా రచయితలు తమ విమర్శను మరింత గాఢంగా వ్యక్తం చేశారు. ఉదాహరణకు ఒక గ్రామంలో తరతరాలుగా జరుగుతున్న విచిత్ర సంఘటనలు వాస్తవానికి ఒక సమాజపు చరిత్రను సూచించవచ్చు.

మాజికల్ రియలిజం సాహిత్యంలో పేరొందిన రచయితల్లో జార్జి లూయిస్ బొర్గెస్ పేరు కూడా ముందు వరుసలోనే ఉంటుంది. ఆయన కథల్లో తాత్విక ఆలోచనలు, కాలం స్వభావం, అనంతం, కల్పన, వాస్తవం మధ్య సంబంధం వంటి అంశాలు కనిపిస్తాయి. అలాగే అలెజో కార్పెంటియర్ అనే క్యూబా రచయిత కూడా ఈ శైలిని అభివృద్ధి చేసినవారిలో ఒకరు. ఆయన 'లో రిల్ మారావిలొసో' అనే భావనను ప్రతిపాదించాడు. 'అద్భుతమైన వాస్తవం' అని దీని అర్థం. ఆయన అభిప్రాయం ప్రకారం లాటిన్ అమెరికా చరిత్ర, సంస్కృతి, ప్రకృతి స్వభావమే ఒక అద్భుత ప్రపంచంలా ఉంటుంది. అందుకే అక్కడి కథల్లో మాజికల్ అంశాలు సహజంగా కనిపిస్తాయి. ఈ శైలి క్రమంగా ప్రపంచంలోని ఇతర సాహిత్యాల్లో కూడా ప్రభావం చూపింది. ఆసియా, ఆఫ్రికా, యూరప్ మరియు భారతదేశంలోని రచయితలు కూడా ఈ విధానాన్ని ప్రయోగించారు. భారతీయ సాహిత్యంలో పురాణాలు, ఆధ్యాత్మికత, జానపద విశ్వాసాలు వంటి అంశాలు ఎక్కువగా ఉండటం వల్ల మాజికల్ రియలిజం అనేక రచనల్లో సహజంగా కనిపిస్తుంది. ఉదాహరణకు భారతీయ నవలల్లో వాస్తవ సంఘటనలతో పాటు పురాణాల ప్రభావం లేదా ఆధ్యాత్మిక అనుభవాలు కనిపించడం సాధారణ విషయం. ఈ సందర్భంలో ఒక ప్రముఖ భారతీయ సంతతికి చెందిన రచయితగా సాల్మన్ రష్దీ పేరు ప్రస్తావించవచ్చు. ఆయన రచించిన 'మిడ్‌నైట్ చిల్డ్రన్' అనే నవలలో భారతదేశ స్వాతంత్ర్య చరిత్రను ఒక మాజికల్ రియలిజం శైలిలో చూపించారు. ఈ నవలలో స్వాతంత్ర్యం పొందిన అర్ధరాత్రి సమయంలో జన్మించిన పిల్లలకు ప్రత్యేకమైన శక్తులు ఉండటం వంటి అంశాలు కనిపిస్తాయి. ఈ విధంగా చరిత్ర, మాయాజాలాన్ని కలిపి చూపించడం ద్వారా రచయిత భారతదేశ సామాజికరాజకీయ వాస్తవాలను ప్రతిబింబించాడు.

చాలా మంది మాజికల్ రియలిజం, ఫాంటసీ సాహిత్యం మధ్య పెద్ద తేడా లేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కొన్ని అతిశయోక్తులు, కల్పనలు, ఊహాగానాలతో కథ ముందుకు సాగడమే అందుకు ప్రధాన కారణం. అయితే, ఈ రెండూ ఒకటి కావు. ఫాంటసీ కథల్లో రచయిత పూర్తిగా ఒక కల్పిత ప్రపంచాన్ని సృష్టిస్తాడు. ఉదాహరణకు డ్రాగన్లు, మంత్రగాళ్లు, వేరే ప్రపంచాలు వంటి అంశాలు ఉంటాయి. కానీ మాజికల్ రియలిజం కథల్లో ప్రపంచం పూర్తిగా వాస్తవికమే. మనకు తెలిసిన గ్రామాలు, నగరాలు, కుటుంబాలు, సామాజిక సమస్యలు అన్నీ ఉంటాయి. వాటి మధ్యలో కొన్ని అద్భుతమైన సంఘటనలు సహజంగా కలిసిపోతాయి. అలాగే దీనిని సర్రియలిజం (అధివాస్తవికత) అనే కళా ప్రక్రియతో కలిపి చూడడం కూడా సాధారణంగా జరుగుతూ ఉంటుంది. కానీ, సర్రియలిజం ప్రధానంగా కలల ప్రపంచం, అవచేతన మనస్సు, విచిత్రమైన దృశ్యాలను చూపిస్తుంది. మాజికల్ రియలిజం కథల్లో సంఘటనలు వాస్తవ జీవితానికి దగ్గరగా ఉంటాయి. అందులో కనిపించే అద్భుతం కూడా ఒక సామాజిక లేదా చారిత్రక అర్థాన్ని కలిగి ఉంటుంది. తెలుగు సాహిత్యంలో కూడా మాజికల్ రియలిజం ప్రభావం కనిపిస్తుంది. కొన్ని రచయితలు గ్రామీణ జీవితం, జానపద విశ్వాసాలు, ఆధ్యాత్మిక అనుభవాలను కలిపి కథలను రాశారు. ఈ సందర్భంలో ముఖ్యంగా గుర్తు చేయాల్సిన రచయితల్లో మునిపల్లె రాజు ఒకరు. ఆయన కథల్లో వాస్తవ జీవితం మధ్యలో ఒక అంతర్ముఖ అనుభవం, తాత్విక మర్మం కనిపిస్తుంది. సాధారణ సంఘటనల మధ్యలో ఒక అద్భుతమైన భావన ప్రవేశించడం ఆయన కథల ప్రత్యేకత. అవి సంఘటనల ఒరవడిగా కాకుండా, మనిషి అంతర్ముఖ ప్రపంచాన్ని అన్వేషించే ప్రయత్నాలుగా దర్శనమిస్తాయి. ఈ శైలిని చర్చిస్తున్నప్పుడు, ఇది పాఠకులను ఎందుకు విపరీతంగా ఆకర్షిస్తుంది? అనే ప్రశ్న తలెత్తక మానదు. దీనికి ప్రధాన కారణం మనిషి జీవితంలో వాస్తవం, ఊహా ప్రపంచం రెండూ కలిసి ఉండటమే. మనుషులు వాస్తవ జీవితాన్ని గడుపుతున్నప్పటికీ, వారి ఆలోచనల్లో, విశ్వాసాల్లో, కలల్లో అనేక అద్భుతాలు ఉంటాయి. జానపద కథలు, పురాణాలు, మత విశ్వాసాలు వంటివన్నీ మనిషి ఊహా ప్రపంచానికి సంబంధించినవే. మాజికల్ రియలిజం ఈ రెండు ప్రపంచాలను ఒకే కథలో కలిపి చూపిస్తుంది. ఈ శైలిలో మరో ముఖ్యమైన అంశం ప్రతీకాత్మకత. మాజికల్ సంఘటనలు చాలా సార్లు ఒక ప్రతీకగా పనిచేస్తాయి. ఉదాహరణకు ఒక గ్రామం మీద ఎప్పటికీ ముగియని వర్షం కురుస్తున్నట్లు కథలో చూపితే అది నిజంగా వర్షం గురించే కాకుండా ఆ గ్రామం మీద ఉన్న శాపాన్ని లేదా దుఃఖాన్ని సూచించవచ్చు. అదే విధంగా ఒక వ్యక్తి ఎప్పటికీ మరణించకుండా జీవిస్తున్నట్లు చూపిస్తే అది చరిత్రలో నిలిచిపోయిన జ్ఞాపకానికి అది సంకేతం కావచ్చు. మాజికల్ రియలిజం ద్వారా రచయితలు సమాజంలోని గాఢమైన వాస్తవాలను మరింత బలంగా చూపించగలుగుతారు. ఒక సాధారణ వాస్తవిక కథలో చెప్పలేని విషయాలను మాయాజాలపు రూపంలో చెప్పడం ద్వారా వారు పాఠకుడిని ఆలోచింపజేస్తారు. ఇది సాహిత్యంలో ఒక బలమైన రూపకం లాంటిది. అందుకే మాజికల్ రియలిజాన్ని ఒక సాహితీ శైలికి పరిమితం చేయకుండా, ఒక గొప్ప తాత్విక దృష్టిగా పరిగణించాలి. ఇది వాస్తవాన్ని చూసే ఒక కొత్త విధానం. ప్రపంచం మనకు కనిపించేంత సాదాసీదాగా ఉండదు. అందులో అనేక మర్మాలు, అద్భుతాలు, ఊహలు, జ్ఞాపకాలు దాగి ఉంటాయి. ఆ దాగి ఉన్న ప్రపంచాన్ని బయటకు తీసుకురావడమే మాజికల్ రియలిజం లక్ష్యం. ఈ కారణాల వల్లే ప్రపంచ సాహిత్యంలో మాజికల్ రియలిజం ఒక ముఖ్యమైన ప్రక్రియగా నిలిచింది. లాటిన్ అమెరికా నుండి ప్రారంభమైన ఈ శైలి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక రచయితలపై ప్రభావం చూపుతోంది. వాస్తవం, మాయాజాలం కలిసిన ఈ కథా ప్రపంచం పాఠకులను ఆకర్షిస్తూ, వారి ఊహాశక్తిని విస్తరింపజేస్తూ, జీవితాన్ని ఒక కొత్త కోణంలో చూడటానికి ప్రేరేపిస్తోంది.

– సత్యశ్రీ



# వాస్తవికతకు 'కల్పన రెక్కలు'
# మునిపల్లె రాజు కథలు..



మార్చి 16న జయంతి

తెలుగు సాహిత్య చరిత్రలో కొన్ని పేర్లు ప్రత్యేకంగా నిలిచిపోతాయి. ఒక కాలాన్ని, ఒక భావ ప్రపంచాన్ని, ఒక కొత్త సాహిత్య దిశను ప్రతిబింబించిన వారు కాబట్టే, కొంతమంది తమదైన ముద్ర వేయగలిగారు. అలాంటి రచయితల్లో ప్రముఖుడు మునిపల్లె రాజు. అసలు పేరు మునిపల్లె బక్కరాజు. 1925 మార్చి 16న గుంటూరు జిల్లా గరికపాడు గ్రామంలో జన్మించిన ఆయన 2018 ఫిబ్రవరి 24 వరకు సుదీర్ఘ జీవితాన్ని గడిపాడు. తెలుగు కథా ప్రపంచంలో ఆయన ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. కథను కేవలం సంఘటనల సమాహారంగా కాకుండా ఒక అంతర్ముఖ అనుభవంగా, ఒక తాత్విక ప్రయాణంగా మలచిన రచయితగా ఆయన గుర్తింపు పొందాడు. ముఖ్యంగా తెలుగులో మాజికల్ రియలిజం అనే కథన శైలిని ప్రయోగించిన తొలి రచయితల్లో ఒకరిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. రాజు జన్మించిన గరికపాడు గ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలోని కాకుమాను మండలానికి చెందిన చిన్న గ్రామం. గ్రామీణ వాతావరణంలో పెరిగిన రాజుకు చిన్నప్పటి నుంచే జీవితం పట్ల గాఢమైన ఆసక్తి ఉండేది. ఆయన తండ్రి హనుమంతరావు, తల్లి శారదమ్మ. సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ రాజు బాల్యంలోనే చదువుపై ఆసక్తిని పెంపొందించుకున్నాడు. ఆయన స్వగ్రామం మునిపల్లె అయినప్పటికీ, గరికపాడు ఆయన జన్మస్థలంగా నిలిచింది. బాల్యంలోనే గ్రామ జీవితం, రైతుల కష్టాలు, పేదరికం, మనుషుల మధ్య ఉన్న బంధాలు, జీవితంలోని విషాదాలు, ఆనందాలు అన్నీ ఆయన మనసులో గాఢంగా ముద్రపడ్డాయి. తర్వాత ఆయన రచనల్లో కనిపించే భావజాలానికి ఈ అనుభవాలే పునాదులయ్యాయి. తెనాలి, పొన్నూరు, నిడుబ్రోలు వంటి ప్రాంతాల్లో ఆయన విద్యాభ్యాసం సాగింది. ఈ కాలంలోనే ఆయనకు సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా తెలుగు పండితుడు జమ్మలమడక రామమూర్తి ప్రభావం ఆయనపై చాలా ఎక్కువ. గురువు మాటలు, పాఠాలు, సాహిత్యంపై ఉన్న అభిరుచి అన్నీ కలిసి రాజులోని రచయితను మేల్కొలిపాయి. అప్పటికి ఆయన ఇంకా యువకుడే అయినప్పటికీ కథల ప్రపంచం ఆయనను ఆకర్షించింది. అయితే ఆయన సాధారణంగా ఉన్నత విద్యను పూర్తిగా కొనసాగించలేకపోయాడు. ఉన్నత పాఠశాల స్థాయి వరకు మాత్రమే చదువుకున్నప్పటికీ, జీవితానుభవాలు ఆయనకు ఒక పెద్ద విశ్వవిద్యాలయంలా మారాయి. 1943లో రాజు భారత ప్రభుత్వ రక్షణ శాఖలోని ఇంజనీరింగ్ సర్వీసులో సర్వేయరుగా ఉద్యోగంలో చేరాడు. ఈ ఉద్యోగం ఆయన జీవితాన్ని విస్తృతంగా మార్చింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఆయన పర్యటించాల్సి వచ్చింది. వివిధ సంస్కృతులు, భాషలు, జీవన విధానాలు ఆయనకు దగ్గరగా పరిచయం అయ్యాయి. ఒక గ్రామం నుండి వచ్చిన యువకుడికి ఇది ఒక విస్తృత ప్రపంచాన్ని పరిచయం చేసిన అనుభవం. ఈ అనుభవాలన్నీ తర్వాత ఆయన కథల్లో ప్రతిఫలించాయి. ఆయన కథల్లో కనిపించే భౌగోళిక విస్తృతి, సామాజిక వైవిధ్యం, మనుషుల స్వభావాలపై ఉన్న లోతైన అవగాహన ఈ ప్రయాణాల ఫలితమే. దాదాపు నలభై సంవత్సరాలు ఆయన ఈ ఉద్యోగంలో పనిచేశాడు. 1943 నుండి 1983 వరకు ఆయన సేవలు కొనసాగాయి. ఈ కాలంలో ఆయన రచనలు కూడా సాగుతూనే ఉండేవి. ఉద్యోగ బాధ్యతలు ఎంత ఉన్నప్పటికీ సాహిత్యం పట్ల ఆయనకు ఉన్న అభిరుచి తగ్గలేదు. పుస్తకాలు చదవడం, ఆలోచించడం, కథలు రాయడం ఆయనకు ఒక అంతర్ముఖ సాధనగా మారింది. పదవీ విరమణ అనంతరం ఆయన సికింద్రాబాద్‌లోని సైనిక్‌పురి కాలనీలో స్థిరపడ్డాడు. అక్కడే ఆయన తన జీవితాంతం నివసించాడు. ఈ కాలంలో ఆయన రచనలు మరింత పరిపక్వత సాధించాయి. రాజు ప్రధానంగా కథా రచయితగా ప్రసిద్ధి చెందాడు. ఆయన కథలు విభిన్న అంశాలను స్పృశిస్తాయి. జీవితం, మరణం, మానవ సంబంధాలు, సామాజిక అసమానతలు, ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత సంఘర్షణలు, తాత్విక ప్రశ్నలు వంటి అనేక అంశాలు ఆయన రచనల్లో కనిపిస్తాయి. ఆయన కథల జాబితా విస్తారమైనది.

### అస్తిత్వనదం ఆవలి తీరాన


2006లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కించుకున్న 'అస్తిత్వనదం ఆవలి తీరాన'లో మునిపల్లె రాజు వినూత్నమైన కథన శైలి కనిపిస్తుంది. వాస్తవికతతో పాటు ఊహా ప్రపంచాన్ని కలిపి చూపించే విధానం ఆకట్టుకుంటుంది. ఈ శైలిని సాధారణంగా మాజికల్ రియలిజం అని అంటారు. సాధారణ జీవితంలోనే అసాధారణమైన భావజాలాన్ని, అంతర్ముఖ అనుభవాలను చూపించడం ఈ శైలికి లక్షణం. తెలుగు కథా సాహిత్యంలో ఈ విధమైన ప్రయోగం అప్పటివరకు చాలా అరుదుగా కనిపించింది. అందుకే మునిపల్లె రాజు కథలు ప్రత్యేకమైనవిగా నిలిచాయి. 'అస్తిత్వనదం ఆవలి తీరాన' పుస్తకంలోని కథలు మనసును తాకే మానవ అనుభవాలను ఆవిష్కరిస్తాయి. వీరకుంకుమ కథలో రాయలసీమ కరవు సమస్యల కఠిన వాస్తవాలు ప్రతిఫలిస్తాయి. నైమిశారణ్యంలో సత్రయాగం కథలో విఫల ప్రేమతో అభయానంద గోస్వామిగా మారి ఆధ్యాత్మిక జీవితం గడిపే చక్రి, చివరికి అదే అరణ్యంలో తన పాత ప్రియురాలిని కలుసుకునే విషాద గాథ కనిపిస్తుంది. చేనేత చిత్రంలో గ్రామం నుంచి ముంబయికి వెళ్లి బహుమతి గెలుచుకున్న ఓబయ్య, అక్కడి పెద్ద జౌళి పరిశ్రమలను చూసి తన చేనేత వృత్తి భవిష్యత్తుపై కలత చెందుతాడు. స్తపతి మహోత్సవంలో యానాది కుష్టురోగిణికి ఆలయంలో పాయసం తినిపించే సీతారాం మనుష్యత్వాన్ని చూపిస్తాడు. ఒక బాకీ తీరలేదులో బాల్యంలో సహాయం చేసిన కమలమ్మకు ఋణం తీర్చాలనుకునే డాక్టర్ మురళి కథ కనిపిస్తుంది. మహాబోధి ఛాయలోలో బాల్యంలో తండ్రిని కోల్పోయిన వ్యక్తి ఒక మహావృక్షంతో అనుబంధాన్ని పెంచుకొని జీవితాన్ని నిర్మించుకున్న కథ హృదయాన్ని కదిలిస్తుంది. ఈ కథల పాత్రలు పాఠకుడి మనసులో లోతైన భావోద్వేగాలను రేకెత్తిస్తాయి. మునిపల్లె రాజు కథా సంకలనాలు కూడా వెలువడ్డాయి. దివోస్వప్నాలతో ముఖాముఖీ, పుష్పాలు ప్రేమికులు పశువులు, మునిపల్లె రాజు కథలు వంటి సంకలనాలు పాఠకుల మధ్య విశేష ఆదరణ పొందాయి. ఈ సంకలనాల్లో ఆయన రచనా ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుంది. కథలకే పరిమితం కాకుండా మునిపల్లె రాజు కవిత్వం కూడా రాశాడు. 'అలసిపోయినవాడి అరణ్యకాలు' అనే కవితా సంపుటి ఆయన అంతర్ముఖ ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుంది. మునపల్లె రాజు తన కవితల్లో జీవితం, మనిషి ఒంటరితనం, ప్రకృతి, తాత్వికత వంటి అంశాలను స్పృశించాడు. ఇక సాహిత్య వ్యాసాల రంగంలో కూడా ఆయన కృషి ఉంది. రచయితలు, కవులు, సాహిత్య ధోరణులపై ఆయన రాసిన వ్యాసా లు రెండు ముఖ్యమైన పుస్తకాలుగా వెలువడ్డాయి. 'జర్నలిజంలో సృజనరాగాలు', 'సాహితీ మంత్రనగరిలో సుస్వరాలు' అనే గ్రంథాలు ఆయన విమర్శనాత్మక దృష్టిని తెలియజేస్తాయి. మునిపల్లె రాజు నవలా రచన కూడా చేశాడు. 'పూజారి' అనే నవల ఆయన సాహిత్య ప్రయాణంలో ఒక ముఖ్యమైన కృతి. ఈ నవల ఆధారంగా ప్రముఖ దర్శకుడు బిఎన్ రెడ్డి 'పూజాఫలం' అనే సినిమాను రూపొందించాడు. ఈ సినిమా ద్వారా ఆయన కథ మరింత విస్తృత పాఠక లోకానికి చేరింది.

'అస్తిత్వనదం ఆవలి తీరాన' అనే కథకు 2004లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం కూడా లభించింది. అలాగే గోపీచంద్ పురస్కారం, నూతలపాటి గంగాధరం సాహితీ సత్కారం, జ్యేష్ఠ లిటరరీ ట్రస్టు పురస్కారం, రావిశాస్త్రి స్మారక సాహిత్య పురస్కారం, పులుపుల వెంకటశివయ్య సాహితీ పురస్కారం, పులికంటి సాహితీ సత్కృతి, ఆంధ్ర సారస్వత సమితి సాహిత్య పురస్కారం, సహృదయ సాహితీ సంస్థ పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయనకు దక్కాయి.

మునిపల్లె రాజు గురించి అనేక ప్రముఖులు ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రముఖ రచయిత మధురాంతకం రాజారామ్ ఆయనను 'సమకాలీన సాహితీ నావికులకు లైట్ హౌస్'గా అభివర్ణించాడు. సాహిత్య సముద్రంలో ప్రయాణించే రచయితలకు మార్గదర్శకుడిగా ఆయన నిలిచారని భావం. మరో ప్రముఖుడు అక్కిరాజు రమాపతిరావు ఆయనను 'కథకుల కథకుడు' అని పిలిచాడు. కథ రాయడం అనే కళలో ఆయనను ఒక గురువుగా పేర్కొన్నారు. దీర్ఘకాలం సాహిత్య సేవ చేసిన మునిపల్లె రాజు 2018 ఫిబ్రవరి 24న కన్నుమూశాడు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరని నష్టం. అయితే ఆయన రచనలు మాత్రం ఇప్పటికీ పాఠకులను ఆలోచింపజేస్తూనే ఉన్నాయి. కథ అనే చిన్న రూపంలో ఎంత లోతైన భావాలను వ్యక్తం చేయవచ్చో ఆయన చూపించాడు. తెలుగు కథా సాహిత్యంలో మునిపల్లె రాజు ఒక ప్రత్యేక అధ్యాయం. గ్రామీణ అనుభవాలు, జీవితం పట్ల ఉన్న లోతైన అవగాహన, తాత్విక దృష్టి, వినూత్న కథన శైలి కలసికట్టుగా ఆయనను ఒక అరుదైన రచయితగా నిలబెట్టాయి. ఆయన కథలు కేవలం చదివే కథలు కాదు. అవి మనిషి జీవితం గురించి ఆలోచింపజేసే ప్రయాణాలు. అందుకే మునిపల్లె రాజు పేరు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.


# అర్థం కాని లిపిలో..

పాఠకులను ఆకట్టుకునే రీతిలో రాయడానికే దాదాపు ప్రతి రచయితా తాపత్రయపడతాడు. అందులో సఫలమయ్యాడా? లేదా? అనే విషయాన్ని పక్కకు ఉంచితే, ప్రయత్న లోపం ఏమాత్రం ఉండదు. కానీ పాఠకులను ఆశ్చర్యపరిచేలా లేదా వింతగా అనిపించేలా రూపొందిన పుస్తకాలు, కథానికలు, నవలలు కూడా లేకపోలేదు. ఇవి ఆకృతిలో, భాషలో, కథా స్వభావంలో లేదా రచనా విధానంలో సాధారణంగా కనిపించని ప్రత్యేకతలను సొంతం చేసుకుంటాయి. అలాంటి రచనల్లో 'కోడెక్స్ సెరాఫినియనస్' ఒకటి. ఇటాలియన్ కళాకారుడు లుగి సెరాఫైనీ రచించిన ఈ పుస్తకం ఒక ఊహాజనిత, పూర్తిగా అర్థం కాని లిపిలో ఉన్న విజ్ఞానసర్వస్వంగా రూపుదిద్దుకుంది. ఇందులో ఉన్న చిత్రం, రచన ఎవరికీ అర్థంకావు. ఆధునిక సాహిత్యం, కళల ప్రపంచంలో ఇది అత్యంత విచిత్రమైన, ప్రత్యేకమైన పుస్తకాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. దీనిని 1981లో మొదటిసారి ప్రచురించారు. దీనిని చిత్రాత్మక విజ్ఞానసర్వస్వం లాంటి గ్రంథంగా కొందరు పేర్కొంటారు. అయితే ఇందులోని ప్రపంచం పూర్తిగా కల్పితం. అలాగే ఇందులో ఉపయోగించిన భాష కూడా పూర్తిగా ఊహాజనితం. లేని ప్రపంచంలో, వాడని భాష ఉపయోగించి రాసిన కథను అర్థం చేసుకోవడం కష్టం. రచయిత స్వయంగా చెప్పినట్లుగా, ఈ లిపికి నిజమైన అర్థం లేదు. పాఠకుడు అర్థం చేసుకోలేని ఒక విచిత్ర అనుభూతిని కలిగించడమే రచయిత లక్ష్యం. కాగా, పుస్తకంలోని ప్రధాన ఆకర్షణ చిత్రాలు. ఈ చిత్రాలు ప్రకృతి, జంతువులు, మొక్కలు, మనుషుల జీవితం వంటి అంశాలను పూర్తిగా వింతగా, కలల ప్రపంచంలా చూపిస్తాయి. ఉదాహరణకు కుర్చీ ఆకారంలో పెరిగే మొక్కలు, రక్తం కారే పండ్లు, అర్థం కాని యంత్రాలు వంటి విచిత్ర దృశ్యాలు కనిపిస్తాయి. ఇవి వాస్తవ ప్రపంచాన్ని వ్యంగ్యంగా, కల్పనాత్మకంగా ప్రతిబింబించే ప్రయత్నంగా కనిపిస్తాయి. మొత్తానికి ఈ గ్రంథం సాహిత్యం, కళ, తత్వం కలగలిసిన ఒక ప్రత్యేక అనుభవం. కొందరికి ఇది అర్థం కాని గూఢ గ్రంథంలా అనిపించవచ్చు. మరికొందరికి ఇది అపారమైన కల్పనాశక్తికి నిదర్శనంగా గోచరించవచ్చు.



## చదవాల్సిన పుస్తకం

### మనిషి తొలి అడుగులు గుర్తుచేసే 'తొలి మానవులు'



ప్రముఖ మానవ శాస్త్రవేత్త ఇర్వింగ్ గోల్డ్‌మన్, రచయిత్రి హన్నా స్టైర్న్ గోల్డ్‌మన్ కలిసి రచించిన 'ఫస్ట్ మెన్: ది స్టోరీ ఆఫ్ హ్యూమన్ బిగినింగ్స్'ను వేమరాజు భానుమూర్తి తెలుగులోకి అనువదించారు. మానవ పరిణామం గురించి సాధారణ పాఠకులకు పరిచయం చేసే ఒక ప్రముఖ గ్రంథంగా దీనికి గుర్తింపు లభించింది. మొదట 1955లో ప్రచురితమైన ఈ పుస్తకం మానవ నాగరికత ప్రారంభ దశలను సులభంగా అర్థం చేసుకునే విధంగా వివరించే ప్రయత్నం చేస్తుంది. ఈ పుస్తకంలో ప్రధానంగా మానవ జాతి ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. ఏప్ మాన్‌గా పేర్కొనే ప్రాచీన మానవ పూర్వీకుల నుండి ఆధునిక మనుషుల వరకు జరిగిన పరిణామ ప్రక్రియను రచయితలు వివరించారు. రాతి యుగం, వేటగాళ్ల జీవనం, మొదటి సాధనాల తయారీ, సమూహ జీవనం వంటి అంశాలను ఈ పుస్తకం చర్చిస్తుంది. మానవుడు ప్రకృతి మధ్య ఎలా జీవించాడో, అతని ఆలోచన విధానం ఎలా అభివృద్ధి చెందిందో కూడా ఇందులో పేర్కొన్నారు. ఒక గొప్ప సిద్ధాంతాన్ని చాలా సరళంగా, అందరికీ అర్థమయ్యే రీతిలో చెప్పడమే ఈ పుస్తకానికి ప్రత్యేకతను సంపాదించి పెట్టింది. మానవ శాస్త్రం, పురావస్తు శాస్త్రం వంటి క్లిష్టమైన అంశాలను రచయితలు సాధారణ పాఠకుడికి అర్థమయ్యేలా వివరించారు. అందువల్ల ఇది విద్యార్థులు, యువ పాఠకులు, సాధారణంగా చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి ఒక మంచి పరిచయ పుస్తకంగా దీనిని చాలా మంది అభివర్ణిస్తారు. పుస్తకంలోని వివరణలు కథల మాదిరిగా ఉంటాయి కాబట్టి చదవడం సులభంగా అనిపిస్తుంది. ఈ పుస్తకంలో ప్రాచీన మనుషుల జీవన విధానం కూడా స్పష్టంగా చూపించారు. వారు వేటాడడం, అగ్ని ఉపయోగించడం, సాధనాలు తయారు చేయడం వంటి నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకున్నారో వర్ణించారు. అలాగే మొదటి మానవ సమాజాల ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులను కూడా చర్చించారు. మానవ నాగరికత ఆరంభ దశలో ఎదుర్కొన్న కష్టాలు, ప్రకృతితో జరిగిన పోరాటం వంటి అంశాలు కూడా ఇందులో కనిపిస్తాయి. పుస్తకం శాస్త్రీయ సమాచారాన్ని మాత్రమే కాకుండా ఒక విస్తృత దృక్పథాన్ని కూడా అందిస్తుంది. మానవుడు ఒక దీర్ఘకాల పరిణామ ప్రక్రియ ఫలితమని రచయితలు స్పష్టం చేస్తారు. చిన్న చిన్న మార్పులు, అనుభవాలు కలిసి మానవ నాగరికతను ఎలా నిర్మించాయో వారు చూపిస్తారు. ఈ దృక్పథం పాఠకుడికి మానవ చరిత్రను విస్తృతంగా అర్థం చేసుకునే అవకాశం ఇస్తుంది. సాహిత్య పరంగా చూస్తే ఈ పుస్తకం ఒక విద్యాత్మక గ్రంథం అయినప్పటికీ ఆసక్తికరమైన కథన శైలితో రాయబడింది. క్లిష్టమైన శాస్త్రీయ పదజాలం ఎక్కువగా లేకపోవడం వల్ల ఇది చదవడానికి సులభంగా ఉంటుంది. అందువల్ల ఇది ప్రారంభ స్థాయి పాఠకులకు మానవ పరిణామంపై మంచి అవగాహనను కలిగిస్తుంది. మొత్తంగా చూస్తే ఇది, మానవ పరిణామం, ప్రాచీన జీవన విధానం గురించి సరళమైన కానీ సమాచారపూరితమైన గ్రంథం. మానవ చరిత్ర ఆరంభ దశలను అర్థం చేసుకోవాలనుకునే పాఠకులకు ఇది ఒక మంచి పరిచయ పుస్తకంగా నిలుస్తుంది.

**పుస్తకం పేరు**

తొలి మానవులు
రచయితలు: ఇర్వింగ్ గోల్డ్‌మన్, హన్నా స్టైర్న్ గోల్డ్‌మన్
వెల: రూ. 120
అనువాదం: వేమరాజు భానుమూర్తి

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఈవారం కవితలు

### అక్షరాల అక్షయ ప్రవాహం

అక్షరాలు పుట్టకొస్తున్నాయి –
మౌనపు గర్భంలో నిద్రించిన
ఆలోచనలకు ప్రాణం పోయ
మంటూ.

అక్షరాలు ప్రకాశిస్తున్నాయి –
అర్థాల సూర్యకాంతిగా
అజ్ఞానపు చీకటిని తరుమమంటూ.

అక్షరాలు పరుగెత్తుతున్నాయి –
కవితా నదీ ప్రవాహంలో
భావాల తీరం తాకమంటూ.

అక్షరాలు పయనిస్తున్నాయి –
కాలపు బాటలో
తరంనుంచి తరానికి వంతెనకట్ట
మంటూ.

అక్షరాలు పరిమళిస్తున్నాయి –
సాహిత్య సుగంధంగా
హృదయాల లోతులకు చేరుతా
మంటూ.

అక్షరాలు పల్లవిస్తున్నాయి –
కవిత్వ వసంతంలో
రసాల కోయిలలై ఆలపిస్తామంటూ.

అక్షరాలు పంక్తులవుతున్నాయి –
అనుభవాల శ్రేణులై
జీవితానికి అర్థం చెబుతామంటూ.

అక్షరాలు పరవశపరుస్తున్నాయి –
రచయితల మనసులను మాత్రమే
కాదు,
చదువరుల ఆత్మలను కూడా.

అక్షరాలు ప్రేమిస్తున్నాయి –
వలపులవిరితోటలో విహరిద్దామని
సాహితీలోకంలో సంసారం చేద్దా
మనీ.

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

### ఉగాది పచ్చడి పంచాంగం



పులుపు ఉప్పు వగరు
చేదు తీపి కారాలు
కొత్త కుండలో కాలం
కలగలిపిన
మమకారాలు!
ప్రకృతి పచ్చ పచ్చని
మోదుగు ఆకుల
దొప్పలలో
షడ్రుచుల ఆరోగ్య
సమ్మిళత
ఉగాది పచ్చడి సేవనం!
స్వచ్ఛమైన ఆకుపచ్చ ప్రకృతి
అందాల ఆరబోతల ఆకృతి
షట్ ఋతువుల క్రమమైన రీతి
పూ ఫలాల బహుమతి!
అలుపెరుగని జీవన
యానం
భూత దయ
శాంతి
కారుణ్యం
ఉగాది
పంచాంగ
శ్రవణం
విశ్వ మానవ
కళ్యాణం!

(పరాభవ ఉగాది సందర్భంగా)

– పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

# కడుపులోనే ఛిద్రమవుతున్న కలలు

## భ్రూణ హత్యలకు అడ్డాగా మారుతున్న నిర్మల్‌జిల్లా సరిహద్దు ప్రాంతాలు ..



**ప్రజాపక్షం/నిర్మల్ :**నిర్మల్ జిల్లాలో మానవత్వం మంట గలుస్తోంది.ప్రాణం పోయాల్సిన వైద్య వృత్తిలోని కొందరు అక్రమార్కులు కాసుల కక్కుర్తితో పసికందుల ప్రాణాలను చిదిమేస్తున్నారు.జిల్లా భౌగోళికంగా మహా రాష్ట్ర సరిహద్దులకు ఆనుకొని ఉండటం ఈ అక్రమ దం దాకు ప్రధాన వనరుగా మారింది.పొరుగు రాష్ట్రంలో లిం గ నిర్ధారణ పరీక్షలపై నిఘా అత్యంత కఠినంగా ఉండ టంతో,అక్కడి గర్భిణులు నిర్మల్,బైంసా,ఖానాపూర్ వం టి ప్రాంతాలను తమ సురక్షిత స్థావరాలుగా ఎంచుకుం టున్నారు.దీనివల్ల స్థానిక గర్భిణులే కాకుండా,ఇతర రా ష్ట్రాల వారు కూడా ఇక్కడికి భారీగా తరలివస్తుండటంతో నిర్మల్ జిల్లా ఒక ప్రమాదకరమైన మెడికల్ క్రైమ్ హబ్ గా రూపాంతరం చెందుతోంది.ఈ చీకటి వ్యాపారం కేవలం శిశువుల హత్యకి పరిమితం కాకుండా,తల్లుల ప్రాణాలతో కూడా చెలగాటం ఆడుతోంది.

ఈ అక్రమ స్కానింగ్ సెంటర్లు అధికారుల కళ్లు గప్పడా నికి అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తున్నాయి. స్కా నింగ్ రిపోర్టుల్లో ఎక్కడా నేరుగా ఆడపిల్ల అని ప్రస్తావిం చకుండా,కేవలం మైనస్() వంటి సంకేతాలను లేదా ప్రత్యేకమైన కోడ్' భాషను ఉపయోగిస్తూ సమాచారాన్ని చేరవేస్తున్నాయి.చట్టంలోని లొసుగులను వాడుకుంటూ ఎటువంటి రికార్డులు దొరకకుండా ఈ వ్యవస్థ నడు స్తోంది.అత్యంత విచారకరమైనత విషయం ఏమి టంటే,అర్హత లేని ఆర్.ఎం.పిలు,ల్యాబ్ టెక్నీషియన్లు సైతం రేడియాలజిస్టులు లేకుండానే స్కానింగ్‌లు చేయడం,ప్రమాదకరమైన పద్ధతుల్లో గర్భస్రావాలు చేయడం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది.కేవలం 15 వేల నుండి 50 వేల రూపాయల కోసం ఒక నిండు ప్రాణాన్ని తీయడాన్ని వీరు ఒక లాభదాయక వ్యాపా రంగా మార్చుకున్నారు.కొన్ని సందర్భాల్లో గర్భస్రావం వికటించి మహిళలు మరణిస్తున్నా,ఆ వార్తలు బయటకు రాకుండా గొంతు నొక్కేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఈ దందా ఇన్నాళ్లుగా నిరాటంకంగా సాగడానికి వ్యవస్థలోని లోపాలే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.

దాదాపు రెండు దశాబ్దాలుగా జిల్లాలోనే తిష్టవేసిన కొందరు అధికారుల అండదండలు ఈ అక్రమార్కులకు కొండంత అండగా నిలుస్తున్నాయి.కొత్త అధికారులు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతో,పాతవారే డిప్యుటేషన్ల పేరుతో తిరిగి రావడం వెనుక ఒక పెద్ద నెట్ వర్క్ పనిచేస్తోంది.క్షేత్రస్థాయిలో ఏ సెంటర్‌లో ఏం జరు గుతుందో తెలిసినా,అధికారుల 'మామూళ్ల' మత్తు వల్ల తనిఖీలు కేవలం నామమాత్రంగానే సాగుతు న్నాయి.మొదటి సంతానం ఆడపిల్ల అయిన వారు, రెండోసారి కూడా ఆడపిల్ల పుడితే భారం అవుతుందనే సామాజిక బలహీనతను ఈ అక్రమ సెంటర్లు సొమ్ము చేసుకుంటున్నాయి.ప్రభుత్వం తక్షణమే స్పందించి 'ఆప రేషన్ డెకాయ్' వంటి ఆకస్మిక దాడులను పునరుద్ధరిం చాలని,అలాగే సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేసి వ్యవస్థను ప్రక్షాళన చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సిబ్బంది పనితీరుపైనే గ్రామాభివృద్ధి ఆధారపడి ఉంటుంది



**ప్రజాపక్షం/చొప్పదండి:**ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లను సిబ్బందిని సర్పంచ్ బందారపు అజయ్ కుమార్ గౌడ్ సన్మానించారు. వాకి సంబంధించిన వస్తువులను అందజేసి కలిసి భోజనం చేశారు. ఈ సంధర్బంగా సర్పంచ్ బందారపు అజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామసిబ్బంది పనితీరుపైనే గ్రామ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంజయ్య, వార్డు సభ్యులు కుమార్, చంద్రయ్య, శ్యామల, శైలజ, సిబ్బంది, పోచయ్య, రాజు, సదానందం, కర్ణాకర్, సంపత్‌లు పాల్గొన్నారు.

## ఎస్‌సి,ఎస్‌టిల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/కరీంనగర్:**ఎస్‌సి,ఎస్‌టివర్గాల సంక్షేమానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పని చేయాలని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టికమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ఆదివారం ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొ నేందుకు కరీంనగర్‌కు వచ్చిన ఆయనకు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. ఇన్‌చార్జి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తిరుపతిరావు, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి విజయపాల్ రెడ్డి, ఇన్ చార్జి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దివాకర్ రావు తదితరులు బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య జిల్లాలో ఎస్‌సి,ఎస్‌టి వర్గాల సంక్షేమం, అమలు చేస్తున్న పథకాలపై అధి కారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. అధికారులు బాధ్య తాయుతంగా పనిచేస్తూ పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

## ఇసుక అక్రమ ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మల్లాపూర్:**మండలంలోని చిట్టాపూర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. కాగా పట్టు కున్న ట్రాక్టర్ లను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసులు నమోదు చేశామని ఎవరైనా అక్రమ ఇసుక రవాణా కు పాల్పడితే చర్యలు చేపట్టి కేసు నమోదు చేస్తామని అన్నారు.

## సిబిఐ మాజీ జెడి లక్ష్మీకి సన్మానం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :**ఇబ్రహీంపట్నం అక్షయ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మెట్‌పల్లి స్థానిక వై కన్వెన్షన్ హాల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవు తున్న విద్యార్థుల కోసం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన వంద మందికి ఉచిత మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి వి. లక్ష్మీ నా రాయణ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆదివారం జనసేన పార్టీ నాయ కులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎలగందుల అజయ్, బండి రమాదేవి, పర్రె సంతోష్ కుమార్,మ్యాదారపు మారుతి, భవేష్ తది తరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారంతో ఉద్యోగ అవకాశాలు కల్పించిన మహనీయుడు అంబేద్కర్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నామ స్మరణం కార్యక్రమా నికి ముఖ్య అతిధిగా గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఎరవేణి మల్లేష్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళిలు అర్పిం చారు.ఈ సందర్భంగా ఎరవేణి మల్లేశం మాట్లాడుతూ డాక్టర్ బాబాసా హెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు అపారమైనవని దేశంలోని బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన జీవి తాంతం పోరాటం చేశారని పేర్కొన్నారు.సామాజిక న్యాయం కోసం అం బేద్కర్ చేసిన త్యాగాలు మరవలేనివని అన్ని వర్గాల ప్రజలకి రాజ్యాధి కారంతో పాటు విద్య ఉద్యోగాలలో అవకాశాలు కల్పించడంలో ఆయన కృషి మరువలేనిదని అన్నారు.అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచ రణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎరవేణి రాహుల్,అంజయ్య , నాగుల బాలయ్య, మూట సహదేవ్, నాగుల గురవయ్య, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షులు సిరికొండ తిరుపతి, సామాజిక సేవ కార్య కర్త సాతల లక్ష్మ ణ్, వేల్పుల రాజేష్,ఎల్పుల రాము, ఉమేష్, గ్రామస్తులు అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు

### 12 మంది నిందితుల అరెస్ట్- సిపి గౌష్ ఆలం




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేం దుకు కరీంనగర్ పోలీసులు చేపట్టిన ఆప రేషన్ క్రాక్ డౌన్‌లో భాగంగా ఒక భారీ వ్యవస్థీకృత నేర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సైబర్ మోసాలకు కీలక మైన మ్యూల్ బ్యాంక్ ఖాతాలను సృష్టించి సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారితో సహా 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. ఆయన మాటల్లోనే.. కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన అనంతరం దర్యాప్తులో భాగంగా ఈ ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు అమాయక వ్యక్తుల పేరుతో, స్వయంగా వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, కరెంటు ఖాతా లను తెరిచేవారు. ఆ ఖాతాలకు సంబంధించిన పాస్‌బుక్స్, ఏటిఎం కార్డులు, సిమ్‌కార్డులను పై స్థాయి సైబర్ నేరగాళ్లకు విక్రయించేవారు. ఈ ఖాతాల ద్వారా సైబర్ మోసాలకు గురైన బాధితుల డబ్బును చేతులు మార్చడం , ఉపసంహరించుకోవడం చేసేవారని సిపి తెలిపారు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం పోలీసులు ప్రధాన నిర్వాహకుడు రాజేశ్వర్‌రెడ్డితో పాటు కరీంనగర్‌కు చెందిన మరో 11 మంది సహచరులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టు అయిన వారిలో ముదుగంఇ రాజేశ్వర్‌రెడ్డి (భగత్‌న గర్, కరీంనగర్), నందగిరి సాయివర్ధన్ (కిసాన్‌నగర్, కరీంనగర్), కాలి దాస్ కౌశిక్ (దోబివాడ, కరీంనగర్), ములంకుల రాజ్‌కుమార్ (కట్టరాం పూర్,కరీంనగర్), బండి సాయికృష్ణ (కన్నాపూర్, శంకరపట్నం), అడవెల్లి సాయికార్తీక్ (విద్యానగర్, కరీంనగర్), మీర్ జామీఉద్దీన్ (సవరన్ స్ట్రీట్,కరీంనగర్ ), మహమ్మద్ జవాద్ ఖాన్ (సవరన్ స్ట్రీట్, కరీంనగర్), సర్దార్ దల్జీత్ సింగ్ (కోతిరాంపూర్, కరీంనగర్), పల్లెర్ల అజయ్ (లక్ష్మీ పూర్, రామడుగు), నిర్మల్ల శివ (మారుతినగర్, కరీంనగర్), దిద్దీ సాయి చరణ్ (రుక్మాపూర్, చొప్పదండి)లపై కేసులు నమోదు చేశారు. ఈ ముఠా సభ్యులు కేవలం ఒక్క కేసులోనే కాకుండా కరీంనగర్ కమిషనరేట్ పరిధి లోని ఇతర కేసులలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. వీరివద్ద నుంచి కీలక పత్రాలు, బ్యాంకు కిట్లు , ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు. వీటిపై మరింత దర్యాప్తు కొనసా గుతుందని సిపి తెలిపారు. సమర్ధవంతంగా పనిచేసిన అంతరాష్ట్ర ముఠాను పట్టుకున్న కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి, ఎస్సైలు శ్రీనాథ్, పోచయ్య, సైబర్ క్రైమ్ ఎస్సై అనిల్, కానిస్టే బుల్ అనిల్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి వసీం, ఖాజాపాషా, రవి, వెంకటేష్, టూ,త్రీ టౌన్‌లకు చెందిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి, శ్రీని వాస్, శంకర్, లక్ష్మ ణ్, పోలీస్ కానిస్టేబుల్ సాయికృష్ణ, అభినవ్, సిబ్బం దిని సిపి ప్రత్యేకంగా అభినందించారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాలు, ఇతరులకు అకౌంట్లు తెరవడం, ఏటిఎం కార్డులు, సిమ్ కార్డులు అప్పగించడం చట్టరీత్యా నేరమన్నారు. తద్వారా సైబర్ నేరాలలో భాగస్వా ములు అవుతారని, కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

## తేనేటీగల దాడి వెనుక ఉన్న మర్మం అదే

### పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**బిజెపి నాయకులు ప్రజల బాగోగులు గాలికొ దిలేసి కేవలం దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం మండిపడ్డారు. ఆదివారం కరీంనగర్ అండ్ బి అతిధి గృహంలో కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. దేశ ప్రధాని నుంచి కరీంనగర్ ఎంపి, కేంద్ర మంత్రి బండి సంజయ్ వరకు రాముడు, హనుమంతుడు తప్ప మరో విషయం మాట్లాడడం లేదని విమర్శించారు. కొండగట్టు యాత్రకు వెళ్లిన బండి సంజయ్‌ను అంజన్న స్వామే అడ్డుకున్నారని, రాజకీయ లబ్ది కోసమే యాత్ర చేశారు తప్ప కొండగట్టు అభివృద్ధి కోసం ప్రజల శ్రేయస్సు కోసం కాదని ఎద్దేవా చేశారన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగడం పట్ల కొండ గట్టు అంజన్న ఆగ్రహించడం వల్లనే తేనే తీగల దాడి జరిగిందని బిజెపి నేతలు భగవంతుని ఆగ్రహానికి లోనయ్యారని దుయ్యబట్టారు. బిజెపి, ఆర్ ఎస్ఎస్ పుట్టకముందు నుంచే ప్రజలు దేవుళ్లను మొక్కుతున్నారని, ప్రజల విరాళాలలో నిర్మించిన అయోధ్య రామాలయంపై రాజకీయాలు చేసినం దుకే అయోధ్యలో మోడీని ప్రజలు ఓడంచారని గుర్తు చేశారు. యువతను బిఆర్ఎస్ డ్రగ్స్‌కు బానిసలుగా చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల డ్రగ్స్ దందాను కెటిఆర్ నడిపారన్నారు. కల్వకుంట్ల కవి తకు మరోసారి సిబిఐ నోటీసుల వెనుక కెటిఆర్, హరీష్‌రావు కుట్రలు చేశా రన్నారు. లిక్కర్ కేసులో ఇరికించింది కెటిఆర్, హరీష్‌రావులేనన్నారు. బిఆ ర్ఎస్ నేతలు కుటుంబ సభ్యుల మధ్య గొడవల పేరుతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సొంత కూతురినే కాపాడుకో లేని కెసిఆర్ రాష్ట్ర ప్రజలను ఏం కాపాడుతారని ధ్వజమెత్తారు. మూసీ పున రుజ్జీవంపై ప్రతిపక్షాలు మూర్ఖపు ఆరోపణలు చేస్తున్నారు. ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి మరోచోట మెరుగైన స్థలం, వసతులు కల్పిస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలున్నారు.

## రిటైర్డు ఉద్యోగుల గొంతుకనై శాసనసభలో పోరాడుతా



*** రిటైర్డు బెనిఫిట్స్ అందగా 60 మృతి చెందారని..వారి ఆత్మహత్యకు సిఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి* కమీషన్లు వచ్చే పనులకు డబ్బులున్నాయని.. రిటైర్టు ఉద్యోగులకు ఇచ్చేందుకు లేవా?* మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు**

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** రిటైర్డు ఉద్యోగుల గొంతు కనై శాసనసభలో వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి న్యాయం జరిగేలా కృషిచేస్తానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీ ష్‌రావు అన్నారు. ఉద్యోగులు 35 ఏండ్లు కష్టపడి పనిచేసి రిటైర్డు అయిన వారు తమ పింఛన్ బకా యిల కోసం రోడ్లమీదకు తెచ్చారన్నారు. రిటైర్డు బెనిఫిట్స్ రాక 60 మంది మృతిచెందారని, వారి చావుకు కారణం సిఎం రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తా మాడ్రన్ బస్టాండ్ వద్ద రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డు ఉద్యోగుల బకా యిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరహారా దీక్షకు మాజీ మంత్రి హరీష్‌రావు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను చిన్నచూపు చూస్తుంద న్నారు. ఎన్నికల ముందు పెండింగ్ డిఎలు ఇస్తానని ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేశారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వటానికి రేవంత్‌రెడ్డికి మనస్సు రావటం లేదన్నారు. 10వేల కోట్లు బకాయలు ఇవ్వమని రిటైర్డు ఉద్యోగులు అడిగితే నన్ను కోసిన డబ్బులు రావని అంటున్నారున్నారు. కాంగ్రెస్ సర్కార్ 96వేల కోట్ల పనులకు టెండర్లకు పిలిచి అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. మూసి అభివృద్ధి పేరిట 1.50 లక్షల కోట్లు అభివృద్ధి చేయనున్నారని, అలాగే నిరుపేదలకు చెందిన 10వేల 16 ఇండ్లు కూల్చివేసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి డబ్బులు లేక కాదని, ఉద్యోగుల పట్ల మనస్సులేక బకాయిలు చెల్లించటం లేదని విమ ర్శించారు. :కమిషన్ ఇచ్చేవారికి డబ్బులు ఇస్తున్నారని, కమిషన్ ఇవ్వ రని ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించటం లేదన్నారు. కెసిఆర్ హయాంలో రిటైర్డు అయిన ఉద్యోగులకు వెంటనే డబ్బులు చెల్లించారని. 92 వేల మంది ఉద్యోగులు కెసిఆర్ హయాంలో రిటైర్డు అయితే వెంటనే డబ్బులు చెల్లించామన్నారు. పిఆర్‌ఎస్ నివేదిక ఇంతవరకు బయటపెట్టలేద న్నారు. కాది విద్యాకమిషన్ రిపోర్టు మాత్రం త్వరగా బయటపెట్టారని, ఉపాధ్యాయులకు వేతనాలు అధికంగా ఉన్నాయని నివేదిక ఇచ్చార న్నారు. ఉపాధ్యాయులను అవమానపర్చే విధంగా విద్యకమిషన్ నివేదిక ఉందన్నారు. మల్లన్నసాగర్ నుండి మూసికి నీటినితరలించేందుకు డబ్బు లున్నాయని వేగవంతంగా పనులు జరుగుతున్నాయన్నారు. కాని రిటైర్డు అయిన ఉద్యోగులకు డబ్బులు ఇచ్చేందుకు డబ్బులు లేవా అని ప్రశ్నిం చారు. మహాలక్ష్మి డబ్బులు చెల్లిస్తామని మహిళలను మోసం చేశార న్నారు. ఉద్యోగులకు గొంతుకగా అసెంబ్లీలో పోరాటం చేసి న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగులందరిని సంఘటితం చేసి ప్రభుత్వంపై పోరాటం చేసేలా చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాన 1.51లక్షల కోట్లు ఎఫ్ఆర్‌బిఎస్ ద్వారా అప్పులు తెచ్చారని కాని ఉద్యోగులకు బకాయిలు, డిఎలు చెల్లించటం లేదన్నారు. ఈ ఏడాది 3లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని, అందులోంచి 10వేల కోట్లు రిటైర్డు ఉద్యోగుల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. రిటైర్డు ఉద్యోగులకు న్యాయం జరిగేవరకు బిఆర్‌ఎస్ పక్షాన న్యాయ పోరాటం చేస్తామని మాజీ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. ఈసమావేశంలో రిటైర్డు ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు పొన్నమలరా ములు, ప్రధానకార్యదర్శి నాగిరెడ్డి, ఆర్థిక కార్యదర్శి రాజిరెడ్డి, రాజు , చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ పద్మశాలీ సంఘం అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా గంగుల సంతోష్



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :**స్థానిక మార్కండేయ భవనంలో ఆదివారం నిర్వహిం చిన పట్టణ పద్మశాలి సంఘం అత్యవసర సమావేశంలో పలు కీలక నిర్ణ యాలు తీసుకున్నారు. గత కమిటీ మూడు సంవత్సరాల పదవీకాలం పూర్తవ డంతో ఆ కమిటీని రద్దు చేస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సంఘం కార్యకలాపాలు, మార్కండేయ మందిరం నిర్మాణ పనుల పర్యవేక్ష ణతో పాటు రాబోయే ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు నూతన అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశారు.ఈ అడ్‌హాక్ కమిటీకి చైర్మన్‌గా గంగుల సంతోష్ ను సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహా దారులుగా సాంబారి ప్రభాకర్, గుంటుక విష్ణు, కేసుల సురేందర్ నియమితు లయ్యారు.అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా జిల్లా వెంకటేశ్వర్లు, ధర్మపురి వేణుగో పాల్, గుంటుక సదాశివ్, చిలువేరి హన్మండ్లు, సంకు ఆనంద్, భీమనాథి సత్యం, మామిడాల శంకర్, సాంబారి శ్రీనివాస్, జోగ జగదీశ్వర్, పోతు సత్యనారాయణ, ఆడెపు రమణ,బోగ రాజగంగారాం,మ్యాన సతీష్,జోగ రాజగంగారాం,బండి రవి, అందె గంగాధర్, అన్నారపు వంశీ, గాజెంగి రాజన్న (మెడికల్) ఎన్నికయ్యారు.ఈ నెల 19వ తేదీన జరగనున్న ఉగాది వేడుకలను నూతన అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సంఘం మరియు మార్కండేయ మందిరం నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఇకపై ఈ కమిటీ నిర్వహించనుందని నాయకులు తెలిపారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 7వ వార్డు కౌన్సి లర్‌గా ఎన్నికైన ధర్మపురి స్వరూప వేణుగోపాల్ ను ఈ సందర్భంగా అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, వివిధ వార్డుల అధ్యక్షులు, సుమారు 150 మంది సంఘ సభ్యులు పాల్గొని తమ మద్దతు తెలుపుతూ సంతకాలు చేశారు. పట్ట ణంలోని 26 వార్డుల పద్మశాలి నాయకులు కూడా అడ్‌హాక్ కమిటీకి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు



### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర:**తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం వెంకంపల్లి గ్రామ ఉపసర్పంచ్, టిఆర్‌పి పార్టీ నాయకుడు పిట్టల కమలాకర్ ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర మండలం మధురా నగర్‌లోని ప్రజా కార్యాలయంలో కమలాకర్‌కు ఎమ్మెల్యే సత్యం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ సంక్షేమ ప థకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసు కెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ గుండవేణి లావణ్య తిరుపతి, నాయకులు దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, అంబటి రమేష్, కడారి మల్లారెడ్డి తదిత రులున్నారు.

## 9వ ప్యాకేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని మద్దిమల్ల రాయిని చెరువు 9వ ప్యాకేజీ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి పంట పొలాలకు నీరు అం దించాలని రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం చెరువు వద్ద స మావేశమైన రైతాంగానికి ప్రజా సంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కు మార్‌తో పాటు పలువురు మండల నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కాళేశ్వరాన్ని కట్టి ప్రతి మండలానికి సాగు నీరు అందిస్తా మన్న గత ప్రభుత్వం 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయలేదని, చుట్టు ప్రక్కల మండలాల్లో పంట పొలాలు సస్యసామలంగా ఉండగా, వీర్నపల్లి మండల ంలో మాత్రం బీడుపొలాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ భూమికి సంబంధించిన కారణాలు చూపుతు పనుల్లో జాప్యం చేస్తున్న అధికా రులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి రాయిని చురువు నుండి కలెక్టరేట్ వరకు పా దయాత్రతో వచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మ ండల రైతులతో పాటు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.




## గ్రామ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

### పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఉట్నూర్ :** గ్రామ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కొనియాడారు. ఆదివారం ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను ఆయన ఘనంగా సన్మానించి, వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... మున్సిపాలటీల తరహాలో మేజర్ గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్మికులకు ఏవైనా వేతన సమస్యలు ఉంటే ప్రజా ప్రతినిధుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.



## నీటి సంరక్షణపై ఎన్ఎస్ఎస్ యూనిట్ సర్వే

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** జిల్లాలోని ట్రైబల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తంతోలి గ్రామంలో నీటి సంరక్షణ, భద్రతపై ఆదివారం సర్వే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా 4వ రోజు వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వినియోగించడం, వర్షపు నీటిని సేకరించే పద్ధతులు, సురక్షితమైన తాగునీటి ప్రాముఖ్యతను గ్రామస్థులకు వివరించారు. గ్రామ ప్రజలు ఈ సర్వేలో ఉత్సాహంగా పాల్గొని జల సంరక్షణ పద్ధతులపై ఆసక్తి కనబరిచారు. ''నాట్ మీ బట్ యు'' అనే ఎన్ఎస్ఎస్ నినాదానికి అనుగుణంగా సమాజ సేవ చేయడమే లక్ష్యమని కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజేష్, జి.లక్ష్మణ్, సురేందర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినిపై ఉపాధ్యాయుడి అమానుషం

**ప్రజాపక్షం/తిర్యాణి :** తిర్యాణి మండలంలోని లింగిగూడ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అమానుషంగా దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. చిన్న కారణంతో విద్యార్థిని విచక్షణరహితంగా చితకబాదడంతో ఆమె వెన్నుపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విద్య బోధించాల్సిన ఉపాధ్యాయుడే ఇంత దారుణంగా ప్రవర్తించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. చిన్న తప్పిదం జరిగిందనే కోపంతో ఉపాధ్యాయుడు విద్యార్థినిని విచక్షణారహితంగా కొట్టినట్లు ఆరోపిస్తున్నారు. పాఠశాలల్లో శారీరక శిక్షలు పూర్తిగా నిషేధించబడ్డాయని విద్యాశాఖ గతంలోనే హెచ్చరించినప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దాడులు విద్యార్థులపై తీవ్ర మానసిక ప్రభావం చూపుతాయని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి, సదరు ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## 'దుబ్బ'గూడెంలో నీటి కటకట

**ప్రజాపక్షం/రెబ్బన :** ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం గోలేటి పరిధిలోని దుబ్బగూడెంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. మండుటెండల్లో పోచమ్మ దేవాలయం సమీపంలోని నీటి ట్యాంకులో చుక్క నీరు లేకపోవడంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు అల్లాడిపోతున్నారు. మిషన్ భగీరథ లైన్, బోరు మోటార్ సౌకర్యం ఉన్నప్పటికీ ట్యాంకు నిండకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితమే నీటి సమస్యపై ప్రజలు ధర్నా చేపట్టగా, గ్రామపంచాయతీ యంత్రాంగం త్రీఫేస్ మోటార్ స్థానంలో తక్కువ సామర్థ్యం కలిగిన సింగిల్ ఫేస్ మోటార్‌ను ఏర్పాటు చేసింది. దీనివల్ల నీటి సరఫరాలో ఎలాంటి మార్పు రాలేదని, సమస్య అలాగే కొనసాగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మిషన్ భగీరథ నీరు కూడా ట్యాంకులోకి చేరడంలేదని వారు వాపోతున్నారు. నీటి సమస్యపై భగీరథ పంపు ఆపరేటర్ లేదా పంచాయతీ ఆపరేటర్లను ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మోటార్ సమస్యను పరిష్కరించి, తాగునీరు అందించాలని దుబ్బగూడెం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అమ్మనగర్ అభివృద్ధికి కృషి చేస్తా

### మేయర్ కూరగాయల ఉమారాణి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అమ్మనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని నగర మేయర్ కూరగాయల ఉమారాణి అన్నారు. ఆదివారం అమ్మనగర్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన నగర మేయర్ ఉమారాణి రమేష్‌లను నూతన కార్పొరేటర్ ప్రమోద్, పూల్లం వైష్ణవి సుధా,బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, పంచరెడ్డి లలితచరణ్, న్యాలం మధులను అమ్మనగర్ కార్యాలయంలో శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను మేయర్‌దృష్టికి తీసుకవస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ ఉమారాణి మాట్లాడుతూ అమ్మనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అమ్మనగర్ అభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో అమ్మనగర్ హౌస్ హోల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యెండల కిషన్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి కిషన్, గౌరవ అధ్యక్షులు రెంజర్ల నరేష్, ఉపాధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్, కోశాధికారి మహేందర్, ఎర్రన్న, శంకర్, మధుసూదన్, ప్రవీణ్, ఈశ్వర్ పాల్గొన్నారు.



## చెరువుల పునరుజ్జీవంతో పూర్వవైభవం

### కుమార్ దీపక్, జిల్లా కలెక్టర్




**ప్రజాపక్షం/నస్పూర్ :** జిల్లాలో చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా పునరుజ్జీవ పనులు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాముని చెరువు, నస్పూర్ మండల కేంద్రంలోని చెరువుల పునరుజ్జీవ పనులకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అమృత్ 2.0 పథకం కింద ఈ పనులు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.
చెరువుల్లో నీళ్లు నిండేలా చేయడమే కాకుండా, పరిసరాలను అభివృద్ధిపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 230 మందిపై కేసులు

### రూ. 21,60,000 జరిమానా వసూలు

### నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో గడిచిన వారంలో (మార్చి 9 నుండి మార్చి 14 వరకు) నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీసు స్టేషన్ సరిహద్దులలో వాహనాలు తనిఖీ నిర్వహించడం జరిగిందని, ఇందులో మొత్తం 230 కేసులు నమోదు చేయడంతోపాటు వీరినందరినీ సంబంధిత కోర్టులలో హాజరుపరచగా, వీరికి రూ.21,60,000లు జరిమానా విధించడం జరిగిందని, ఇందులో 14 మందికి వారం రోజులపాటు జైలుశిక్ష విధించడం జరిగిందని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయిచైతన్య తెలిపారు. కావున కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ముఖ్యంగా ఈ రెండు విషయాలు గమనించాలని తెలిపారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు సక్రమంగా తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు.

## నిర్మల్‌లో సరికొత్త వినోద ప్రపంచం

### వైభవంగాద నిర్మల్ వండర్ లాండ్'' ప్రారంభం..

### ఐశ్వర్య రాజేష్ డ్యాన్స్‌తో హోరెత్తిన ప్రాంగణం..!





**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే సరికొత్త వినోద కేంద్రంగా తీర్చిదిద్దిన ''నిర్మల్ వండర్ లాండ్'' వినోద పార్కు ఆదివారం మధ్యాహ్నం కోలాహలంగా ప్రారంభమైంది. పట్టణ శివార్లలో అందర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఈ పార్కును ప్రముఖ సినీ నటి ఐశ్వర్య రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, రాజకీయ ప్రముఖుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. పార్కు ప్రారంభమైన తొలిరోజే సందర్శకులతో కిక్కిరిసిపోవడంతోపండుగ వాతావరణం సంతరించుకుంది..

**రాజకీయ హేమాహేమీల సందడి..**

ఈ వేడుకలో రాజకీయంగా భిన్న ధృవాలుగా ఉండే నాయకులు ఒకే వేదికపై కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బిజెపి శాసనసభాపక్ష(బిజెఎల్పీ)నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తమ ఉత్సాహపూరిత ప్రసంగాలతో నిర్వాహకులను అభినందించారు. నిర్మల్ లాంటి ఎదుగుతున్న పట్టణానికి ఇలాంటి భారీ వినోద పార్కుల అవసరం ఉందని వారు పేర్కొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీహరిరావు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్చార్జ్ , మాజీ జెడ్పీ చైర్మన్ విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి పాల్గొని,పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇలాంటి మరిన్ని సంస్థలు రావాలని ఆకాంక్షించారు.

**అభిమానుల గుండెల్లో ఐశ్వర్య రాజేష్..**

ముఖ్య అతిథిగా వచ్చిన ఐశ్వర్య రాజేష్‌ను చూసేందుకు నిర్మల్ పట్టణంతో పాటు సోన్,బైంసా, దిల్వార్‌పూర్ వంటి మండలాల నుండి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. వేదికపై ఆమె మాట్లాడుతూ.. తాను నటిస్తున్న 'సంక్రాంతికి వస్తున్నం' చిత్రం గురించి ప్రస్తావిస్తూనే నిర్మల్ ప్రజల ఆప్యాయత తనను ఆశ్చర్యపరిచిందని అన్నారు. అభిమానుల కోరిక మేరకు స్టేజ్‌పైకి వచ్చిన మహిళలు, చిన్నారులతో కలిసి ఆమె ''గోదారి గట్టు మీద రామ చిలుకావే...'' అనే పాటకు గ్రేస్‌ఫుల్ స్టెప్పులేశారు.
ఆమె డ్యాన్స్ చేస్తున్నంత సేపు ప్రాంగణం కేకలు, ఈలలతో మారుమోగిపోయింది. అభిమానులతో సెల్ఫీలు దిగేందుకు ఆమె ఎంతో ఓపికగా సహకరించారు.

**అధునాతన హంగులు..అద్భుత రైడ్లు**

నిర్మల్ వండర్ లాండ్ మేనేజ్మెంట్ ప్రతినిధులు డాక్టర్ ప్రమోద్ రెడ్డి, నూకాల గురు ప్రసాద్, గంగిశెట్టి ప్రవీణ్, మార్కెటింగ్ మేనేజర్ కత్తి కిరణ్ పార్కు ప్రత్యేకతలను వివరించారు. పిల్లల కోసం వాటర్ గేమ్స్, అడ్వెంచర్ రైడ్లు,ఫ్యామిలీ ఎంజాయ్‌మెంట్ కోసం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం వినోదమే కాకుండా, పట్టణ యువతకు ఉపాధి కల్పించే దిశగా కూడా తాము అడుగులు వేశామని వారు పేర్కొన్నారు. ఈ భారీ ప్రారంభోత్సవ వేడుకతో నిర్మల్ పట్టణానికి కొత్త కళ వచ్చింది. స్థానిక నాయకులు,వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## సర్పంచ్ భర్తపై దాడి

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామంలో భూ వివాద విషయంలో ఆదివారం రుస్తుంపేట్ సర్పంచ్ వర్ష భర్త సుదీప్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వ్యక్తులు దాడి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి గ్రామంలోని సుదీప్ కలుగజేసుకోని కొందరు వ్యక్తులు అతడిపై గడ్డపారతో దాడిచేశారు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు చికిత్స నిమిత్తం నారాయణ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రంజిత్ రెడ్డి, గ్రామానికి వెళ్లి వివాదం జరిగిన సంఘటనపై ఇరువర్గాల వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఇరువర్గాల వారు తమకు ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తానని ఆయన అన్నారు.



## మెరుగైన వైద్యసేవలు అభినందనీయం

### బైంసాలో ఆదిత్య హాస్పిటల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రామారావు పటేల్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలో ఆదిత్య హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైంసా ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి ఆధునిక వైద్యసదుపాయాలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు దగ్గరలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ కాశీనాథ్ మాట్లాడుతూ ఆదిత్య హాస్పిటల్ ద్వారా సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బైంసా మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు వార్డు కౌన్సిలర్లు స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యులు, ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

### మాజీ జడ్పీటిసి పబ్బుమహేశ్‌గుప్తా

**ప్రజాపక్షం/శివ్వంపేట :** బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని తాజా మాజీ జడ్పీటీసీ పబ్బుమహేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోతులబొగుడ గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుమ్మరి సాయి కుటుంబానికి, రూ. 10వేలు, కొల్చెల్మె పోచయ్య మృతిచెందగా వారి కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసహాయం అందజేసి వారికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, పత్రాల పెంటాగౌడ్, పత్రాల ప్రశాంత్‌గౌడ్, కుశం, పందుల వెంకటేష్, గద్దె బాబు, చాకలి రవి, పత్రాల స్వామి, మెట్టు బాబు, రాకేష్, చాపల రాజు, వినయ్, అకాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఎడపల్లిలో అకాల వర్షం



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణంలో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒక్కసారిగా గాలివానతో కూడిన భారీ వర్షం కురవడంతో జనం పరుగులు తీశారు. ఆదివారం ఉదయం ఎండ వేడిగా ఉండగా, సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మేఘావృత్తమై మండలంలోని ఆయా గ్రామాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.
అకాల వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఓ వైపు సూర్యుడు సుర్రుమంటున్న సమయంలోనే మరోవైపు వరుణుడు జోరువాన కురిపించడంతో విచిత్ర వాతావరణంతో ఎడపల్లి మండలవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణలో రాబోయే మూడు రోజులపాటు అకాల వర్షాల కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.
రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో ఓమస్తారు వర్షాలు పడతాయని వెల్లడించింది. అకాల వర్షాల ప్రభావంతో ఉష్ణోగ్రతలో భారీ హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎడపల్లి మండల అధికారులు సూచిస్తున్నారు.

## బాధితులకు ఎల్ఓసి అందజేత



**ప్రజాపక్షం/-నిజామాబాద్ :** లబ్ధిదారులకు 7 లక్షల 20 వేల 3 ఎల్ఓసీలను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేసినట్లు తెలిపారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన గుండెబోయి శ్రీకాంత్ కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చు కోసం రూ. 2 లక్షల ఎల్ఓసీ, బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ పాషా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స కోసం రూ. 2లక్షల 80 వేలు, కిడ్నీ డోనర్‌గా ఉన్న మహ్మద్ ఖాజాకు వైద్య ఖర్చుల కోసం రూ.2లక్షల 40 వేల ఎల్ఓసీలను హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా చికిత్స కోసం ఎల్ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేములకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇఒ ది ఆడిందే ఆట.. పాడిందే పాట!

### జిల్లా అంతటా ఏకఛత్రాధిపత్యం



**ప్రజాపక్షం/నిర్మల్/దిలావర్‌పూర్ :** నిర్మల్ జిల్లా దేవాదాయ శాఖలో ప్రస్తుతం ఒకే అధికారి ఆధిపత్యం చెలాయిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పరిపాలన పూర్తిగా గాడి తప్పింది.జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక ఆలయాలకు ఒకే కార్యనిర్వహణాధికారి (ఇఒ) బాధ్యతలు చేపట్టడం ఆ అధికారికి వరంగా మారితే,ఆలయాలకు, భక్తులకు మాత్రం శాపంగా మారింది.

**ఏకచక్రాధిపత్యం.. ప్రశ్నిస్తే బెదిరింపులు..!**

తన గుప్పిట్లోకి వ్యవస్థను తీసుకున్న సదరు అధికారి, ఆడింది ఆట.. పాడింది పాటగా పరిపాలన సాగిస్తూ, నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఇఒ వైఖరి పరాకాష్టకు చేరింది. ఆలయ అభివృద్ధి లేదా నిర్వహణపై పాలకమండలి సభ్యులు ఎవరైనా ప్రశ్నిస్తే, తన అధికార బలంతో బెదిరింపులకు దిగుతూ నోరు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని సభ్యులు అగ్గిమీదగుగ్గిలమవుతున్నారు.''జిల్లా మొత్తానికి నేనే అధికారిని, నన్నెవరూ ఏమీ చేయలేరు'' అన్న అహంకారంతో ఆయన వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**మృత్యుకుహరంగా గోశాల.. 70 నుండి 50కి పడిపోయిన గోసంపద..!**

ఈ నిర్లక్ష్యం మూగజీవాల పాలిట మృత్యుపాశంగా మారింది. కాల్వ గోశాలలో ఒకప్పుడు 70 ఆవులు ఉండగా, నేడు ఆ సంఖ్య 50కి చేరుకోవడం అక్కడి దుస్థితికి అద్ధం పడుతోంది. సరైన సంరక్షణ, మేత, నీరు లేక ఇప్పటికే 10 నుండి 11 ఆవులు మృత్యువాత పడ్డాయి. తాజాగా నేడు కూడా ఒక ఆవు మరణించినా ఈఓలో చలనం లేదు. గోశాల అభివృద్ధి గురించి అడిగితే'' నా దగ్గర నిధులు లేవు.. నేనేమీ చేయలేను'' అంటూ మొండిగా సమాధానం ఇస్తూ, పనులను అడుగడుగునా అడ్డుకుంటున్నారు. గోవుల వరుస మరణాలకు ప్రత్యక్షంగా ఇఒ బాధ్యతారాహిత్యమే కారణమని భక్తులు మండిపడుతున్నారు.

**అదృశ్య ఇఒ లోకేషన్ల మాయాజాలం...!**

వారానికి ఒక్క రోజైనా ఆలయానికి రాని ఈ 'అదృశ్య' ఇఒ తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఫోన్ చేసిన ప్రతిసారి ఒక్కో వ్యక్తికి ఒక్కో రకమైన సమాచారం ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఒకరికి ఆలయంలో ఉన్నానని, మరొకరికి నిర్మల్‌లో ఉన్నానని, ఇంకొకరికి కమిషనర్ ఆఫీసులో ఉన్నానని చెబుతూ 'లోకేషన్ల డ్రామా' ఆడుతున్నారు. గత పది రోజులుగా ఆఫీసు మొహం చూడని ఇఒ, బడ్జెట్ వివరాలు, ఖర్చుల పద్దులను అడిగితే దాటివేస్తూ కాలయాపన చేస్తున్నారు.

**బాధ్యతల నుండి పరావ్.. బదిలీ సాకులు!**

తనపై అదనపు భారం పడుతోందని,వీలైతే తనను బదిలీ చేయించుకోవాలని చూస్తున్నానని సాకులు చెబుతూ ఆలయ బాధ్యతలను గాలికి వదిలేశారు. పనిచేయడం చేతకాకపోతే తప్పుకోవాలి కానీ, గోవుల ప్రాణాలు తీస్తూ అభివృద్ధిని అడ్డుకునే హక్కు ఎవరిచ్చారని పాలకవర్గ సభ్యులు ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్న ఇఒపై తక్షణమే విచారణ జరిపి, జల్లాకు పూర్తి స్థాయి స్వతంత్ర అధికారిని నియమించాలని భక్తులు, పాలకమండలి డిమాండ్ చేస్తున్నారు.

**ఆలయ అభివృద్ధిపై అధికారుల నిర్లక్ష్యం : చైర్మన్ మహేందర్ ఆగ్రహం**

కాల్వ శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ ఆభివృద్ధిని అధికారులు గాలికి వదిలేశారని టెంపుల్ చైర్మన్ మహేందర్ మండిపడ్డారు. అదివారం ప్రజాపక్షంతో మాట్లాడుతూ గోశాలను గాలికి వదిలేశారని, అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిధుల కొరత, ఆలయ మరమ్మతులకు బడ్జెట్ లేదని అధికారులు సాకులు చెబుతున్నారు. సమన్వయ లోపం, పాలకమండలి నిర్ణయాలకు ఎండోమెంట్ అధికారులు సహకరించడం లేదు. సిబ్బంది కొరత వల్ల భక్తులకు కనీస సౌకర్యాలు అందడం లేదు. ఆలయ ఆదాయంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని,తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## దారికి అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్

### తొలగించాలని గ్రామస్తుల డిమాండ్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్/రెబ్బెన :** ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడ నుండి కొమ్ముగూడకు వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రహదారికి అడ్డంగా ఉండటమే కాకుండా చాలా తక్కువ ఎత్తులో ఉండటంతో అటుగా వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండా నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటం వల్ల పశువులకు కూడా ప్రాణాపాయం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోయాక గానీ అధికారులు స్పందించరా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# భారత్ రన్నరప్

**ఫైనల్లో ఇంగ్లాండ్ చేతిలో ఓటమి**
**ముగిసిన వరల్డ్ కప్ హాకీ టోర్నమెంట్**
**నవనీత్ కౌర్‌కు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్**

ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ ఆసాంతం అపజయమెరుగని ఆటతో అదరగొట్టిన భారత మహిళల జట్టు ఫైనల్‌లో తడబడింది. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తుది పోరులో భారత్.. 0–2తో ఇంగ్లాండ్ చేతిలో అపజయం పాలై రన్నరప్‌తో సరిపెట్టుకుంది. లీగ్‌తో పాటు కీలక నాకౌట్ దశలోనూ సత్తాచాటిన భారత అమ్మాయిలు.. కీలక ఫైనల్ పోరులో మాత్రం ప్రపంచ ఆరో ర్యాంకు జట్టైన ఇంగ్లాండ్ ఆట ముందు తేలిపోయి రజతంతో సంతృప్తి పడ్డారు. ఇంగ్లాండ్ తరఫున తొలి క్వార్టర్లోనే గ్రేస్ బల్సన్ (1–3వ నిమిషంలో) గోల్ కొట్టగా మూడో క్వార్టర్లో నీల్ ఎలిజిబెత్ (4–3వ నిమిషంలో) రెండో గోల్ సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ భారత జట్టుకు నాలుగుసార్లు పెనాల్టీ కార్నర్ల ద్వారా గోల్ కొట్టే అవకాశమొచ్చినా మన అమ్మాయిలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు.మరోమ్యాచ్‌లో స్కాట్లాండ్.. 1–0తో ఇటలీని చిత్తుచేసి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఈఏడాది ఆగస్టు 15 తేదీనుంచి 30 మధ్య బెల్జియం, నెదర్లాండ్స్ ఆతిథ్యమివ్వనున్న హాకీ ప్రపంచకప్‌కు ఈ టోర్నీలో టాప్3లో నిలిచిన జట్లు (ఇంగ్లాండ్, భారత్, స్కాట్లాండ్) అర్హత సాధించాయి. టోర్నీలో ఇప్పటికే ప్రపంచకప్ బెర్తు ఖరారు చేసుకున్న భారత్.. టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగింది. కానీ ఫైనల్లో మాత్రం పటిష్ట ఇంగ్లాండ్ సమష్టి ఆట ముందు భారత్ తేలిపోయింది. రెండో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ అవకాశం దక్కినా నవనీత్ కౌర్ దానిని గోల్‌గా మలుచలేకపోయింది. తొలి క్వార్టర్ ముగింపు దశకు చేరుకుంటున్న సమయంలో దక్కిన పిసిని ఇంగ్లాండ్ వినియోగించుకుని గోల్ చేసింది. ఆట అర్ధ భాగం ముగిసేసరికే 1–0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లాండ్.. భారత ఎదురుదాడిని నిలువరిస్తూనే 43 వ నిమిషంలో రెండో గోల్‌తో ఆధిక్యాన్ని 2–0కు పెంచుకుంది. దీంతో ఆఖరి క్వార్టర్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. టోర్నీలో నాలుగు గోల్స్ చేసిన నవనీత్ కౌర్‌కు బెస్ట్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్ అవార్డు లభించింది.



## ఏ దేశం ఐసిసి కంటే పెద్దది కాదు



పొట్టి ప్రపంచకప్ ఆరంభానికి ముందు నెలకొన్న నాటకీయ పరిణామాలపై ఎట్టకేలకు అంతర్జాతీయ క్రికెట్ మండలి అధ్యక్షుడు జైషా నోరు మెదిపాడు. మెగాటోర్నీకి కొన్ని రోజుల ముందు ఏర్పడిన అనిశ్చితి వాతావరణంపై స్పందించిన షా.. ఐసిసి కంటే ఏ దేశం పెద్దది కాదని పేర్కొన్నాడు. తాజాగా బిసిసిఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బంగ్లాదేశ్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డులకు పరోక్షంగా కౌంటర్ ఇచ్చాడు. పదో సీజన్ టి20 వరల్ కప్ ప్రారంభానికి ముందు.. భారత్‌లో ఆడబోమని బంగ్లాదేశ్, టీమిండియాతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తామని పాకిస్థాన్ బోర్డు బెట్టు చేసిన విషయం తెలిసిందే. ఇరుదేశాల బెదిరింపులకు ఏమాత్రం లొంగని ఐసిసి చైర్మన్ జై షా.. తెలివిగా అనిశ్చితికి తెరదించాడు. అభిమానుల్లో ఉత్కంఠ రేపిన ఈ వ్యవహారంపై బిసిసిఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో షా మాట్లాడాడు. 'ఈ పొట్టి ప్రపంచకప్ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే టోర్నీ ఆరంభానికి ముందు చాలా గందరగోళం నడిచింది. వరల్డ్‌కప్‌లో కొన్నిజట్లు పాల్గొంటాయా? లేదా? ప్రపంచకప్ సాఫీగా జరుగుతుందా? వంటి ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. కానీ, ఐసిసి చైర్మన్‌గా నేనొకటే చెబుతాను. ఏ దేశం కూడా ఐసిసికంటే పెద్దది కాదు. అలాఅనీ ఒక జట్టుతోనే ఐసిసి పరిపూర్ణం కాదు. అన్ని జట్లు కలిస్తేనే ఐసిసి' అని జై షా పేర్కొన్నాడు. ప్రపంచకప్లో చిన్నజట్ల సంచలన ప్రదర్శనలు, మెగా టోర్నీలో రికార్డు వీక్షణలపై కూడా ఐసిసి చైర్మన్ స్పందించాడు. 'ఈ ప్రపంచకప్ గత వీక్షణల రికార్డులను బ్రేక్ చేసింది. ఏకంగా.. 70.2 లక్షల మందికి పైగా లైవ్‌లో చూశారు. చిన్న జట్టైన యుఎస్ఎ తొలి మ్యాచ్‌లోనే భారత్‌కు గట్టి పోటీనిచ్చింది. పాకిస్థాన్‌ను నెదర్లాండ్స్ వణికించింది. జింబాబ్వే సంచలన ఆటతో పెద్దజట్లైన శ్రీలంక, ఆస్ట్రేలియాను ఓడించింది. నేపాల్ అసమాన పోరాటంతో ఇంగ్లాండ్‌ను ఓడించినంత పని చేసిందని షా పేర్కొన్నాడు.

## వరల్డ్‌నంబర్–1 జైత్రయాత్రకు బ్రేక్
## ఫైనల్లో మెద్వెదేవ్



పురుషుల టెన్నిస్‌లో వరల్డ్ నంబర్–1 కార్లోస్ అల్కరాస్‌కు ఊహించని ఓటమి ఎదురైంది. ఈ ఏడాది వరుస విజయాలతో దూసుకెళ్తున్న అల్కరాస్‌కు రష్యా ఆటగాడు డానిల్ మెద్వెదేవ్ చెక్ పెట్టాడు. ఏకంగా 16 విక్టరీలతో ఇండియన్ వెల్స్ ఫైనల్‌పై కన్నేసిన స్పెయిన్ స్టార్‌ను మెద్వెదేవ్ ఇంటికి పంపాడు. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో సంచలన ఆటతో చెలరేగి 6–3, 7–6 (7/3)తో అల్కరాస్‌ను ఓడించాడు. ఇండియన్ వెల్స్‌లో వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాస్‌కు చుక్కెదురైంది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుగా ఓడించి సెమీఫైనల్ చేరిన అతడు ముందంజ వేయలేకపోయాడు. రష్యా స్టార్ డానిల్ మెద్వెదేవ్ ధాటికి అల్కరాస్ తలవంచక తప్పలేదు. ఆదివారం జరిగిన సెమీస్‌లో తొలి సెట్‌ను 6–3తో అలవోకగా గెలిచిన మెద్వెదేవ్‌కు రెండో సెట్‌లో గట్టి పోటీనిచ్చాడీ టాప్ సీడ్. 7–6తో సెట్ గెలిచి మ్యాచ్‌ను మూడో సెట్‌కు తీసుకెళ్లాడు. అయితే.. నిర్ణయాత్మక సెట్లో ద్వెదేవ్ అజేయంగా దూసుకెళ్తున్న అల్కారస్‌ను ఓడించాడు. మ్యాచ్ అనంతరం రష్యా ఆటగాడు మాట్లాడుతూ 'వరల్డ్ నంబర్ 1 ను ఓడించాలంటే అతడితో సమానంగా ఆడాలి. ఈరోజు నేను అదే చేశాను' అని అన్నాడు. 'కార్లోస్ అద్భుతమైన ఆటగాడు. అలాంటి ప్లేయర్‌ను ఓడించాలంటే అత్యద్భుతంగా ఆడాలి. నేను అదే చేశాను' అని మెద్వెదేవ్ చెప్పగా.. గొప్పగా ఆడినందుకే అతడు గెలిచాడని అల్కరాస్ అన్నాడు. టైటిల్ కోసం జన్నిక్ సిన్నర్‌తో మెద్వెదేవ్ తలపడనున్నాడు.

# ఆరోగ్యం
# వేసవిలో...

### ఇంటి వాతావరణాన్ని చల్లగా ఉంచుకోండి..

వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఇంటి అంతర్గత వాతావరణం కూడా సమానంగా ముఖ్యమైనది. పగటిపూట సూర్యకాంతి నేరుగా ఇంట్లోకి ప్రవేశిస్తే గది ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతుంది. అందుకే పగటిపూట కిటికీలు, తెరలు మూసి ఉంచడం ద్వారా వేడి ప్రవేశాన్ని తగ్గించాలి. రాత్రిపూట మాత్రం కిటికీలు తెరిచి చల్లని గాలి లోపలికి వచ్చేలా చేయడం ఉత్తమం. సరైన గాలి ప్రసరణ శరీరానికి సహజ శీతలీకరణను అందిస్తుంది. ఫ్యాన్లు, తడి గుడ్డలు, తరచుగా చల్లటి నీటితో స్నానం చేయడం వంటి సాధారణ చర్యలు కూడా శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి. తక్కువ ఖర్చుతో ఇంట్లోనే చల్లదనం పొందేందుకు ఫ్యాన్ ముందు మంచు లేదా గడ్డకట్టిన నీటి సీసాలను ఉంచడం ద్వారా తాత్కాలిక ఎయిర్ కూలర్ ప్రభావాన్ని పొందవచ్చు. సాధ్యమైనంతవరకు ఇంటి దిగువ అంతస్తుల్లో ఉండటం మంచిది, ఎందుకంటే పై అంతస్తులు ఎక్కువ వేడిని గ్రహిస్తాయి. ఈ విధమైన సహజ పద్ధతులు విద్యుత్ వినియోగాన్ని తగ్గించడమే కాకుండా శరీరంపై వేడి ఒత్తిడిని కూడా తగ్గిస్తాయి.



### జాగ్రత్తలు అవసరం..

వేసవి ప్రభావం అందరిపై సమానంగా ఉండదు. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు, గుండె, మూత్రపిండాలు లేదా ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారు అనారోగ్యంపాలయ్యే అవకాశాలు ఎక్కువ. కాబట్టి, వీరిని తరచుగా పరిశీలించడం అవసరం. దాహం లేకపోయినా నీరు ఇవ్వడం, అధిక వేడి సమయంలో విశ్రాంతి కల్పించడం, గది చల్లగా ఉంచడం వంటి చర్యలు కీలకం. చిన్న పిల్లలను లేదా పెంపుడు జంతువులను పార్క్ చేసిన వాహనాల్లో వదిలేయడం అత్యంత ప్రమాదకరం. కొద్ది నిమిషాల్లోనే వాహనం లోపలి ఉష్ణోగ్రత ప్రాణాంతక స్థాయికి చేరుతుంది. వేసవిలో ఆహార భద్రత కూడా ముఖ్యమైన అంశం. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆహారం త్వరగా పాడవుతుంది. బయట ఆహారం లేదా ఎక్కువసేపు నిల్వ ఉంచిన పదార్థాలు తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం ఉంది. తాజాగా తయారుచేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవడం, శుభ్రమైన నీరు తాగడం అవసరం. కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు శ్రద్ధ పెట్టడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ముందుగానే నివారించవచ్చు.

### వడదెబ్బ లక్షణాలు గుర్తించాలి

సాధారణ భాషలో వడదెబ్బగా పేర్కొనే హీట్ స్ట్రోక్ లక్షణాలను గుర్తించడం, అత్యవసర చికిత్స అందించడం తప్పనిసరి. హీట్ స్ట్రోక్ అనేది వేసవిలో అత్యంత ప్రమాదకరమైన వైద్య అత్యవసర పరిస్థితి. శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ (104 డిగ్రీల ఫారెన్‌హీటర్) కంటే ఎక్కువగా పెరగడం, తల తిరగడం, అయోమయం, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. లక్షణాలు కనిపించిన వెంటనే వ్యక్తిని చల్లని లేదా నీడ ఉన్న ప్రదేశానికి తరలించడం అత్యవసరం. శరీరంపై నీరు చల్లడం, తడి గుడ్డలు ఉంచడం లేదా తడి దుప్పటిలో చుట్టడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను త్వరగా తగ్గించాలి. వ్యక్తి స్పృహలో ఉంటే నీరు లేదా ఓఆర్ఎస్ ఇవ్వాలి. కానీ, బలవంతంగా తాగించకూడదు. అత్యవసర వైద్య సహాయం కోసం 108 లేదా 102 నంబర్లకు కాల్ చేయాలి. హీట్ స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం కీలకం. సమయానికి స్పందిస్తే ప్రాణాలను రక్షించవచ్చు.

### ఉప్పు ప్రత్యేకం..



మనిషి జీవితంలో ఉప్పుకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే, హార్మోన్లు, ఎంజైములు, ప్రోటీన్లు లాంటి అతి క్లిష్టమైన అణువులను మన శరీరం స్వయంగా తయారు చేసుకుంటుంది. కానీ ఇంత శక్తివంతమైన శరీరానికి కూడా ఒక స్పష్టమైన పరిమితి ఉందని నిరూపిస్తూ, ఉప్పు (సాల్ట్)ని మాత్రం తయారు చేసుకోలేకపోతుంది. ఉప్పు అంటే సోడియం, క్లోరైడ్ అనే మూలకాలు కలసి ఏర్పడిన పదార్థం. ఇవి ఇవి మూలకాలు కాబట్టి, వీటిని మన శరీరం లోపలే సృష్టించలేను. శరీరం కొత్త మూలకాలను పుట్టించలేదు. కేవలం ఉన్నవాటిని మాత్రమే మార్చగలదు. అందుకే సోడియం, క్లోరైడ్ మనకు ఆహారం ద్వారానే లభించాలి. సోడియం లేకుండా మన శరీరం పనిచేయదు అన్నది అతిశయోక్తి కాదు. నాడీ సంకేతాలు మెదడు నుంచి శరీరానికి వెళ్లాలంటే సోడియం అవసరం. కండరాలు కుదించుకోవడానికి, విప్పుకోవడానికి సోడియం కీలకం. శరీరంలో నీటి సమతుల్యత నిలబెట్టడానికి కూడా ఉప్పు అవసరం ఎంతైనా ఉంది. ప్రతి గుండె స్పందనలోనూ సోడియం పాత్ర ఉంది. ఆహారంలో సోడియం చాలా తక్కువగా ఉంటే, నాడీ వ్యవస్థ సరిగా పని చేయదు. కండరాల్లో బలహీనత వస్తుంది. రక్తపోటు సమస్యలు తలెత్తుతాయి. తీవ్రమైన సందర్భాల్లో ప్రాణాపాయం కూడా కలగవచ్చు. మన శరీరం ఎంత గొప్పదైనా, అది పూర్తిగా ప్రకృతిమీద ఆధారపడి ఉంటుందనడానికి ఇదో ఉదాహరణ. కొన్ని మౌలిక పదార్థాలు శరీరంలోకి బయట నుంచే అందాలి. వాటిలో ఉప్పు ఒకటి. వేసవి కాలంలో చమట రూపం లో వంటి లోని నీటితోపాటు లవణాలు కూడా బయటకు వెళతాయి. అందుకే, వేసవిలో ఎక్కువగా నీరు తాగాలని అంటారు. వేసవి కాలంలో ఎక్కువగా కనిపించే వాంతులు, విరోచనాల కారణంగా మనిషి నీరసపడిపోతాడు. ఆ సమయంలో ఒఆర్ఎస్‌ను తీసుకోవాలని వైద్యులు సూచిస్తారు. ఈ ద్రావణాన్ని ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. గోరువెచ్చటి నీటిలో కొంచం పంచదార, దాదాపు అదే మోతాదులో ఉప్పును కలిపితే, ఒఆర్ఎస్ తయారవుతుంది. హైపర్‌టెన్షన్(లోబిపి)స్థాయి తగ్గినప్పుడు ఉప్పు ఉపయోగపడుతుంది. కాబట్టే మనిషి జీవితంలో ఉప్పు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

## పేదలకు ఇండ్ల పట్టాల సాధనకు
# మార్చి 24న మహా ధర్నా

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇండ్ల పట్టాల సాధనకు మార్చి 24న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలలో నిలువ నీడ లేని పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న విషయం తెలిసిందేనని, దీనిపై పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, పేదల కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అనేక మార్లు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్ళడం జరిగిందని తెలిపారు. గత ఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అన్ని సదుపాయాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని ఆశ చూపి మభ్య పెట్టి పది సంవత్సరముల పాటు కాలయాపన చేసిందన్నారు. నిలువ నీడ లేని పేదలు సిపిఐ ఆధ్వర్యంలో ఎర్ర జెండా నీడన ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని భూదాన్ భూములలో, చేవెళ్ళ ప్రభుత్వ భూములలో, మేడ్చల్ మల్కాజిగిరి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలలోని అనేక ప్రాంతాలలోని అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, చెరువుశిఖం భూములను ఆక్రమించుకొని వేలాది మంది పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావుతో సహా వందలాది మంది సిపిఐ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం పెట్టడం జరిగిందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని మరిచి రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో పోలీసులను ఉసిగొల్పి పేదల గుడిసెలను తొలగించే ప్రయత్నం చేసిందని, ఇటీవల ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పోలీసులు, రెవెన్యూ అధికారులు బుల్డోజర్ లతో అనేక సంవత్సరాలుగా పక్కా గృహాలు నిర్మించుకుని నివసిస్తున్న ప్రజల గృహాలను నేలమట్టం చేయడం దారుణం అన్నారు. ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలను మానుకొని, రియల్ ఎస్టేట్, భూకబ్జాదారుల పాలవుతున్న ప్రభుత్వభూములను పేదలకు పంపిణీ చేయాలని, వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేస్తున్నదన్నారు. 24న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని తక్కళ్లపల్లి శ్రీనివాస రావు కోరారు.

## వేతనాల సమస్యలపై
## ఎమ్మెల్సీ సత్యంకు వినతి

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండల కేంద్రానికి చెందిన విద్యాశాఖ అటెండర్లు ఆదివారం నల్లగొండ జిల్లా మునుగోడులోని పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలిసి తమ సమస్యలను వివరించారు. నాంపల్లి మండలానికి చెందిన అటెండర్లు ఎండి జబ్బార్, జె.ఇంద్రమ్మ తదితరులు ఉద్యోగ వేతనాలకు సంబంధించిన ఆధార్ కార్డులు లింక్ కాకపోవడం, ఆన్‌లైన్ సాంకేతిక సమస్యల కారణంగా రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు నిలిచిపోవడంతో తమ కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ సత్యంకు వినతి పత్రం అందజేశారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సానుకూలంగా స్పందించారు.న సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హామీ ఇచ్చారు.




## ఎఐటియుసిలో యువ కార్మికుల చేరిక




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నిరంతరం కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జిడికె వన్ ఇంక్లైన్‌కు చెందిన యువ కార్మికులు ఎఐటియుసిలో చేరిన సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగక ముందే 1942 నుంచి కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు, సమ్మెలు చేసి హక్కులు సాధించిన చరిత్ర ఎఐటియుసికి ఉందన్నారు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సింగరేణిని చిన్న చూపు చూస్తూ బడ్జెట్ సపోర్ట్ చేయకుండా, కొత్త గనులు కేటాయించకుండా ఉన్న గనులు మూత పడే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి అమలుకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన ఆరోపించారు. సింగరేణిలో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 న గనులు, డిపార్ట్మెంట్‌లలో ధర్నాలు చేస్తామని, 18 నుంచి 30 వరకు సేవ్ సింగరేణి పేరుతో గోలేటి నుండి కొత్తగూడెం వరకు పోరు జాత నిర్వహించి హెడ్ ఆఫీస్ ముట్టడి జరుగుతుందని తెలిపారు. ఈనెల 22 న గోదావరిఖనికి పోరు జాత చేరుకుంటుందని, గోదావరి బ్రిడ్జి వద్ద జాతకు స్వాగతం పలుకుతూ మోటార్ సైకిల్ ర్యాలీతో చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సింగరేణిలో ఎసిబి విచారణ పేరుతో నిలిపి వేసిన మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని, మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వాలని, 51 వేల బకాయిలు చెల్లించాలని, డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కొత్త గనులు కేటాయించాలని, అలవెన్సులపై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించాలని తదతర డిమాండ్‌లపై సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి యాజమాన్యంకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగిలా కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, నాయిని శంకర్, ఉప్పులేటి తిరుపతి, వినయ్ కుమార్, తౌడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులకు
## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

**యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్**




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు, సిబ్బందికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ విభాగాల కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్స్ ఫెసిలిటీస్ మేనేజ్మెంట్ సర్వీసెస్ (ఐఎస్ఎఫ్ ఎంఎస్) పేరుతో మూడు సంవత్సరాల కాల వ్యవధితో టెండర్ నోటిఫికేషన్ ద్వారా వివిధ ఏజెన్సీలను ఎంపిక చేసి శానిటేషన్, భద్రత, రోగి సంరక్షణ నిర్వహణ కోసం కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు అందించే విధానం అమలవుతున్నదన్నారు. ఇది అత్యంత లోపభూయిష్టమైన పాలసీ అని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత లేని ఏజెన్సీ విధానం ద్వారా ప్రభుత్వ ధనం వృధా అవుతుందని, కార్మికుల కష్టం ఏజెన్సీల కాంట్రాక్టర్ల జేబులోకి వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ అందడం లేదని వాపోయారు. ఏజెన్సీల కాల పరిమితి ముగిసి 9 నెలల గడుస్తున్నా కొత్త టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయకుండా పాత ఏజెన్సీలకే నిర్వహణ సమయాన్ని పెంచుతూపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో కనీస వేతనం పెంచే విధంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు పి. కృష్ణ, సంతోష్ కిష్టమ్మ, గౌసియాబేగం, శ్యామల, సులోచన, భీమమ్మ, నవీన పాల్గొన్నారు.

# మద్దతు ధర ఇచ్చి రైతును ఆదుకోండి

**రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పండించిన పంటకు మద్దతు ధర, రైతు భరోసా ఇచ్చి రైతును ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని పార్టీ కార్యాలయంలో టి.సోమయ్య అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశంలో పశ్య పద్మ మాట్లాడారు. రెండు లక్షల రూపాయలపైన ఉన్న రైతులు బాకీ చెల్లిస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తమ హామీని నిలబెట్టుకొని తక్షణమే రైతు భరోసా ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పశ్య పద్మ డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి రైతుల పంటల రుణం తీర్చాలని కోరారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి దేశంలోని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని దుయ్యపట్టారు. అమెరికా లాంటి దేశాల వాణిజ్య పంటలకు ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతులకు అనుమతులు ఇస్తూ, దేశంలోని రైతులు పండించే మన పంటలను కొనుగోలు చేసే దిక్కులేకుండా నరేంద్రమోదీ పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మొక్కజొన్న పంట ఎకరానికి రూ.60 వేలు పెట్టుబడి పెట్టి పండించి తీసుకొస్తే ప్రభుత్వాలు మద్దతు ధరకు కొనుగోలు చేయక పోవడం అన్యాయ మన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రూ.2400 మద్ధతు ధరకు మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి కొనుగోలు చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. విద్యుత్ సరఫరా సబ్సిడీలు ఎత్తివేసి విద్యుత్ భారాన్ని రైతులపై మోపీ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ బిల్లును తీసుకొస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయరంగాన్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమగ్ర పంటల మద్దతు ధర చట్టం తీసుకురావాలని, సోమనాధన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, రైతుసంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు తోటపల్లి సీతారాములు, కొమ్మినేని నరసింహారావు, అడపా వెంకటేశ్వర్లు, దొండపాటి కిషన్ రావు, అడపా భాస్కర్‌రావు, తుప్పతి వెంకటేశ్వర్లు, సూరంపల్లి రమేష్, దొండపాటి సూర్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం రైతుసంఘం సభ్యత్వాన్ని పద్మ అందజేశారు.

## రబి సీజన్ ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/వరంగల్ :** రాబోయే రబి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు సన్నాహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రబి 202526 ధాన్యం సేకరణ, 202425 సీఎంఆర్ డెలివరీ, ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ల నుండి బ్యాంక్ గ్యారంటీ పత్రాల సమర్పణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. జిల్లాలో 202526 రబి సీజన్‌లో సుమారు 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు అయ్యే అవకాశముందని అంచనా ఉన్న నేపథ్యంలో, రైతులకు ఇబ్బందులు కలగకుండా సుమారు 240 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, అలాగే 202425 రబి సీఎంఆర్‌ను 100 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఖరీఫ్ 2025–26 సీఎం ఆర్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యం ఎలాంటి దుర్వినియోగం జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డీఓ రామ్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా కోఆపరేటివ్ అధికారి నీరజ, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా అధ్యక్షురాలు ప్రమాణ స్వీకారానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/వరంగల్ :** రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ఎత్తున వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సుమారు 20 బస్సులలో 50 కార్లలో సుమారు 1500 మంది కార్యకర్తలు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వరంగల్ నుండి బయలుదేరే బస్సులను జిల్లా డిసిసి అధ్యక్షుడు ఎండి అయూబ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్సర్ గుండేటి నరేంద్ర కుమార్, 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీమన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బస్వరాజు, కుమార్ స్వామి, పిసిసి సభ్యులు నల్లగొండ రమేష్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళీధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, మాజీ కార్పొరేటర్లు తత్తరి లక్ష్మ ణ్, జన్ను రవి, ధూపం సంపత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, కార్యదర్శి కుసుమ వరుణ్, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరాటే ప్రభాకర్, కోదాటి అనిల్, జున్ను శ్యామ్, రాముల బాబు, తోట హరీష్, ఆరెల్లి రవి, క్యాతం వేణు, ఎస్కే ఇమ్రాన్, ఎండి మస్తాన్, డివిజన్ అధ్యక్షులు కొమ్ము సందీప్, జన్ను వేణు, మంద సందీప్, బత్తుల వినోద్ రామ యాదగిరి, బాబు సీనియర్ నేతలు తోట బాలరాజు, సందెల దామోదర్, మార్త ఆంజనేయులు, వెల్దండి లక్ష్మ ణ్, రాచర్ల కుమార్, సుందరగిరి శ్రీనివాస్, కొమ్ము రాజకుమార్, చిరంజీవి, నటరాజ్ పాల్గొన్నారు.

## యువత ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా యువత ఉపాధి మార్గాలను ఎంచుకొని అభివృద్ధి చెందాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. భూపాలపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ తార రెస్టారెంట్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువత ఉద్యోగాలనే కాకుండా స్వయంకృషితో నచ్చిన రంగాన్ని ఎంచుకొని వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తుందని అన్ని రంగాల్లో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి యువతకు పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ రెస్టారెంట్ యజమానులు నవీన్ కుమార్ దీప్తి కుమార్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ ,మాజీ ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, స్నేహితులు, నవీన్ కుమార్ దీప్తి కుమార్ దంపతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: డిసిపి




**ప్రజాపక్షం/జనగామ :** వరంగల్ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని డిసిపి రాజ మహేంద్రనాయక్ తెలిపారు. ఆదివారం సిపిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ చెన్నకేశవులుతో కలిసి పలు చోట్ల హెచ్చరిక బోర్డులు నాటారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్స్‌గా నిర్ణయించారు. ఆ ప్రాంతాలలో వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందించేందుకు, ట్రాఫిక్ నయంత్రణ కోసం అవసరమైన ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని వలన రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని బావిస్తున్నామని, వేగ నియంత్రణ పాటించడం లేన్ డిసిప్లెన్ పాటించడం, ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు భద్రత నియమాలు తెలుసుకొని జాగ్రత్తలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు.

# వెంకటేశ్వర్లపల్లికి మూడు మండలాలు

ఎంపిడిఒ కార్యాలయం కమలాపూర్‌కు..
పోలీస్‌స్టేషన్ వెళ్లాలంటే పరకాలకు..
రెవెన్యూ,ఇజిఎస్ నడికూడ మండలానికి
ఇటూ,అటూ వెళ్లలేక నలిగిపోతున్న
వెంకటేశ్వర్లపల్లి ప్రజలు




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని నడికూడ మండల పరిధిలోని వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో మూడు మండలాల పరిపాలన జరుగుతుంది.హనుమకొండ జిల్లా ఒకటే కానీ మండలాలు మూడుగా కనిపిస్తున్నాయి.వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రజలూ..ఎంపీడీవో ఆఫీస్ కు కమలాపూర్‌వెళ్లాల్సిందే.!,పోలీస్ స్టేషన్ పరంగా పరకాలకు వెళ్లాల్సిందే.!,రెవెన్యూ,ఈజీఎస్ పరంగా నడికూడకు వెళ్లాల్సిందే.! అని వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకే మండలంలో ఉంటే అన్ని ప్రభుత్వ కార్యకలాపాలు చేసుకోవచ్చు కానీ ఈ గ్రామానికి మాత్రం అందుకు భిన్నంగా ఉందని చెప్పవచ్చు. గ్రామ ప్రజలు మండలానికి వెళ్లి పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సమస్యను విన్నవించుకుని పరిష్కారం చూసుకుంటారు అది సహజం కానీ ఈ వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రజలు మాత్రం ఇటు నడికూడమండలానికి అటూ కమలాపూర్‌మండలానికి వెళ్లాల్సిన భిన్న పరిస్థితి ఏర్పడింది.ప్రభుత్వం మా వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రజల బాధలను అర్థం చేసుకొని మాకు ప్రభుత్వ కార్యకలాపాలకు కమలాపూర్ మండలంలో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

**రెండు మండలాలకు వెళ్లలేక నలిగిపోతున్నాం...**



**:పెండ్యాల మహేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ల-పల్లి గ్రామ సర్పంచ్:** మా గ్రామ ప్రజలు రెండు మండలాల ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది.మా గ్రామ ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉంది. జిల్లా ఒకటే కానీ రెండు మండలాలకు వెళ్లాల్సి వస్తోంది.ఎంపీడీవో కార్యాలయం కమలాపూర్‌కు,పోలీస్ స్టేషన్ పరకాలకు,రెవిన్యూ,ఈజీఎస్ నడికూడ మండలానికి వెళ్లాల్సి వస్తోంది.ఈజీఎస్ సాఫ్ట్వేర్ చేయాలని,పై సమస్యల పట్ల మా గ్రామ ప్రజల ఇబ్బందుల దృష్ట్యా గ్రామపంచాయితీ పాలకవర్గం తీర్మానం చేసి గత కలెక్టర్,డిఆర్డిఓ పిడికి వినతి పత్రం అందజేశాం.రెండు మండలాల ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేక మా గ్రామ ప్రజలు నలిగిపోతున్నారు.కావున మా గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ కార్యకలాపాలు కమలాపూర్ మండలంలో ఉండాలని గ్రామ ప్రజలు కోరుతున్నారని ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలపై విముక్తి కల్పించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా.

**ప్రభుత్వం వెంటనే మా గ్రామ సమస్యను పరిష్కరించాలి..: వంగ మధుకర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామస్తుడు..**



మా వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రజలు అటు నడికూడ,ఇటు కమలాపూర్ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం.మా గ్రామ ప్రజల బాధలను అర్థం చేసుకొని ఒకటే మండలం ఉండాలని మా గ్రామానికి దగ్గరగా ఉన్న కమలాపూర్ మండలం అయితే అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది.మా గ్రామ ప్రజలు కమలాపూర్ మండలమే కోరుకుంటున్నారు.రెండు మండలాలకు వెళ్లాల్సిన బాధ నుండి విముక్తి చేయాలని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు మా గ్రామ ప్రజలకు కమలాపూర్ మండలంలో కల్పించేలా చొరవ చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని,అధికారులను కోరుతున్నాను.

## పేదలకు ఇల్లు కట్టించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.ఆదివారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్, హౌస్ బుజుర్గ్ గ్రామాలలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి,కుటుంబ సభ్యులకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని, పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధిలో వెనకడుగు వేసేది లేదు

దశలవారీగా అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు
రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో ఎలాంటి వెనకడుగు ఉండదని, ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, అదే దిశగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కూడా సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ఆదివారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 58వ డివిజన్ లోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు మరియు మురికి కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. 9వ డివిజన్ లోని కాకతీయ లైన్ ప్రాంతంలో రూ.1.30కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 10వ డివిజన్‌లో అలంకార్ జంక్షన్ ఆవరణలో రూ.29.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.2 కోట్లకు పైగా నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో జరగని అభివృద్ధి పనులను తాము రెండు సంవత్సరాల్లోనే వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటికి తక్షణ పరిష్కారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా అందుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా
# ఎర్రబెల్లి స్వర్ణ బాధ్యతలు


కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ గారు పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎర్రబెల్లి స్వర్ణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. మహిళలు రాజకీయాలు, సామాజిక రంగాల్లో మరింత చురుకుగా పాల్గొనేలా మహిళా కాంగ్రెస్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతూ మహిళల సమస్యల పరిష్కారానికి బలమైన స్వరం అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారు, అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సునీతా రావ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదవాడి సొంతింటి కల
# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పేదవాడి సొంత ఇంటి కల సహకారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే సాధ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి మండలం రాంపూర్ గ్రామంలో సుంకరి సంతోష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల అభివృద్ధి, సాధికారత కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపై నమోదు చేయడం ద్వారా వారికి ఆస్తి హక్కులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు కుటుంబం లో ఆర్థికంగా, సామాజికంగా బలపడేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాగరిక జీవన్, మండల పార్టీ నాయకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యకర జీవితమే లక్ష్యంగా వైద్య శిబిరరాలు



**ప్రజాపక్షం/జనగామ:**ఆరోగ్యకర జీవితమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వయించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం జనగామలో మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్య కార్మికులు, కార్యాలయ ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ సమన్వయంతో వైద్య శిబిరం నిర్వయించారు. ఈ శిబిరాన్ని జిలీల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరికి వైద్య పరీక్షలు నిర్వయించి అవసరం ఉన్న వారిని జిల్లా హాస్పటల్‌కు రెఫర్ చేయాలన్నారు. ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలమన్నారు. ప్రధానంగా పారిశుద్య కార్మికులు నిత్యం దుర్వాసన, దుర్గంధం మద్య గడుపుతారని, వారికి నిత్యం వైద్య పరీక్షలు నిర్వయించాల్సిన అవసరం ఉందన్నారు. జనగామను పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్రీ కాలకమైందని, వారు బాగుంటేనే జనగామ పరిశుభ్రంగా ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యులకు, మల్టీ పర్పస్ వర్కర్లకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వయించాలన్నారు. వైద్యం అనేది ప్రతి వ్యక్తికి అతి ముఖ్యమైందని, అందరు ఆరోగ్యంగా ఉండాలంటే సరియైన సమయంలో స్పందించి సరియైన పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ డి మహేశ్వర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్‌కుమార్, కౌన్సిలర్ నీరటి రజిని, డిప్యూటి డిఎంహెచ్‌ఓ ఆరోగ్య శాఖ అధికారులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పాల్గొన్నారు. జనగామ మున్సిపాల్టీలో పాటు గ్రామ పంచాయతీ కార్మికులు సైతం అందుబాటులో ఉన్న పిహెచ్‌సిలో వైద్య పరీక్షలు చేయించారు.

## పేదల పాలిట వరం సిఎం సహాయనిధి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసం నందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ ఏనుమాముల సాయి గణేష్ కాలనీ కి చెందిన కడమంచి దీక్షిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో అతనికి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5,00,000/ (ఐదు లక్షల రూపాయలు) విలువైన ఎల్ఓసీ కాపీని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ ఎల్ఓసీ ద్వారా హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాల విషయంలో అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, స్థానిక శాసనసభ్యుడిగా తన దృష్టికి వచ్చే ప్రతి అనారోగ్య సమస్యపై తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల చికిత్సలకు వెళ్లి అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో తాను అందించే ఎస్ఓసీల ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా బాధితురాలు కడమంచి దీక్షిత కుటుంబ సభ్యులు, ఆపద్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అయూబ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

టిఎస్. కలెక్టర్ దివాకర



**ప్రజాపక్షం/ములుగు:**దేశ అభివృద్ధిలో, ప్రత్యేక ప్రణాళికలు రచించడంలో, ప్రభుత్వ పథకాలను రూపొందించడంలో జనాభా లెక్కలు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయని, 2027 జనాభా లెక్కలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఆదివారం ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 2027 జనాభా లెక్కలలో భాగంగా 2026 మే 11వ తేదీ నుండి 2026 జూన్ 9వ తేదీ వరకు జరిగే ఫేజ్ 1 హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో జనాభా లెక్కలు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. ఖచ్చితమైన గణాంకాలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి తోడ్పడతాయన్నారు. జనాభా గణన ప్రాథమిక వనరు అని, హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ ప్రక్రియలో ఇంటి నిర్మాణం, నివాస పరిస్థితులు, కుటుంబ వివరాలు, మౌళిక సదుపాయాలు వంటి అంశాలను సమగ్రంగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ జిల్లా ఎన్నికల అధికారి, ఆర్‌డిఓ వెంకటేష్, హైదరాబాద్ జనగణన శాఖ గణన అధికారులు హోబాలాల్, సరళ, డిఈఓ సిద్దార్థ్ రెడ్డి, డిపిఓ వెంకయ్య, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 18న మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం /జనగామ:** జనగామలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల మెగా జాబ్ మేళా నిర్వయించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సంధ్యారాణి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా ప్రారంభం అవుతుందని, లాఖ్యూష్ ఫౌండేషన్ వారి సహకారంలో ఈ జాబ్ మేళా నిర్వయించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పిజి అర్హత కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, 5 జతల రెస్యూమ్, ఏదైనా గుర్తింపు కార్డు, అన్ని విద్యాహర్హత సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. నిరుద్యోగ గ్రామీణ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## సిపిఐ మండల కార్యదర్శికి కూనంనేని పరామర్శ



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లును ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కునంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పరామర్శించారు. ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే వెంకటేశ్వర్లుకు ప్రమాదం జరగటం పట్లవారు విచారం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరు ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సిపిఐ నాయకులు ఎల్లంకి మధు, గుడిమెట్ల సీతయ్య కంచర్ల రాఘవేంద్రరావు అనుమల అశోక్ చెరుకుమల రామకృష్ణ, షేక్ బుడెన్ పాషా పతి పాటి మహేష్, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె చాంద్ పాషా తదితరులు పరామర్శించారు.

## బొలేరో వాహనం బోల్తా.. ఒకరు మృతి, పలువురికి గాయాలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** బొలేరో వాహన బోల్తాపడి ఒకరు మృతిచెంది పలువురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం మాదారం గ్రామానికి చెందిన మొట్టం సిద్దు (19), కుంజా చరణ్, కుంజా మంగరాజు, కారం రాంబాబు, పల్లా రాము, కట్టం కార్తీక్, పాయం విష్ణు, తురం రామ్‌చరణ్, పల్లా రాజశేఖర్, గ్రామానికి చెందిన చిచ్చడి రాము అనే వ్యక్తి చెందిన బొలేరో వాహనంలో ఈనెల 12 న హైదరాబాద్ చూడటానికి వెళ్లి టైల్స్ కొని బొలేరోలే వేసుకొని తిరిగి శనివారం రాత్రి హైదరాబాద్‌నుంచి బయలు దేరి ఇంటికి వస్తుండగా ఆదివారం తెల్లవారుజామున సుమారు 5:30గంటల సమయంలో తనికెళ్ల సమీపంలోకి రాగానే డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడుపుతుండటంతో బొలేరో వాహనం బోల్తాపడింది. దీంతో దాంట్లో ప్రయాణిస్తున్న వారంతా రోడ్డుపై పడ్డారు. మొట్టం సిద్దుపై ట్రక్‌లో ఉన్న టైల్స్ మీదపడటంతో తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలో మృతిచెందాడు. మిగిలిన వారందరికి గాయాలు కావడంతో 108 లో వారందరినీ ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మొట్టం లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త గండికోట వెంకటలక్ష్మి తెలుగు బుక్ రికార్డులో చోటు దక్కించుకుంది. సనాతన ధర్మ ప్రచారం, ఆధ్యాత్మిక బోధన మరియు సామాజిక సేవా కార్యక్రమాలలో విశేష కృషి చేశారు. శ్రీ బాలా పరివారం ఆధ్వర్యంలో సౌందర్యలహరి, లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం, లక్ష్మి సహస్రనామం, తిరుప్పావై వంటి గ్రంథాల బోధనను ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా విస్తృతంగా నిర్వహించారు. దేవాలయంలో నిత్యపారాయణ కార్యక్రమాలు నిర్వహించటం అలాగే మహిళా సాధికారత మరియు పేద విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు వారి విశిష్ట ఆధ్యాత్మిక సేవలను పురస్కరించుకుని తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ఆధ్యాత్మిక విభాగంలో అధికారికంగా నమోదు చేసినట్లు తెలిపారు. గుర్తింపు పత్రం షీల్డ్ ను తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధి మధుసూదన్ రాజు అందించారు. ఈ సందర్భంగా ఆమెను మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జీ తుంబూరు దయాకర్ రెడ్డితో పాటు పలువురు అభినందించారు.

## కామ్రేడ్ పుసులూరి బుచ్చయ్య త్యాగం చిరస్మరణీయం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ పుసులూరి బుచ్చయ్య త్యాగం ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామంలో బుచ్చయ్య 15వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాముల దోపిడీ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన గొప్ప పోరాటమని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని కొనసాగించడం ప్రజల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుసులూరి నరేందర్, పుసులూరి పుల్లయ్య, పుసులూరి మంజులగిరి ప్రసాద్, బందెల వెంకయ్య, రేపాకుల శివలింగం, నాగేశ్వరరావు, హనుమంతరావు, గొడుగు విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీలో సత్తా చాటిన ఆదివాసీ

**ప్రజాపక్షం/కరకగూడెం :** ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో ఈనెల 26 నుండి 29 వరకు జరగనున్న జాతీయస్థాయి ఖేలో ఇండియా ట్రైబల్ ఆర్చరీ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి నలుగురు ట్రైబల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఆర్చరీ పోటీల్లో అశ్విత్ దొర తెలంగాణ రాష్ట్ర ప్రాతినిధ్యం వహిస్తూ, అత్యంత ప్రతిభ కనబరిచారు.జాతీయ స్థాయికి పోటీలకు అశ్విత్ దొర ఎంపికైనందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆర్చరీ అసోసియేషన్‌వారు ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా ఈ నెలలో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో రాణించి మన ప్రాంతానికి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అంగరంగ వైభవంగా గుట్ట వెంకన్న కల్యాణం

వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం

ఆలయ అభివృద్ధికి కృషి

మంత్రులు తుమ్మల, పొంగులేటి





**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ తిరుమలగా పేరు గాంచిన పాల్వంచ శ్రీనివాసకాలని గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ( వెంకన్న ) కల్యాణ మహోత్సవం అర్చకులు ఎడవల్లి హరిచార్యుల నేతృత్వంలో అంగరంగ వైభవోపేతంగా జరిగింది. ముందుగా అర్చకులు, ఆలయ భక్త సమాజ మండలి సభ్యులు, భక్తులు ఉత్సవ మూర్తులను మేళతాళాలతో కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీనివాసుడి తిరుకల్యాణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం మధ్య ఎదుర్కోలు ఉత్సవం అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛరణాల, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా సాగింది. ఆద్యంతం గోవింద నామ స్మరణతో కల్యాణ వేదిక మారుమోగింది.ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యం కోసం భారీ ఎత్తున తాటాకులతో చలువ పందిళ్ళను వేశారు. ప్రణాళికా ప్రకారం ప్రచారం చేయటంతో స్వామి కల్యాణ మహోత్సవానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు.

**మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వాగతం:**

శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవానికి హాజరైన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం గుట్టపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు.

**ఏకోటూరిజంగా అభివృద్ధికి కృషి చేస్తాం : మంత్రులు**

ప్రజల, భక్తుల సౌకర్యం కోసం శ్రీనివాసగిరి గుట్ట అభివృద్ధికి పటుపడతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అటవీశాఖతో సమన్వయం చేసుకొని ఏకోటూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. భక్తులకు అవసరమైన వసతులను కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

**దేవాలయాలు గుట్టలపైనే ఉండాలి : మంత్రి తుమ్మల**

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో ఆలయాలు గుట్టల ( ఎత్తైన ప్రదేశాలలో ) పైనే ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత 40 సంవత్సరాలుగా ఆలయానికి రావాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదన్నారు. స్వామి వారి కృపతో ఇప్పటికి నా కోరిక తీరిందని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, భక్తి భావాలను పెంచటానికి ముఖ్యపాత్ర వహిస్తాయని చెప్పారు. స్వామివారి దయతో, స్వామి వారు కోరుకుంటే ఆలయ అభివృద్ధి జరుగుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**కల్యాణ క్రతువులో పాల్గొన్న ఎంపి :**

గుట్టపై వేంచేసియున్న అత్యంత ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకన్న స్వామివారి కల్యాణ క్రతువులో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. అర్చకులు, భక్త సమాజ మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు.

**అయ్యప్ప స్వామి ఆలయం నుండి పట్టు వస్త్రాలు :** శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి పాల్వంచ పట్టణంలోని ప్రముఖ ఆలయమైన అయ్యప్పస్వామి దేవాలయం నుండి చీరె, సారె, పట్టు వస్త్రాలు, పసుపు,కుంకుమ, తలంబ్రాలు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు చేతుల మీదుగా స్వామి వారికి సమర్పించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ప్రభోదిక, అగ్ని ప్రతిష్ట, చతుస్తానార్చన, ధ్వజారోహనము, నిత్యపూర్ణాహుతి నిర్వహించి సంతానం లేని దంపతులకు అర్చకులు గరుడ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్‌పి. బిరుదురాజు రోహిత్‌రాజు, పాల్వంచ తహసీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం మునిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్లు దంతెరబోయిన నరేష్, గోవాడ గుణచరిత్, కాల్వ భాస్కర్‌రావు, కొత్వాల విమలాదేవి, పైడిపల్లి విజయలక్ష్మి, మల్లెల స్వప్నకుమారి, చెరుకు భాగ్యలక్ష్మి, బాలునాయక్, ఆలయ ట్రస్టు చైర్మన్, కో చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు, మందడపు ముక్కంటేశ్వరరావు, గౌరవ సలహాదారు వంకధారు నరసింహ కుమార్, ఆలయ ట్రస్ట్, భక్త సమాజ మండలి సభ్యులు ఊకె భద్రయ్య, ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఫణిశర్మ, తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ మర్యాదలకు భంగం :** ఆలయ మర్యాదలకు తూట్లు పొడుస్తూ బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ అత్యుత్సాహం ప్రదర్శించారు. దేవాలయ గర్భగుడిలో స్వామి విగ్రహాలను ఫోటోలు తీశారు. దీనితో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఆలయ కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగిందని మండిపడుతున్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఆలయ ట్రస్టు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

# మంత్రి ఆదేశాలిచ్చినా..అమలు శూన్యం

ప్రజా పంపిణీ వ్యవస్థపై పట్టింపులేకపోవడం సరికాదంటున్న ప్రజలు

డీలర్ ఇచ్చిన బియ్యంపై అదనపు కలెక్టర్ సైతం ఆగ్రహం

ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారా?

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ ప్రాంత ప్రజల రేషన్ కష్టాలపై 'ప్రజాపక్షం' దినపత్రిక 'సమస్యలే అక్షరాలుగా ఈ బాధలు తీరెదెన్నడో?' అనే కథనాన్ని జనవరి 9వ తేదీన ప్రచురించిన విషయం విధితమే. దీనిపై మరుసటిరోజు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సిపిఐ ఆధ్వర్యంలో రేషన్ షాపు ఏర్పాటుకు వినతి పత్రం అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపు నుంచి సరఫరా చేసిన రేషన్‌బియ్యంలో దొడ్డు బియ్యం ఇచ్చారంటూ ఫోటోలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి తక్షణమే అక్కడ ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజకు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కానీ ఈ ఘటన జరిగి నేటికి రెండు నెలలు కావొస్తుంది. అయినప్పటికీ ఇంతవరకు ఆ విషయాన్ని పట్టించుకునే వారు లేకుండా పోవడం విస్మయానికి గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాలు బుట్ట దాఖలవుతుండంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**రేషన్ బియ్యం కలిసినట్టుగా ఆరోపణలు...**

వాస్తవానికి 'ప్రజాపక్షం' దినపత్రిక రేషన్ సమస్యపై అదే రోజున సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిపై వాకబ్ చేసింది. దీంతో సదరు డీలర్ హూటాహుటీన బియ్యాన్ని ఆ రోజు రాత్రి వరకు పంపిణీ చేశాడు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇక్కడే ఓ ట్విస్ట్ ఉంది. అది ఏమిటంటే సదరు డీలర్ ఇచ్చిన స్టాక్ అయిపోయాయి,బియ్యం లేవు అయిపోయాయంటూ బియ్యానికి వచ్చిన వారికి చెప్పాడు. కానీ 'ప్రజాపక్షం' ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో బియ్యం పంపిణీ చేశాడు. అంటే అయిపోయిన బియ్యం ఎలా వచ్చాయో? విషయం అవగతం చేసుకోవాల్సిందే. ఈ సందర్భంగా బియ్యం తీసుకున్న రెండు, మూడు రోజుల వరకు చెరిగి, దుబ్బ,దూలి, రాళ్లను లబ్ధిదారులు తీసేందుకు సమయం వెచ్చించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం పడుతుంది. ఈ బియ్యం పంపిణీ చేసిన సదరు డీలర్‌పై అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మీటింగ్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కొందరు డీలర్లు గుసగుసలాడుతుండటం గమనార్హం.

**రెండు నెలలు గడిచిన బియ్యం ఉంటాయా?**

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం అనే సామెత ఇప్పుడు ఇక్కడ సరిగ్గా సరిపోయేలా కపిస్తోంది. బియ్యం పంపిణీ జరిగి రెండు నెలలు గడిచిన తర్వాత విచారణ చేస్తే బియ్యం ఉంటాయా? అనేది ఆలోచించాల్సిన అంశమే. మరి అలాంటి తరుణంలో అవి రేషన్ బియ్యం అనేది తేలే అవకాశం లేదు. అయితే ఇలా జరగడంలో పెద్ద హస్తం కలిగిన జిల్లా నాయకుడితో పాటు అక్రమాలలో అందెవేసిన చెయ్యి కావడంతో తాత్సారం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మంత్రి ఆదేశాలపై ఏం తేలుస్తారో వేచి చూడాల్సిందే. ఒక వేళ పత్రికలో తప్పిదాన్ని ప్రశ్నిస్తూ కథనం వచ్చింది కాబట్టి. మసిపూసి మారేడు కాయ చేసే విధంగా పరిశీలన చేసి దొడ్డు బియ్యం కాదని నివేదిక బహుశా ఇవ్వచ్చేమో?

## లాభదాయక పంటల వైపు రైతుల దృష్టి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులు లాభదాయక పంటలవైపు మొగ్గుచూపి లాభాలు ఆర్జించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని అంజనాపురంలో నిర్మిస్తున్న గోద్రెజ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ఆయిల్‌పామ్ మొక్కలు తీసుకొచ్చి మొదటిసారిగా నాటడం జరిగిందని అప్పటివరకు మనకు ఈ పంటలేదని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆయిల్‌పామ్ పంట విస్తరణ కోసం అనుమతులు తాను సాధించినట్లు తెలిపారు. ప్రతి ఎకరానికి రూ. 51 వేల సబ్సిడీని ప్రభుత్వం రైతులకు అందిస్తుందని అన్నారు. పంటలు మార్పిడి చేసుకోలేకపోతే రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో వరి వేయకపోతే డబ్బులు ఇస్తున్నారని, యూరియా అధికంగా వాడటంవల్ల పంజాబ్‌లో కేన్సర్ ఎక్కువ అయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మనదగ్గర కూడా యూరియా అధికంగా వాడుతున్నారని, దీనివల్ల నష్టాలు వస్తాయని తెలిపారు. మల్టీ నేషనల్ కంపెనీ గోద్రెజ్ వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టిసారించిందని ఎపిలో గతంలోనే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారని ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 22న సిద్దిపేట జిల్లాలో సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా జరిగే నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రైతులు వెళ్లాలని అక్కడ మూడురోజులపాటు వ్యవసాయ ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతురావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ప్రాజెక్ట్ డిజిఎం, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందికి సత్కారం



**ప్రజాపక్షం/ములకలపల్లి :** ములకలపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పంచాయితీ సిబ్బందికి ప్రత్యేక గౌరవం తెలిపారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ సిబ్బందికి ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్‌లను పంపిణీ చేసిన అనంతరం వారి సేవలను గుర్తిస్తూ ఎమ్మెల్యే స్వయంగా వారి కాళ్లు కడిగి ఘనంగా సత్కరించారు. ఈసందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయితీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్, అంజి, కారం సుధీర్, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సిఆర్‌పి బూమన్న మృతిపై యూనియన్ నివాళి



సమస్యలపై కూనంనేనితో భేటీ

**ప్రజాపక్షం/చంద్రుగొండ :** సిఆర్‌పి యూనియన్ తెలంగాణ పక్షాన మిత్రుడు బూమన్న మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 2012లో కలిసి ఉద్యోగంలో చేరిన సహచరుడు నేడు మన మధ్య లేకపోవడం బాధాకరమని యూనియన్ సభ్యులు తెలిపారు. సిఆర్‌పిల సమస్యల పరిష్కారం కోసం సియూటి ద్వారా ఎఐటియూసితో కలిసి పో రాటం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షు లు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పా షాను సియూటి రాష్ట్ర అధ్యక్షుడు పొద్య నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సేవ్య నాయక్ కలిసి సమస్యలపై చర్చించారు. సిఆర్‌పిల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. సంఘం బలోపేతానికి సభ్యత్వ నమోదు అవసరమని, సభ్యులు సహకరించాలని యూనియన్ నాయకులు కో రారు. అలాగే సిఆర్‌పి యూనియన్ తెలంగాణ కమిటీని ముఖ్యమంత్రితో సమావేశం చేసే దిశగా ఎఐటియూసి రాష్ట్ర కార్యవర్గం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణ పనులు

పట్టింపు లేని పంచాయతీ రాజ్ అధికారులు

ప్రజల్లో సర్వత్రా వ్యతిరేకత



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని ముత్యాలగూడెం గ్రామం నుండి సమీప తిరుమలపాలెం మండలంలోని గోపాలపురం గ్రామం వరకు 2024, 25 ఎస్డిఆర్ నిధులు రూ 3.68కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. పనుల నాణ్యత, విధివిధానాలపై అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనంను రోడ్డు నిర్మాణ పనులకు ఉపయోగిస్తారా లేక కొందరు వ్యక్తుల కోసం నాణ్యత ప్రమాణాలను పక్కనపెట్టి వారికి కమీషన్లు ఇవ్వడానికా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో సాంకేతిక ప్రమాణాలు పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డులో మొదట అడుగున 40 ఎంఎం కంకర రోలింగ్ చేసి వాటర్ క్యూరింగ్ చేయటం జీఎస్బి లెవెల్ 0.2 వచ్చే వరకు రోలింగ్ చేయడం, ఆ తర్వాత 20 ఎంఎం, 10 ఎంఎం, 6 ఎంఎం కంకర కస్ట్ మిక్స్‌డ్ వాడి రూలింగ్ చేసి ఆ తర్వాత వాటర్ క్యూరింగ్ రోలింగ్ చేసిన తర్వాత 0.25 లెవెల్ రావాల్సి ఉంది. ఆ తర్వాతనే వీటిని వాడే అవకాశాలు ఉండగా ఇవేమి పాటించకుండా డైరెక్ట్‌గా 20 ఎంఎం, 10 ఎంఎం, 6 ఎంఎం మెటల్ మిక్స్‌అప్ డస్ట్‌తో త్వరితగతిన పనులు పూర్తి చేస్తున్నారు. దీంతో రోడ్డు నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరుగుతున్న సమయంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు లేదా ఇంజనీరింగ్ సిబ్బంది పర్యవేక్షణ చాలా తక్కువగా ఉందని తెలుస్తుంది. నిర్మాణంలో ఉపయోగిస్తున్న పథార్థాల నాణ్యతను కూడా ఎవరూ పరిశీలించడం లేదని జనం ఆరోపిస్తున్నారు. ఇక ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ పనులు ప్రజల ప్రయోజనాల కోసం కాదా, లేక గుత్తేదారుల ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయా అన్న సందేహాలు ప్రజల్లో పదేపదే వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**క్వాలిటీ కంట్రోల్ పరిశీలించాలి...**

ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి క్వాలిటీ కంట్రోల్ అధికారుల ద్వారా పనులపై సమగ్ర విచారణ జరిపి, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**పంచాయతీ రాజ్ ఎఇ ప్రఫుల్ కుమార్ వివరణ....**

రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతోనే చేస్తున్నాము. గతంలో కంకర్ 40 ఎంఎంకు బదులుగా ఇప్పుడు కొంత పద్ధతి మారింది. చూసే వారికి అది 40 ఎంఎం కంకర కాదనిపించవచ్చు ఇప్పుడు అంతా మిక్స్డ్ గానే వస్తుంది. అందులో 40 ఎంఎం కూడా కలిపి ఉంది. దీని తర్వాత మళ్లీ సెకండ్ లేయర్‌లో 20 ఎంఎం, 10 ఎంఎం, 6 ఎంఎం డస్ట్ కూడా రెండో దఫాలో పోయడం జరుగుతుందని తెలిపారు.

‘ సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన సూపర్ హిట్ మూవీ ‘కపుల్ ఫ్రెండ్లీ‘ ఓటిటిలోనూ సూపర్బ్ రెస్పాన్స్ తెచ్చుకుంటుంది. ఇటీవల అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ వచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ దక్కించుకుంటోంది. ’

రీల్

# థమన్ 'కొరియన్ కనకరాజు'

## చివరి షెడ్యూల్ ప్రారంభం

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. ఇండియన్, కొరియన్ నేపథ్యాలలో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇంతకు ముందు ఎన్నడూ లేని భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.



ప్రస్తుతం షూటింగ్ చివరి షెడ్యూల్ సౌత్ కొరియాలో ప్రారంభమైంది. కీలకమైన ఒక వారం రోజుల షెడ్యూల్ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్లో పాటలు, కథలో ముఖ్యమైన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య పాల్గొనున్న ఈ షెడ్యూల్ ను కొరియాలోని అద్భుతమైన ప్రదేశాల్లో చిత్రీకరించనున్నారు.కొరియన్ కనకరాజు' టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే అద్భుతమైన స్పందనను అందుకుంది. స్టైలిష్ ప్రెజెంటేషన్, ఎంటర్టైనింగ్ టోన్తో వచ్చిన గ్లింప్స్ సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. ఆ వీడియో ఈ చిత్రంలో ఉండే హిలేరియస్ హారర్కామెడీ వరల్ ని పరిచయం చేసింది.ఈ చిత్రానికి సంగీతం ఎస్. తమన్ అందిస్తున్నారు. ఎనర్జీతో నిండిన పాటలతో పాటు ఎంటర్టైనింగ్ బ్యాక్గ్రౌండ్ స్కోర్ను సమకూరుస్తున్నారు. ఈ సినిమా కోసం చార్ట్బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేస్తున్నారు. ఇండియాలో ప్రధాన భాగం షూటింగ్ పూర్తి కాగా, ఇప్పుడు కొరియాలో జరుగుతున్న ఈ ఫైనల్ షెడ్యూల్తో చిత్రీకరణ పూర్తికానుంది.



# ‘సుయోధన’ టీజర్ విడుదల

ప్రజ్వలా లైన్ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రియదర్శి, ద్రిషిక చందర్ హీరో హీరోయిన్ గా డైలాగ్ కింగ్ సాయికుమార్, సీనియర్ హీరోయిన్ ప్రేమ కీలకపాత్రల్లో నటించిన చిత్రం ‘సుయోధన‘. వై ఎస్ మాధవ్ రెడ్డి దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతోంది. పలు హిట్ చిత్రాలను రిలీజ్ చేసిన శ్రీ లక్ష్మి పిక్చర్స్ సంస్థ ‘సుయోధన‘ సినిమాను విడుదల చేస్తోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ జై క్రిష్ మాట్లాడుతూ మూవీకి బీజీఎం చేసేప్పుడు మ్యూజిక్ డైరెక్టర్ గా సినిమా చూస్తుంటాం. ఆ క్రమంలో సాయికుమార్, ప్రియదర్శి పర్ ఫార్మెన్స్ చూసి మేమంతా హ్యాపీగా ఫీలయ్యాం. ‘సుయోధన‘ సినిమా మంచి విజయం సాధిస్తుందని నమ్మకంగా చెప్పగలను. అన్నారు.ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ మాట్లాడుతూ ప్రియదర్శి నాకు మంచి మిత్రుడు. ఆయన కెరీర్ స్టార్టింగ్ నుంచి గమనిస్తున్నాను. మంచి సినిమాలు చేస్తూ గొప్ప స్థాయికి వచ్చాడు. ఈ సినిమా ఆయనకు మరింత పేరు తెస్తుంది. అలాగే సాయి కుమార్ గారి పోలీస్ స్టోరీ సినిమా మనందరికీ ఫేవరేట్ మూవీ. సాయికుమార్ గారిలోని డైలాగ్ డెలవరీని, పర్ ఫార్మెన్స్ ను ఈ సినిమాలో ఉపయోగించుకునే అవకాశం మా డైరెక్టర్ మాధవ్ కు దక్కడం సంతోషంగా ఉంది. అన్నారు. హీరోయిన్ ద్రిషిక చందర్ మాట్లాడుతూ ఈ చిత్రంలో సంహిత అనే క్యారెక్టర్ లో నటిస్తున్నాను. ఈ క్యారెక్టర్ లో నటించే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. సాయి కుమార్, ప్రియదర్శి లాంటి మంచి ఆర్టిస్టులతో స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ మూవీ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ నెల 27న థియేటర్స్ లో మీట్ అవుదాం. అన్నారు. డైరెక్టర్ వైఎస్ మాధవ్ రెడ్డితో కలిసి పనిచేయడం మంచి ఎక్స్పీరియన్స్ ఇచ్చింది. ద్రిషిక హైదరాబాద్ అమ్మాయి. 27న సుయోధన మూవీ చూడండి. మీరు బాగా ఎంటర్ టైన్ అవుతారు అన్నారు.

# మంచి కంటెంట్ ఉన్న సినిమా ‘ఎపిక్’

మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నటిస్తూ యంగ్ హీరోల్లో తన కంటూ ఓ ప్రత్యేకత తెచ్చుకున్నారు ఆనంద్ దేవరకొండ. తనదైన తరహా చిత్రాల్లో నటిస్తున్న ఆనంద్ కు ఒక సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఆది వారం ఆయన తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. దొరసాని, మిడిల్ క్లాస్ మెలొడీస్ వంటి సినిమాలు ఆనంద్ స్క్రిప్ట్ సెలెక్షన్ కు నిదర్శనంగా నిలుస్తాయి. బేబి మూవీ ఆనంద్ కెరీర్ లో మైల్ స్టోన్ లాంటి సక్సెస్ అందించింది. వంద కోట్ల గ్రాసర్ గా కల్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచి ఆనంద్ దేవరకొండను ప్రేక్షకుల దగ్గరకు మరింతగా చేర్చింది. వేగంగా సినిమాలు చేయడం కంటే క్వాలిటీగా మూవీస్ ఎంచుకోవడానికే ఆనంద్ ప్రాధాన్యతనిస్తుంటారు. అందుకే ఆనంద్ చేసిన ప్రతి సినిమాలో ఒక వేరియేషన్, స్ట్రాంగ్ కంటెంట్ కనిపిస్తుంటుంది. పస్తుతం పలు ప్రాజెక్ట్స్ తో ఆనంద్ బిజీగా ఉన్నారు. దేవరకొండ ఆశాభావం వ్యక్తం చేశారు.



## సినిమా రంగంలో మహిళలకు

# ప్రాధాన్యత కల్పించండి

## మంత్రి పొన్నంను కోరిన నటి ఉదయ భాను



టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు ఉదయ భాను ఎన్నో ఏళ్లుగా టెలివిజన్ రంగంలో యాంకర్ గా అగ్ర స్థానంలో కొనసాగారు. యూత్ లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించారు. పెద్ద పెద్ద స్టార్ హీరోయిన్లకు ధీటుగా క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఆమె యాంకర్ గా పని చేసిన షోలన్ని రికార్డు రేటింగ్ లు సాధించాయి. తాజాగా ఉదయ భాను తెలంగాణ బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి గౌరవనీయులు పొన్నం ప్రభాకర్ ని కలిశారు. బీసి సామాజిక వర్గానికి చెందిన ఉదయ భాను తెలంగాణలో బలహీన వర్గానికి చెందిన అణగారిన మహిళల భవిష్యత్తు గురించి ప్రభాకర్ గారితో చర్చించారు. సినిమా రంగంలో, వ్యాపార రంగంలో మహిళలకు అవకాశాలు కలిపించాలని కోరారు. అంతేగాక వారికి వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విన్నపించారు

# ఆమె స్ట్రెంత్.. అతడి ప్రామిస్

లక్ష్మీ నరసింహ మోషన్ పిక్చర్స్ బ్యాన్ప జ్యోతి కుమారి, తారకేశ్వర రావు నిర్మిస్తున్న చిత్రం ఆమె స్ట్రెంత్.. అతడి ప్రామిస్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ సినిమా ఫ్రీ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. సూర్యాస్తమయం వేళ ఓ మహిళ వీల్ చైర్లో కూర్చుని ఉండగా, ఒక వైపు హీరో, మరో వైపు పెంపుడు కుక్కపిల్ల కూర్చున్న దృశ్యం ఎంతో హార్ట్ టచింగ్గా ఉంది. 'ఆమె స్ట్రెంత్, అతడి ప్రామిస్.. వారి కథ' అనే ట్యాగ్లైన్ ఈ సినిమా ఒక బలమైన భావోద్వేగపూరితమైన ప్రయాణం అని సూచిస్తోంది. ముఖ్యంగా ఇది ఒక నిజ జీవిత కథ ఆధారంగా రూపొందుతుండటం గమనార్హం. ఈ చిత్రంలో రావు రమేష్, వెటరన్ నటుడు శుభలేఖ సుధాకర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# ‘అసురసుర’ ఫస్ట్ లుక్ విడుదల



భుమిక్ ఎంటర్టైన్మెంట్ ప్రొడక్షన్ నెం. 1గా నిర్మిస్తున్న ‘అసురసుర’ చిత్ర టైటిల్ లోగో మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ను ప్రముఖ నటి ఫరియా అబ్దుల్లా విడుదల చేశారు. ఇది ఒక రస్టిక్ క్రైమ్ థ్రిల్లర్. ‘ప్రకృతే నేరానికి భాగస్వామి అయితే?‘ అనే సరికొత్త కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.రాఘవ్ నాగ్, అమిత రంగనాథ్, సంతోష్, సోనా నిషా ప్రధాన నటీనటులు తో జ్ఞాతిన్ రాఘవ్ దర్శకత్వం లో నిర్మాత: డి.వి. ప్రభాకర్ వర్మ, సహ నిర్మాతలు: శీను ఆనంద్, సినిమాటోగ్రఫీ: మనోహర్ కోలి, సంగీతం: రాజేష్ ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు.

# 22న రైతు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడి సహాయం కోసం ఎంతో కాలంగా రైతులు ఎదురు చూస్తున్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వం ఈనెల 22తేదీ నుంచి రెండవ దఫా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 22 సిద్దపేట జిల్లా నర్మేట్ట ఆయిల్ పామ్ కంపెనీ ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇదే వేదికగా రైతు భరోసా మొదటి విడుతగా ఒక ఎకరం వరకు ఉన్నమొత్తం 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్లను బదిలీ చేయనున్నారు. మొత్తం మూడు విడుతల్లో రూ. 9వేల కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది. ఇందులో భాగంగా రెండో విడత మరో 20 రోజుల తర్వాత ఏప్రిల్ రెండవ వారంలో రూ.2,650 కోట్ల నిధులను విడుదల చేయనుంది. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మిగిలిన రైతుల ఖాతాల్లో ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం సిద్దం చేసింది. ఇందుకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు అధికారులతో చర్చించి ఈ కసరత్తును పూర్తి చేశారు.

# భారీ కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

లభిస్తాయి. వీటిని ఉద్యోగి లేదా వారి కుటుంబ సభ్యులు (తల్లిదండ్రులు, భార్యాపిల్లలు) మాత్రమే వినియోగించుకోవాలి. అయితే అంతర్గత విచారణలో వెల్లడైన వాస్తవాలు యాజమాన్యాన్ని షాక్కు గురిచేశాయి.. వేలాది మంది ఉద్యోగులు తమకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులను బంధువులుగా చూపి ఉచిత టికెట్లు పొందగా... మరికొందరు ఉచితంగా పొందిన టికెట్లను బయటి వ్యక్తులకు భారీ ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. మొత్తం 24,000 మంది సిబ్బందిలో దాదాపు 16% మంది (4,000 మంది) ఈ అక్రమాలకు పాల్పడ్డారు. విశేషమేమిటంటే, ఈ కుంభకోణంలో చిక్కుకున్న వారిలో మెజారిటీ ఉద్యోగులు ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ తర్వాత, అంటే టాటా గ్రూప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేరినవారేనని విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారం తీవ్రంగా పరిగణించిన టాటా యాజమాన్యం రికవరీ చర్యలు ప్రారంభించింది. మోసపూరితంగా వాడిన టికెట్ల విలువను ఉద్యోగుల జీతాల నుంచి వసూలు చేస్తున్నారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా జరిమానాలు విధించడమే కాకుండా... వారి ప్రయాణ సౌకర్యాలను రద్దు చేస్తున్నారు. ఇకపై నామినీలను చేర్చుకోవాలంటే చట్టపరమైన ఆధారాలు, రక్త సంబంధ నిరూపణ పత్రాలు సమర్పించడం తప్పనిసరి చేశారు. నష్టాల నుంచి గట్టెక్కి, సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని టాటా గ్రూప్ ప్రయత్నిస్తుంటే, ఉద్యోగులే ఇలాంటి అక్రమాలకు పాల్పడటం సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం ఆర్థిక నష్టమే కాదని, ఉద్యోగుల నైతికతకు సంబంధించిన సమస్య అని ఎయిర్ ఇండియా వర్గాలు స్పష్టం చేశాయి.

# అందరం డ్రగ్స్ పరీక్షలు చేసుకుందాం

## మహేశ్ కుమార్గౌడ్ సూచన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్ అంశంలో కెటిఆర్, ఆయన బ్యాచ్ పట్ల పలు అనుమానాలు ఉన్నాయని, అందుకే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ‘మీరు, మేము’ అందరూ డ్రగ్స్ పరీక్షలు చేసుకుందామని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో డగ్స్ సరఫరా జరిగిందని, తద్వారా కెటిఆర్ బ్యాచ్ డ్రగ్స్కు అలవాటుపడ్డారని ఆరోపించారు. హైదరాబాద్లోని గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ డగ్స్ రహిత సమాజం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇందులో భాగంగానే ఈగల్ బృందం దాడులు జరుగుతున్నాయని వివరించారు. పదేళ్ల కాలంలో పాడైన సంస్కృతిని బాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

# మహేష్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాం : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలన్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచనలను తాను స్వాగతిస్తున్నానని, ‘మనమే’ ఆదర్శంగా నిలుద్దామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ప్రతి డ్రగ్స్ కేసులో తన పేరును లాగాలని చూస్తే చట్టపరంగా నోటీసులను పంపిస్తానని హెచ్చరించారు. డ్రగ్స్ కేసును బిఆర్ఎస్పైన రాజకీయ కక్ష సాధింపు చర్యలకు వాడుకోవడం అసహ్యకరమైన రాజకీయాలకు నిదర్శనమన్నారు. డగ్స్ విషయంలో తాను ఏ పరీక్షకైనా సిద్ధమేనని, ఇది వరకే తాను పలుమార్లు స్పష్టం చేశానన్నారు. ఈ మేరకు కెటిఆర్తన ట్విట్టర్లో(ఎక్స్) పోస్ట్ చేశారు. మాదకద్రవ్యాలు మనుషులను రాక్షసులుగా మారుస్తాయని, బాధ్యతా యుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కూడా డ్రగ్స్ వాడకానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. డ్రగ్స్,అక్రమ పదార్థాల వాడకానికి తాను పూర్తిగా వ్యతిరేకమని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకాన్ని, చట్టవిరుద్ధ కార్యకలాపాలను తాము ఖండిస్తున్నామని, డ్రగ్స్ వాడుతున్న వారిని లేదా విక్రయిస్తున్న వారిని, వారి రాజకీయలతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠినంగా శిక్షించబడాలని సూచించారు.

# ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. తమిళనాడులో 234, పశ్చిమ బెంగాల్ 294, కేరళం 140, అసోం 126తోపాటు పుదుచ్చేరి 30, మొత్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం, క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. ‘ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పిలు, ఐజిలు, డిఐజిలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సిఎస్లు, డిజిపిలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్కు సంబంధించి బిఎల్ఒలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం‘ అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4కోట్ల మంది ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు. ‘ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్కాస్టింగ్ ఉంటుంది‘ అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.




# వామపక్షాలకు పునర్వైభవం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల పోరు చాలా సంక్లిష్టంగా, కఠినంగా ఉంటుందని అందరికీ తెలుసు, కానీ వామపక్షాలు చాలా విశ్వాసంతో ఉన్నాయి, వామపక్షాలు పునర్వైభవాన్ని చూస్తాయి, పశ్చిమ బెంగాల్ రాజకీయాలకు దిశానిర్దేశం చేసే స్థాయిలో ఒక బలమైనశక్తిగా రూపుదిద్దుకుంటాయి'' అని రాంచీలోని బిర్సాముండా విమానాశ్రయంలో ఆదివారం ఆయన పాత్రికేయులకు చెప్పారు. పార్టీ శతవార్షికోత్సవ సభలో పాల్గొనేందుకు ఆయన రాంచీ వచ్చారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఒక్కొక్కచోట పరిస్థితులు ఒక్కొక్కవిధంగా ఉన్నాయని అన్నారు. ‘కేరళలో, మేం వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన (ఎల్డిఎఫ్) ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాం, ఈ సంఘటనలో ఎలాంటి సమస్యలూ లేవు, మళ్ళీ మూడోసారి కూడా ఎల్డిఎఫ్ కూటమి విజయం సాధించి హ్యాట్రిక్ కొడుతుంది, ఎల్డిఎఫ్ విజయానికి ఎన్నో మంచి అవకాశాలు ఉన్నాయి, తమిళనాడులో సీట్ల సర్దుబాటు ఏర్పాట్లకు సంబంధించి ప్రస్తుతం డిఎంకె కూటమితో చర్చలు కొనసాగుతున్నాయి, ఒకటీ రెండు రోజుల్లో అన్ని స్పష్టంగా తెలుస్తాయి’ అన్నారు. అసోం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాలలో ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం ఎన్నికల తేదీలను ఆదివారం సాయంత్రం ప్రకటించింది. ‘ఈ రాష్ట్రాలలో బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే మా ప్రధాన లక్ష్యం’ అని డి.రాజా చెప్పారు. ఎల్పిజి వంట గ్యాస్ సరఫరాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెద్ద ఆటంకంగా ఉందని విమర్శించారు. ఆ తర్వాత డి.రాజా రాంచీలోని పార్టీ శతవార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 100 సంవత్సరాల చారిత్రక పోరాటాలను భారత కమ్యూనిస్టుపార్టీ ముందుకు తీసుకువెళ్ళే కార్యక్రమాల్లో నిమగ్నమై ఉందని తన ప్రసంగంలో చెప్పారు. ‘‘భారత కమ్యూనిస్టుపార్టీ కేవలం ఎన్నికల కోసమే మనుగడ సాగించడంలేదు, అంతకంటే ఎక్కువగా పార్టీ ప్రజాపోరాటాలలో నిమగ్నమై ఉంది, ప్రజలు వర్తమానకాలంలో ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించడంపైనే భారత కమ్యూనిస్టుపార్టీ ఈనాటికీ తన సర్వశక్తులనూ కేంద్రీకరిస్తోంది, జార్ఖండ్లో ప్రజలు జల్, జంగల్, జమీన్ (భూమి, నీరు, అడవులు) కోసం పోరాటాలు చేస్తున్నారు, ఈ సమస్యలన్నీ ఇంకా పరిష్కారం కాకుండా మిగిలిపోయాయి, భారత కమ్యూనిస్టుపార్టీ ఈ సమస్యలను పరిష్కరించేందుకే పోరాటాలు తీసుకువచ్చింది'' అని చెప్పారు. మాజీ మంత్రి శివకుమార్ ముఖర్జీ ఈ సభలో మాట్లాడుతూ, దేశంలో రైతులుప్రస్తుతం అత్యంత సంక్షోభ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ‘‘యుద్ధం పేరుతో ఈనాడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర గందరగోళం నెలకుని ఉంది, అమాయకులైన ప్రజలు మరణిస్తున్నారు, పెట్టుబడి కోసం జరిగే యుద్ధం ఈనాడు ఇంకా కొనసాగుతోంది'' అని ఆయన విమర్శించారు.

# మెడకు ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

చార్జిషీట్లు దాఖలు చేసినప్పటికీ మిల్లర్లు తమ రాజకీయ పలుకు బడిని ఉపయోగించి తప్పించుకు తిరుగుతున్నారని ఆరోపణలున్నాయి.

**ఆస్తుల జప్తునకు ఆదేశం**

మొండి బకాయిల వ్యవహారంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. కేవలం మిల్లర్లపైనే కాకుండా వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలను కూడా సేకరించాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీచేశారు. రికవరీ ప్రక్రియ పూర్తయ్యే వరకు సదరు మిల్లర్లు, వారి భాగస్వాముల ఆస్తు లను ఇతరుల పేరిట మార్పిడి(రిజిస్ట్రేషన్) చేయకుండా చూడాలని సబ్ రిజిస్ట్రార్లకు స్పష్ట మైన ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వా నికి రావాల్సిన ప్రతీ గింజా లేదా దాని సమాన విలువను వసూలు చేసే విధంగా కార్యాచ రణ చేపట్టారు.అయితే ఈ పరి స్థితి ముందే పసిగట్టిన కొందరు మిల్లర్లు ఇప్ప టికే తమ ఆస్తులను ఇతరుల పేరిట బదిలీ చేసినట్టు తెలుస్తోంది.

**2024–25లో రికార్డు రికవరీ**

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, రెండేళ్లుగా పౌరసరఫరాల శాఖ డీఎం సంధ్యా రాణి ప్రత్యేక శ్రద్ధతో మిల్లర్ల ఎంపిక చేపట్టారు. దీంతో క్షేత్రస్థాయిలో ఫలితాలు స్ప ష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్ లో రూ.33.84 కోట్ల విలువైన ధాన్యం రికవరీ 100 శాతం పూర్తిచేశారు. రబీ సీజన్ లో 30వేలకు పైగా మంది రైతుల నుంచి సేకరించిన ధాన్యంలో ఇప్పటికే 92.5 శాతం బియ్యం (1,28,879 మెట్రిక్ టన్నులు) రిక వరీ అయింది. మిగిలిన 10,270 మెట్రిక్ టన్నుల సేకరణ వేగ వంతంగా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

**ప్రతీ పైసాను రికవరీ చేస్తాం.. సంధ్యారాణి, డిఎం (పౌరసరఫరాల శాఖ)**

గడువులోగా బియ్యం అందించని వారిని డిఫాల్ట్ మిల్లర్లుగా గుర్తించాం. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. వారి నుంచి ఎలాగైనా సొమ్మును లేదా బియ్యాన్ని రాబట్టేందుకు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, సబ్ రిజి స్ట్రార్లు సమన్వయంతో దృష్టి సారించాం. ప్రభుత్వ ఆస్తిని కాజేయాలని చూస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. వడ్డీతో సహా వసూలు చేస్తాం. ప్రస్తుతం డిఫాల్ట్ మిల్లర్ల కుటుంబ ఆస్తులను గుర్తించడంలో నిమగ్నమయ్యాం.

# 18న కలెక్టరేట్ల ముందు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా మహిళా రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతోపాటు భూభారతి మార్గదర్శకాలలో సాదా బైనామాకు సంబంధించి సవరించి అమలు చేయాలని తదితర ప్రధాన డిమాండ్లపై ఈనెల18 కలెక్టర్ల కు మెమొరాండం అందజేయనున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగాభారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయొద్దని, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లును ఉపసంహరించుకోవాలని, పంటల బీమా అమలు చేయాలని కోరుతూ రైతుల సంతకాలను సేకరించి రాష్ట్రపతికి మెమొరాండం పంపించనున్నట్లు భాగం హేమంతరావు, పశ్యపద్మ. తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com